
జూన్ 9వ తేదీ విడుదల

APT_JUN_1950_7_2



ఆంధ్రా సీడెడ్ :— నవయుగ ఫిలిమ్స్, విజయవాడ,

మైసూరు, బొంబాయి :— ప్రకాశ్ పిక్చర్స్, బెంగళూర్ సిటీ.

నైజామ్ :— కర్ణాటక ఫిలిమ్స్ లిమిటెడ్, బెంగళూర్ సిటీ.

వివరములకు :

ప్రకాశ్ ప్రొడక్షన్స్,
శాంథోమ్, మద్రాసు.

అశోకా టాయిలెట్ పౌడరు

మీరు అనేక విధములైన పౌడర్లను ఉపయోగించి ఉండవచ్చును. ఈ మా అశోకా టాయిలెట్ పౌడరును కూడా ఒకసారి వాడి చూడండి. దీనిని వాడినచో ముఖమునకు చక్కని అందము నిచ్చును. చర్మము నునుపుగా, నిగనిగలాడునట్లుచేయును. వేసవి కాలపు ఉష్ణ తాపము నణచి మీకు హాయి నొసగును.



అశోకా టాల్కమ్ పౌడరు

ఈ పౌడరును ప్రత్యేకముగా చిన్న బిడ్డల వుపయోగార్థమై మేము తయారు చేసితిమి. మీ బిడ్డలకు దీనిని ఒకసారి వాడి చూడండి. పిల్లలకు దీనిని వాడినచో, పేలుట, చిడుములు మొదలైనవి లేకుండ, చర్మమును పరిశుభ్రముగా నుంచును.

అశోకా మార్కును గమనించి కొనవలయును.

దెశైగారి బ్రాహ్మీ అమ్ల

మెదడుకు చల్లదనమిచ్చి, నిడుపాటి అద్భుతమైన కేశములను పెంచును. వెండ్రుకలు రాలుట, అకాలమున నెరయుట, బట్టతల మొదలగు వ్యాధులను రాకుండ చేయును.

ధర 4 ఔన్సు బుడ్డి 1-0-0.

ఏజంట్లు:

1. శ్రీ చంద్రమౌళీశ్వర అండ్ కో., విజయవాడ.
2. క. వి. మాణిక్యారావు, బందరు.
3. ఇ. యం. శర్మ, ముమ్మిడివరము.
4. సత్తెనపల్లి మెడికల్ స్టోర్సు, గుడివాడ.
5. ప్రభాత్ మెడికల్ స్టోర్సు, గుడివాడ.
6. ఫోర్టుగేట్ డ్రగ్ హౌస్, తణుకు.
7. ఈశ్వరదాస్ అండ్ కో., రాజమండ్రి.

ఆలసింపకుడు

మీ సర్వరోగముల నివారణకై శ్రీ రాఘవేంద్ర యోగీశ్వరులవారితో సంప్రదించుడు. ఆశ్రమ నివేదిక 0-12-0 పోష్టు బిళ్లలకు పంపబడును.

శ్రీ యోగాశ్రమము

ఋషికొండ బీచ్, వాల్తేరు.

ఆంధ్రమహిళ

సంపుటి 7 :: జూన్ '50 :: సంచిక 2

ముఖచిత్రం—ధాన్యకటక భారతి.

చిత్రకారుడు.—కులపతి అడివి బాపిరాజుగారు.

సంపాదకురాలు : శ్రీమతి దుర్గాబాయి, యం. యే., బి. యల్.,

సహసంపాదకురాలు : శ్రీమతి చన్నఘంటమ్మ, యం. యే., యల్. టి.

ఆంధ్ర మహిళా సభ, మైలాపూర్

సంవత్సర చందా — అయిదు రూపాయలు

(2వ పేజీ తరువాయి)

పారిశ్రామిక విద్యాలయపు పరీక్షా ఫలితములు ఏప్రిల్ సంచికలో ప్రచురింపబడినవి.

*   *   *

ఎక్కువ శ్రద్ధతో విద్యార్థినులకు శిక్షణ గరపి సహకరించిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు మా ధన్యవాదములు.

మొత్తముమీద, 1949-50 సం॥ ఆంధ్రమహిళాసభ కార్యక్రమాన్ని విజయవంతముగానే కొనసాగించినదని చెప్పాలి. విద్యా పారిశ్రామిక శాఖల ఫలితములు తమ కృషిని చెప్పకయే చెప్పుచున్నవి. కళాశాఖకూడ పండుగ పబ్బములకు గోష్ఠుల నేర్పాటు చేయుటయేగాక, నర్సింగ్‌హోమ్ సహాయార్థం రమారమి రూ. 7000 చాచా ప్రదర్శనమువలన సంపాదించిరి. సారస్వత శాఖలో, పురాణ కాలక్షేపములు, పెద్దలచే ఉపన్యాసాలు జరిగాయి. బాబు రాజేంద్ర ప్రసాద్, రాజకుమారి అమృతకౌరు, ఇంకా ఎందరో ప్రసిద్ధ వ్యక్తులు సభకు వేంచేసి, అందలి కార్యక్రమాన్ని తిలకించారు. నర్సింగ్ హోమ్‌కు శంఖుస్థాపన జరిగింది. ఆంధ్ర తుపాను బాధితుల నిధికై సభ్యురాండ్రు, విద్యార్థినులు రూ. 11000, 4000 పాత బట్టలు వసూలుచేశారు. క్రీడా క్లబ్బు శాఖలు, గ్రంథాలయ శాఖలు, క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయి. సభ్యురాండ్రు, ఇంకా అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ, తమ విద్యా సంస్కృతులను పెక్కు విధముల చాటుతున్నారు. పండుగలూ, పబ్బాలూ, సన్మాన సభలూ, గౌరవ సభలూ, ఎంతో ఉత్సాహంతో, సంతోషంతో, సహకారంతో, స్నేహభావంతో జరుపుతున్నారు. ఈ కార్యక్రమాలన్నీ విజయవంతంగా, జరిపించిన కార్య నిర్వాహక వర్గానికి, సలహాలతో సహకరించిన ట్రస్టు బోర్డువారికి మా కృతజ్ఞత.

అ. చన్నఘంటమ్మ.   జ. జమునాబాయి.

సంపుటి 7 జూన్ 1950 సంచిక 2

యునెస్కో కర్తవ్యం

ప్రపంచాన్నంతా తుత్తునియలు చేస్తూన్న పరస్పర ద్వేషమనే భయానక మనస్తత్వాన్ని అతిక్రమించకపోతే, కల్లోలిత ప్రపంచం గాఢ తిమిరంలోకి జొచ్చుకొని పోతుందనీ ఈ ద్వేషాతిక్రమణ యునెస్కో పరిముఖంగానే జరుగాలనీ, ఇటీవల ఫ్లారెన్సులో జరిగిన, ఐదవ యునెస్కో సాధారణ సమావేశంలో, 1000 మంది ప్రతినిధులను హెచ్చరించారు, భారతీయ ప్రతినిధియు, మాస్కోలో భారతీయ రాయబారియునైన, సర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు.

ప్రపంచంలో అర్ధభాగం జనాభాయైన, ఆసియా ఆఫ్రికా ఖండాల ప్రజలు, అజ్ఞానములో, అవిద్యలో, అనారోగ్యంలో మ్రగ్గుతూ, సాధారణ జీవితాన్ని సుఖమయంగా జేయగల ప్రాథమిక అవసరాలైన తిన తిండి, కట్ట గుడ్డ, నిలువ నీడలేక, అల్లాడుచున్న యీ తరుణంలో, విజ్ఞాన వికాసాలతో, ఆధునిక విద్యా సంస్కృతులతో, ఆర్థిక సమృద్ధిలో, నోలలాడుచున్న ప్రభుత్వాలు ఆయుధ నిర్మాణంలో, యుద్ధసన్నాహంలో నిమగ్నులై వారి ధనసంపత్తిని దుర్వినియోగము చేయుట శోచనీయాంశమని వారు చెప్పారు. ఇది వాస్తవము. అంతులేని అణ్వస్త్ర శక్తిగాని, లక్షలాది విమాన దళముగాని, ప్రజానాశన కారణములు కాగలవు గాని, పీడిత ప్రజా హృదయాల్లో అగ్నిహోత్రంలా ప్రజ్వలిల్లుచున్న ద్వేషకణములను చల్లార్చలేమి, యుద్ధనిర్మూలనకు గాని, శాంతి స్థాపనకుగాని సాధనాలొక్కనాటికి కానేరవు. పాశవ బలంచే తాత్కాలికంగా సంభవించే విజయము ఏ పక్షమువారిదైతే మాత్రమే, మానవునిలోని మానవత్వమే నశించి, ఆదర్శాలు అంతర్ధానమైన యనంతరం, ప్రజాస్వామ్యంగాని, కమ్యూనిజమ్‌గాని, ఇంక ఏ రాజకీయ కక్షగాని, రూపుగలిగి నిలువగలదని ఎంచుట పరమ మౌఢ్యం.

పరజాతి పీడన స్వజాతి నాశనానికి కారణభూతమని విశ్వసించవలసిన ఆవశ్యకతను విస్మరిస్తూ, ప్రజాస్వామ్య ప్రభుత్వాలమని చాటి చెప్పుకుంటూ ఉన్న రాజ్యాలవారుకూడ జాతి

హంకారాన్ని చూపుచున్నారు. అమెరికాలోని నీగ్రోల దుస్థితి, ఆఫ్రికాలోని భారతీయులపై తెల్లవారల అత్యాచారాలు ఇందులకు ప్రబల నిదర్శనములుగా, చరిత్ర పుటలలో నల్ల అక్షరములతో లిఖింపబడుచునే యున్నవి.

మానవునియందలి వ్యక్తిత్వాన్ని గౌరవించక, వాని ప్రాథమిక హక్కులను అణగ ద్రొక్కుచూ, సంస్థ, సమాజముల ప్రాధాన్యములో, అందలి బీజములైన వ్యక్తులను దోపిడీ విధానములో, అనేక రకములైన కట్టుబాట్లలో, అస్వతంత్రులుగా జేయుచున్నంతకాలము, వారిలోని విప్లవ శక్తులకు ప్రోద్బలమే కలుగుతుంది. అదీగాక, ప్రభుత్వమేకక్షకు జెందినది, ఏ ప్రభుత్వముయొక్క ఆశయములు ఉత్కృష్టమైనవి అను విమర్శ సామాన్య ప్రజకెందుకు? వారికి వృత్తి, భుక్తి, వసతి, కలిగించేది ఏ పరిపాలనయో, అటే వారి మక్కువ మొగ్గు చూపగలదు.

ఐక్యరాజ్యసమితియొక్క ఆదర్శములకు వ్యతిరేకంగా, అస్త్రబలమును బట్టి, రాజకీయ కక్షలను బట్టి చీలికలై, సమితిలో రెండు బలవర్ధక కక్షలుకాగల సూచనలు కన్పట్టుచున్నవి. వివిధరాజ్యాల నడుమ విస్తరిల్లిన అనుమానము, ద్వేషము ఇందులకు కారణములగుచున్నవి. ఒకరినొకరు అవగాహన చేసికొనగల సహన స్వభావము పెంపొందించుకొని, వెనుకబడియున్న దేశాల యభివృద్ధికై, సమితి పరిముఖంగా, ధనవస్తు సాంకేతికుల సహాయము లభించినచో, అన్ని జాతులవారు, అన్ని రాజ్యాలవారు, సమాన అవకాశ ప్రతిపత్తులు కలవారు కాగలరు. అదియే ప్రజాస్వామ్యాభివృద్ధికి మూలము కాగలదు.

ఇట్టి నిర్మాణానికై, అంతర్జాతీయ సహకార ద్రవ్య నిధిని ఐక్య రాజ్య సమితివారు ఏర్పరుచుట ఎంతయు అవసరమని చెప్తూ, అస్త్రబలంయొక్క అసంపూర్ణతను లోకానికి ఋజువుచేస్తూ, పరస్పరద్వేష భూయిష్ఠమైన వాతావరణను మార్చి, సహనము సౌభ్రాతృత్వము, సమానత్వము నిర్మించవలసిన బాధ్యత యునెస్కో, అంటే ఐక్యరాజ్యసమితి, విద్యా శాస్త్రీయ సాంస్కృతిక పరిషత్తు సభ్యులదని, రాధాకృష్ణనుగారిచ్చిన ఉద్బోధ ఎంతయు అనుసరణీయమైనది, ఆవశ్యకమైనది.

★

హిందూ స్త్రీల హక్కు బాధ్యతల పునరుద్ధ.

శ్రీ. అయ్యదేవర కాళేశ్వరరావుగారు, ఎమ్. ఎల్. ఎ.

హిందూ ధర్మశాస్త్ర సవరణనుగూర్చి శాసనసభలలో, ప్రత్యేక సమావేశాలలో, ఉపన్యాసాలలో, వార్తా పత్రికలలో అనేక తర్జన భర్జనలు జరుగుచున్నవి సంస్కర్తలు క్రోడీకరించి నూతన రాజ్యాంగము ననుసరించి సంస్కరణ మార్గములో పురోగమించాలెనని, సనాతనులు ఇందు ఏ విధమైనమార్పు పనికిరాదని, యిటీవల జరిగిన ప్రత్యేక సమావేశములో కూడ వాదోపవాదములు చెలరేగినవి. వేదకాలమునాటి స్త్రీల హక్కులను వివరిస్తూ, ప్రస్తుతము జరుగవలెనన్న సంస్కరణలో ఆక్షేపణలేదని రచయిత ఉద్ఘాటించుచున్నారు. సం॥

ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి ।
సూర్యా చంద్ర మసౌ విధృతౌ తిష్ఠతః ।
ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి ।
ద్యావా పృథివ్యౌ విధృతే తిష్ఠతః ॥
ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి ।
నిమేషా ముహూర్తా అహోరాత్రాణ్యర్ధ మాసామాసా
ఋతవః సంవత్సరా ఇతి విధృతాస్తిష్ఠంతి ॥
ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి ।
ప్రాచ్యోఽన్యానద్యః స్యన్దన్తే శ్వేతేభ్యః పర్వతేభ్యః ।
ప్రతీచ్యోఽన్యాః యాంయాంచ దిశమను ॥

ఈ మహామంత్రము వేదశిఖరములని, వేదముల సారమని చెప్పబడెడి ఉపనిషత్తులలోకెల్ల మిగుల గొప్పదగు బృహదారణ్యకోపనిషత్తుయొక్క 3వ అధ్యాయము 8వ బ్రాహ్మణములోని 9వ మంత్రమై యున్నది. ఏ జాతియొక్కగాని, ఏ కాలములోనైనాగాని నాగరికతయొక్క ఔన్నత్య క్షీణతలకు, కొలతబద్ద, ఆ జాతిలో ఆ కాలమున స్త్రీలకుగల స్థానమే. నేటికి పదివేల సంవత్సరముల క్రింద, భరతవర్షములో, జనకమహారాజుయొక్క దర్బారులో జరిగిన పండితుల మహాసభలో, తనతో వాదోపవాదములు చేయు చున్న బ్రహ్మచారిణి, మహా విద్వాంసురాలునగు 'గార్గి' యను నామెను సంబోధించుచు యాజ్ఞవల్క్య మహాఋషి ఇచ్చిన ప్రత్యుత్తరములలో పై మహా మంత్రము భాగమై యున్నది. "ఓ గార్గి! అక్షరుడైన పరమాత్మని యొక్క ప్రచండమైన శాసనమువలననే, సూర్యుడు, చంద్రుడు తమ తమ స్థానములలో నున్నారు. ఓ గార్గి! అక్షరుడైన పరమాత్మయొక్క ప్రచండమైన శాసనము వలననే ఆకసము, భూమి తమ స్థానములోనుంచి పడిపోకుండ నిలచియున్నవి. ఓ గార్గి! అక్షరుడైన పరమాత్మయొక్క ప్రచండమైన శాసనము వలననే, నిమిషములు, ముహూర్తములు, రాత్రింబగళ్లు, పక్షములు, మాసములు, ఋతువులు, సంవత్సరములు వరుస తప్పకుండ తమ తమ కాలములలో వచ్చుచున్నవి. ఓ గార్గి! అక్షరుడైన పరమాత్మయొక్క ప్రచండమైన శాసనము వలననే కొన్ని నదులు శ్వేత పర్వతముల నుండి తూర్పుగా ప్రవహించుచున్నవి. మరికొన్ని నదులు పశ్చిమముగా ప్రవహించుచు అటులనే పోవుచున్నవి. ఇతరనదులు తమ పోకడలలో ఆగకున్నవి." అని యీ మంత్రమున కర్థము.

ఆ కాలము భారత నాగరికతలో స్వర్ణయుగము. జనకమహారాజుయొక్క పండిత సభలో ఆయన పెట్టిన గొప్ప పందెమును గెలుచుటకు యాజ్ఞవల్క్యుడు ప్రయత్నించెను. ఆయన ననేక ప్రశ్నలనడిగి యోడింపవలెనని పండితులనేకులు యత్నించిరి. అన్ని ప్రశ్నలకును ఆయన సహేతుకమైన ప్రత్యుత్తరముల నిచ్చుచుండెను. ఎవరును ఆయనను గెలవలేక పోయిరి. ఆ సమయములో గార్గియను పైన జెప్పబడిన విదుషీమణి లేచి తాను కొన్ని చిక్కు ప్రశ్నలను అడిగెదనని వాటికి తగిన సమాధానములను యాజ్ఞవల్క్య ఋషి చెప్పినట్లైనచో యెవరును ఆయనను ఓడించలేరనిన్ని చెప్పినది. అందరును అంగీకరించిరి. ఆమె అనేక క్లిష్టమైన ప్రశ్నలను వేసినది. ఆ మహాఋషి వాటి కన్నిటికిని తగిన ప్రత్యుత్తరముల నిచ్చెను. సభికులందరును తృప్తిచెందిరి. ఇక

హిందూ స్త్రీల హక్కు బాధ్యతల పునరుద్ధరణ

ఆయనను ఓడించలేరని గార్గి చెప్పెను. ఆ దర్బారులో ఆ మహా ఋషికి ఆ గొప్ప పందెము బహూకరించబడెను. బాలురు యిరువైయైదు సంవత్సరములు వెళ్లు వరకును బాలికలు పదునెనిమిది సంవత్సరములు వెళ్లు వరకును విధిగా బ్రహ్మచర్య శిక్షణ విధానము ననుసరించి సకల శాస్త్రములను నిర్బంధముగా అభ్యసించిన కాలమది. ఆధ్యాత్మిక, మానసిక శాస్త్రములేగాక ప్రకృతి శాస్త్రములు సాంఘిక ధర్మశాస్త్రములుకూడ బాల బాలికలకు నేర్పబడెను. వృత్తి విద్యలుకూడ నేర్పబడెను. బాలికలకు గృహ పరిశ్రమలు ప్రధానముగ నేర్పబడెను. వేదమంత్ర రచయితలలో స్త్రీలుగలరు.

బృహదారణ్యకోపనిషత్తుయొక్క నాల్గవ అధ్యాయము, ఐదవ బ్రాహ్మణములో యాజ్ఞవల్క్యఋషి తన భార్యయైన మైత్రేయికిచేసిన బ్రహ్మజ్ఞాన ముపదేశములు ప్రధానస్థానము నాక్రమించుచున్నవి. ఆమె గొప్ప విద్వాంసురాలు. పరబ్రహ్మతత్వమును గూర్చి మోక్షమునుగూర్చి భర్తతో వాదోపవాదములు చేసెను. ఆమెయొక్క సందేహము లన్నిటిని ఆయన తీర్చెను. నాల్గవ అధ్యాయము, ఐదవ బ్రాహ్మణములోని ఆరవ మంత్రములో ఆయన ఆమెతో నిటుల చెప్పినటుల కలదు. “ప్రియురాలా! భార్య భర్తను ప్రేమించుట భార్యకొరకు కాదు. తమ ఆత్మోన్నతికై ప్రేమించుచున్నాడు. పుత్రులను తల్లి దండ్రులు ప్రేమించుట పుత్రుల కొరకుగాదు తమయొక్క ఆత్మోన్నతికై ప్రేమించుచున్నారు. మనము భూతములను ప్రేమించుట వాటికొరకు గాదు. మన ఆత్మోన్నతి కొరకై ప్రేమించుచున్నాము. (మానవుని హృదయములో ప్రేమ అను సద్గుణము నాటబడి యున్నది. దానికి దయ అనికూడ పేరు. అతను తన దారాపుత్రాదులను పొరుగు వారిని ప్రేమించుట మూలముగా నా సద్గుణములను వృద్ధిచేసికొనని యెడల నైతిక పతనమొందుచున్నాడు. కుటుంబము యొక్కయు ఇరుగు పొరుగు వారి యొక్కయు ప్రేమ, లోకమును విశ్వమును ప్రేమించుటను నేర్చుకొనుటకు ముఖ్యమైన మెట్టు. భగవంతుడు ప్రేమస్వరూపుడు గనుక ఆయనను పొందుటకు మాతృదేశమును మానవకోటిని సమస్త భూతములను విశ్వమును ప్రేమించుట

అవసరమైయున్నది) నా ప్రియురాలైన మైత్రేయి! పరమాత్మనుగూర్చి వినవలెను. ధ్యాన మననములను చేయవలెను. వినుట వలనను ధ్యాన మననముల వలనను ఆయనను తెలిసికొని నపుడు పైనచెప్పబడిన దంతయు పూర్తిగా తెలియును.” ఆమెకు ఆయన చేసిన బోధలలో చేరిన పదవ మంత్రములో మోక్షమునుగూర్చి యిటుల చెప్పినాడు. “పరిపూర్ణత్వమును జెందిన ముక్తుడైన జీవాత్మ పరమేశ్వరుడనెడి మధుర వీణాగానము చేయునప్పుడు దాని వివిధ ప్రత్యేక శృతులను వేరువేరుగా తెలిసికొనజాలము. అవన్నియు ఆ వీణా గానములో కలిసిపోవును. అటులనే ముక్తుడైన జీవాత్మ కూడ పరమాత్మలో చేరిపోవును.” అని చెప్పబడినది.

బృహదారణ్యకోపనిషత్తుయొక్క ఆరవ అధ్యాయం, నాల్గవ బ్రాహ్మణము, 11వ మంత్రములో యెవరైతే తనకు పూర్తియగు దీర్ఘాయుర్దాయము కలిగినట్టియు, మంచి పండితుడైనట్టియు పుత్రుడు కావలెనని కోరునో అతడు తన భార్యతో కలసి చేయవలసిన వ్రతము భుజించవలసిన పాయసము చెప్పబడినది. అటులనే 17వ మంత్రములో తనకు సంపూర్ణమగు ఆయుర్దాయము కలిగినట్టియు, మంచి పండితురాలైనట్టియు కుమార్తె కావలెనని కోరువాడు తన భార్యతో సహా చేయవలసిన వ్రతము భుజించవలసిన పాయసము చెప్పబడియున్నది. ఈ విధముగా ఆ కాలములో విద్వాంసులైన కుమారులను కుమార్తెలను కావలెనని సమానముగా కోరినటుల తెలియుచున్నది. బృహదారణ్యకోపనిషత్తుయొక్క 1వ అధ్యాయము, 4వ బ్రాహ్మణము, 3వ మంత్రములో స్త్రీయొక్క యుత్పత్తిని గురించి యిటుల చెప్పబడినది. “(ప్రథమ) పురుషుడు సుఖముగా నుండలేదు. ఒంటరిగా నుండు వారికి సుఖములేదు. తనకు సహచారిణి కావలెనని కోరెను. శరీరమును పెద్దదిగ చేసి భార్యా భర్తలు కౌగలించుకొని యొకటిగా నున్నటుల సృష్టించుకొనెను. అంతట ఆ పెద్ద శరీరమును రెండు సమ భాగములుగా విభజించెను. అందులోనుండి భార్యా భర్తలిరువురుద్భవిల్లిరి. కావున యీ శరీరము (పురుషుని శరీరము) తనలో సగభాగమే. రెండుసమ చెక్కలుగా చీల్చబడిన బఠాణిగింజయొక్క ఒక చెక్కవలె సగభాగమైయున్నది. మిగిలిన సగభాగము (వివాహమాడి)

భార్యను తెచ్చుకొన్నప్పుడే పూర్తియగును. అప్పుడాయన ఆమెతో కలిసిపోయి యేకమగును. వారిద్దరి సంయోగము నుండి మానవులు జన్మించిరి." అని యాజ్ఞవల్క్య మహర్షి చెప్పెను ఈ మంత్రమువలన పురుషుడు, స్త్రీ ఒకే శరీరము లోని సగ భాగములనియు, సమాన హక్కు బాధ్యతలు కల వారనియు తెలుపుచున్నది. భారత వర్షముయొక్క ఆదర్శము అర్ధనారీశ్వరుడగు ఈశ్వరుడు. ఆయన తన భార్యయగు పార్వతిని (శక్తిని) సగభాగముగ చేసికొని యున్నాడు. ఉపనిషత్తులు గృహస్థాశ్రమమును ప్రశంసించుచున్నవి వివాహము కాకముందు పురుషుడు సుఖముగా నుండడు. తనలో సగముగానే యుండును. ఈ కొరతను తీసివేసి తానుపూర్తి యగుటకుగాను వివాహమాడి భార్యను తెచ్చుకొనును, అని శ్రీ శంకరాచార్యుల వారే తమ భాష్యములో వ్రాసినారు. తైత్తిరీయోపనిషత్తుయొక్క శిక్షావల్లి యేకాదశ వీవ మంత్రములో "మాతృదేవో భవ। పితృదేవో భవ। ఆచార్య దేవో భవ। అతిథిదేవో భవ॥" అని చెప్పబడి యున్నది. ఇందు వలన తండ్రికంటెను, ఆచార్యుని కంటెను, అతిథికంటెను ప్రథమ గౌరవ స్థానము తల్లి కివ్వబడ్డది. సుఖమైనట్టియు, శాంతి యుతమైనట్టియు, ప్రేమపూరితమైనట్టియు, ఆత్మోన్నతికి తోడ్పడునట్టియు కుటుంబము భారత జాతీయ జీవనమునకు ప్రథమ పునాదిగ చేయబడినది. స్త్రీలకును పురుషులకును సర్వవిధముల సమానహక్కు బాధ్యతలు కలుగజేయబడినవి. ఆస్తిపంపిణీకిని వారసత్వమునకును సంబంధించిన హక్కులు గూడ స్త్రీ పురుషులకు సమానముగానే యుండెను.

పిమ్మట చాల శతాబ్దములకు విదేశీయుల దండయాత్రలు మొదలైన కారణములవల్ల స్త్రీలయొక్క గౌరవ ప్రతిపత్తులు, హక్కుబాధ్యతలు క్షీణించినవి. బాల్యవివాహము లేర్పడినవి. స్త్రీలు వేదములు చదువకూడదనిరి. సూత్రముల కాలములో ఆస్తి హక్కులు నశించినవి. మనుస్మృతిలో స్త్రీ అస్వతంత్రురాలు. చిన్నతనములో తండ్రియొక్కయు, పడుచుతనములో భర్తయొక్కయు వృద్ధాప్యములో కుమారుని యొక్కయు పోషణలో స్త్రీ యుండవలెను; ఆమెకు ఆస్తి యందు హక్కులేదు అని వ్రాయబడినది. ఇది మనువు నిజముగా వ్రాసినది కాదనియు, దరిమిలా స్వార్థపరులైన పురుషులు మనుస్మృతిలో యిరికించినారనియు కొ చెప్పుచున్నారు. ఏది సత్యమో తేల్చుట కష్టము. మనుస్మృతి లోని స్త్రీ అస్వతంత్రురాలను సిద్ధాంతము మీదనే బ్రిటిషు వ్యాఖ్యాన కర్తలు తమగ్రంథములను వ్రాసినారు. అవి బ్రిటిషు కోర్టులలో ప్రమాణమైనవి. మనువు కాలమునాటి నుంచి తరవాత వచ్చిన స్మృతికర్తలు, యాజ్ఞవల్క్య స్మృతికి వ్యాఖ్యాతలగు మితాక్షరమును రచించిన విజ్ఞానేశ్వరుడు దాయభాగమును రచించిన జీమూతవాహనుడు స్త్రీలయొక్క ఆస్తిహక్కులను పునరుద్ధరించుటకు, వృద్ధిచేయుటకు ప్రయత్నించుచు వచ్చిరి. విజ్ఞానేశ్వరుడు తన వ్యాఖ్యానములో స్త్రీకి భర్త, తల్లిదండ్రులు, బంధువులు యిచ్చిన ఆస్తియందు స్త్రీధనముగా దాన విక్రయాది సంపూర్ణ హక్కులున్నట్లే, ఆమెకు భర్తనుండిగాని తండ్రినుంచిగాని వారసత్వముగా వచ్చిన ఆస్తిలోకూడ దానవిక్రయాది సంపూర్ణ హక్కులుగల స్త్రీధనమే అగుచున్నదని వ్రాసినాడు. జీమూతవాహనుడు అవిభక్త కుటుంబములో కూడ మరణించిన పురుషునియొక్క భార్య తనభర్తయొక్క ఆస్తిని జీవిత కాలమువరకు అనుభవించ వచ్చునని వ్రాసినాడు. మితాక్షర వ్యాఖ్యానములో అవిభక్తకుటుంబములో వితంతువుకు మనోవర్తి మాత్రమేకలదు. ఇటుల స్త్రీల ఆస్తి హక్కులు అభివృద్ధియగుచున్న కాలములో బ్రిటిషువారి పాలనక్రిందికి మనదేశము పోవుటయు, బ్రిటిషు వ్యాఖ్యాతలగు మెక్నాటన్, స్ట్రేంజ్ మెయిన్ మొదలగు వారు మనువుయొక్క స్త్రీ అస్వాతంత్ర సిద్ధాంతమునకు ప్రాముఖ్యతనిచ్చి అభివృద్ధి నిరోధమును కలగజేసినారు. స్త్రీలయొక్క హక్కులు అభివృద్ధి కాకుండా బ్రిటిషు కోర్టుతీర్పులనెడి యినుపసంకెళ్లతో బంధించబడినవి. అదివరకు ప్రజాభిప్రాయమును బట్టి అభివృద్ధికరమైన మార్పులుజరుగు అవకాశముండెను. ఈమార్పులు ఆచారము లయ్యేవి. ఆచారములనే అంగీకరించుచు స్మృతికర్తలు వ్యాఖ్యానకర్తలు వ్రాసేవారు. బ్రిటిషు పాలకులురాగానే హిందూలాను (ధర్మశాస్త్రమును) అప్పటికి నిలచియున్న ఆచారాములో క్రోడీకరించి, ఆంగ్లేయ పండితులువ్రాసిన గ్రంథములు ప్రమాణములుగ తీసికొని, వాటిని కోర్టుల తీర్పుల

హిందూ స్త్రీల హక్కు బాధ్యతల పునరుద్ధరణ

ద్వారా ఖచ్చితముగా అమలుజరిపినారు. జిల్లాకోర్టు హైకోర్టు ప్రీవికౌన్సిలు తీర్పులు పరమప్రమాణములైనవి. వాటిని మార్చు అధికారము శాసన సభలకు గూడ లేకుండెను. హిందువుల విషయములోను హిందువుల ఆచారముల విషయములోను శాసన సభలు జోక్యము కలుగజేసి కొనకూడదని వారిరువు వారు పూర్తిగా అభివృద్ధి నిరోధకులు; ప్రస్తుత హిందూ చట్టమువల్లను ఇపుడు మనలోనున్న హిందూ ఆచారముల వల్లను లాభములను పొందుచున్నవారు. ఆంగ్లేయ పండితులు ఆంగ్లేయ కోర్టులు వారికి ప్రమాణములట! ప్రాచీన కాలము నుండి స్మృతులలోను ఆచారములలోను ఎన్ని మార్పులు జరిగినవో వారు గమనించ దలచలేదు. వేదకాలమునకు పోవుటకు వలయు మార్పులు చేయుటకు వారికిష్టములేదు. వారికి కావలసినది ఇపుడు నిలచియున్న ఆచారములు మాత్రమే; తీర్పులుమాత్రమే. భారతీయ ప్రతినిధులతో కూడిన శాసన సభలతో ప్రజాభిప్రాయము ననుసరించి చట్టముల ద్వారా మార్పులు చేయగూడదని, శాసన సభలు ఈ విషయములలో జోక్యము పుచ్చుకొనుట వలన మతమునకు అపాయము కలుగుచున్నదని వీరి చెప్పేవారకు విఘ్నకమైనది. సహగమనమును నిషేధించు చట్టము, వితంతువులు పునర్వివాహము చేసికొనుటకు అనుమతి నిచ్చు చట్టము, చాలకాలము క్రిందనే ప్యాసయినవి. ఇటీవల భారతీయ శాసనసభ రాష్ట్రీయ శాసన సభలు చాల అభివృద్ధికరమైన చట్టములుచేసినవి. బాల్యవివాహములు నిషేధించిన శారదాచట్టము, వివిధకులముల మధ్యను ఒకేకులములోని అంతఃశాఖల మధ్యను వివాహములు నిషేధములు కావు అని అనుమతించు చట్టము, సగోత్రీకులు, సప్రవరీకులు వివాహమాడ వచ్చునను చట్టము, భారతశాసన సభవారు మంజూరు చేసియున్నారు. కొన్ని పరిస్థితులలో కోర్టుల ద్వారా వివాహ విచ్ఛేదము పొందుటకు హక్కును కలుగ చేయు చట్టము మదరాసు రాష్ట్ర శాసన సభలలోను బొంబాయి రాష్ట్ర శాసన సభలలోను మంజూరై ఆ రెండు రాష్ట్రములలోను అమలులో నున్నవి. కొన్ని విషమపరిస్థితులలో భార్య భర్తనుండి విడిగా కాపురము చేయుటకు హక్కు, అందుకు కావలసిన ఇల్లు మనోవర్తి, భర్త ఆమెకుఇచ్చు బాధ్యత కలుగచేయు ఢిల్లీ శాసన సభవారు చట్టమును చేసినారు. ఆస్తిసంక్రమణ విషయములో జ్ఞాతులకన్న సోదరీ పుత్రులకు సోదరులకు మనుమరాండ్రకు వితంతు కోడండ్రకు దగ్గర వారసత్వము కల్పించు ఏర్పాటు చేసిన చట్టములు ప్యాసైనవి; ఆస్తిహక్కుల విషయములో హిందూ స్త్రీల ఆస్తిహక్కుల చట్టమును ఢిల్లీ శాసన సభ చేసి ప్యాసు చేసినది, దానిని బట్టి, మరణించిన భర్త ఆస్తిలో కుమారుడితోపాటు సమానభాగము జీవితకాలమువరకు రావలెనని చట్టముచేయబడ్డది. ఇటులనే వితంతుకోడలికి కూడ హక్కుకలుగ చేయబడినది. సమిష్టి కుటుంబములో వితంతు భార్య తన మరణించిన భర్తయొక్క భాగమును జీవితకాలములోపు అనుభవించు హక్కు కలుగచేయబడినది. ఈ చట్టము వితంతు స్త్రీని మనోవర్తిభరణములో నుండి విముక్తిచేసి తన జీవితకాలమువరకు భర్త యొక్క భాగపు ఆస్తిని అనుభవించు హక్కు కలుగచేసినది. ఇది స్త్రీల హక్కుల పునరుద్ధరణకు గొప్ప మెట్టు.


స్త్రీలు ఇపుడు కోరినవి వారికి న్యాయముగా రావలసిన హక్కులు రెండు.

(1) స్త్రీకి తరతరమునుండి వారసత్వముగా సంక్రమించిన ఆస్తియందు జీవితకాలపు హక్కు మాత్రము గాక పురుషులకువలెనే సంపూర్ణ దానధర్మ విక్రయ హక్కులు గల హక్కులుకావలెను. క్రైస్తవ స్త్రీలకును ముస్లిం స్త్రీలకును వారివారి ఆస్తి చట్టములలో సర్వవిధములైన ఆస్తికిని సంపూర్ణ హక్కులు గలవు. ఇట్టిసంపూర్ణ హక్కులనే హిందూస్త్రీలుకూడ కోరుచున్నారు. తమ స్త్రీధనము నందు మాత్రము హిందూ స్త్రీలకు సంపూర్ణ హక్కులు గలవు. వారసత్వము ద్వారావచ్చిన ఆస్తికికూడ సంపూర్ణ హక్కులను కోరుచున్నారు.

(2) తమ తండ్రియొక్కగాని తల్లియొక్కగాని ఆస్తిలో కుమారులకును కూతుళ్లకును సమాన భాగమును కోరుచున్నారు. (క్రైస్తవులలో కూతుళ్లకు కుమారులకు సమాన భాగములు గలవు.)

ఇంతేగాక బహుభార్యానిషేధ చట్టమును కొన్ని విషమ పరిస్థితులలో వివాహ విచ్ఛేద హక్కును మద్రాసు బొంబాయి రాష్ట్రములలో నిపుడున్నటులే

(48-వ పేజీ చూడుడు)



జాజిమల్లి

అడివి బాపిరాజు

రెండవ గుచ్ఛము

౧

ఎన్నో అందాలు ఎందరి జీవితాలలోనో ప్రత్యక్షం కాకుండానే, భావమాత్రంగానైనా దర్శనం ఇవ్వకుండానే, ఈ జగత్తు నడిచిపోతూ ఉంటుంది. కాని ప్రాథమికమైన సౌందర్యభావం మానవులందరి జీవితంలోనూ వికసించి ఉండనే ఉంటుంది. జీవితాన్ని నిజంగా అర్థంచేసికోలేని కర్కశవాదులు రెండుచేతులా ఆకాస్త అందాన్ని కూలద్రోసి, ధూళినిండిన దారులలో యాత్ర సాగిస్తారు.

పల్లెటూరివారి జీవితాలలో కవిత్వమూ, సంగీతమూ నిత్యకర్మంలో అంతర్వ్యాప్తమైపోతాయి. అనంతమూ ఒడ్డులేని సముద్రము, లోతులు తెలియని కడలి, కర్మాలకు ఎప్పుడూ ఏవో చిరుగాలుల ప్రసరించిన [illegible] ఉద్భవింప చేసేవి.

పల్లెవారికి సముద్రం ఒక మహారాజ స్నేహితుడు. కాబట్టే వాళ్ల జీవితాలలో అనంతమైన దూరాలు, లోతులు మించిన పారాలు. వాళ్లు ఓడలు నిర్మించే విశ్వకర్మలూ, ఆ ఓడలు దెసల కడపలకు దేలిపోజేసే నావికులు కాగలిగారు.

పద్మమ్మకూడా తండ్రి తెప్ప నావమీద చేపలకోసం ఉదయ దిశాంచలాలు దాటి వెళ్లేటప్పుడు తానూ వెళ్లింది. ఉప్పునీళ్లలో చేపపిల్లలా ఈదగలిగేది. ఎంత మునిగినా, లోతులందని నీలజలాలు, ఎంత ఈదినా దూరమందని కెరటాలు; కొండవిరిగినట్లు ఒడ్డుకు దొర్లిపడే తరంగాలు, ఆకాశాలతో గుసగుసలుపోయే కల్లోలాలు; ఏడనుంచి, ఏడకు పోతాయో తెలియని పారావార ప్రవాహాలు పద్మమ్మ జీవితాన్ని సుళ్లుమట్టి, ఆ బాలికకు అవ్యక్త వాంఛల్ని ఎన్నో అందిస్తూ ఉన్నాయి.

ఏడు సముద్రాలకూ పెంపుడుబిడ్డ పద్మమ్మ. ఆ సముద్రాల లావణ్యం అంతా పద్మమ్మలో నవనవలాడుతూ ఉండేది. ఆ నవ్వూ కంఠమూ లావణ్యం దాల్చింది.

[illegible] అయిన పద్మాలుకు గాన విద్యా శిక్షణ ప్రారంభించాడు. కెరటాలలోని, తుఫానులలోని, ఆకాశ నీలాలలోని, అనంత దూరాలలోని మాధుర్యాలు వాకలు కట్టించుకొన్న ఆమె కంఠం ఆ శిక్షణకు ఏలా లొంగుతుంది? సముద్రానికి ఆనకట్టలు కట్టగలరా? లోతులకు కొలతలు వేయగలరా? నరసింహామూర్తి కష్టపడి కర్ణాటక బాణి సంపాదించుకొన్న

సంగీతం నేర్చేరు, కాకలీలో, కాకలి చుట్టుప్రక్కల గ్రామాలలో, సంగీత సభలు చేసి 'పాటకుడు' అని పేరుపొందిన వాడే! అయితేమాత్రం సంగీత సముద్రాలకు వారధులు కట్టడానికి అతడు శ్రీరామచంద్రుడా ఏమన్నానా!

పద్మావతి తన రాగాలు తానే సృష్టించుకొనేది. తన గతులు తానే నిర్మించుకొనేది. సముద్రాలకు సంప్రదాయాలు ఎవరు శిక్షించగలరు! నరసింహామూర్తికి మతిపోయింది.

౨

పద్మావతి ఒంటినిండా నగలు దింపాడు బుచ్చి వెంకట్రావు. ఆనాటికి అవి పదమూడువందల ఏభైరూపాయల మూల్యం కలిగిన బంగారం నగలు. తాను పెద్దచేపల వర్తకుడవుతున్నాడు. యుద్ధంలో దేశాలు తిరిగివచ్చినవాడవటం చేత ఇంతోకొంతో లోకజ్ఞానం సంపాదించుకున్నాడు. దేశాలు తిరిగేవారికి దుమ్ముధూళిలా అక్కర్లేదనుకొన్నా జ్ఞానం కాస్త అంటుకు తీరుతుంది. కాని ఇది ఏమిటి అని ప్రశ్న వేసుకొనే యోగంతో బయలుదేరిన పురుషునికి అతడు ఎంత తక్కువబుద్ధి శ్రేణిలోవాడైనా లోకజ్ఞానం బాగా వచ్చితీరుతుంది. బుచ్చి వెంకట్రావు తన జీవితానికి నిచ్చెనలు అమరించి, పైకి వెళ్ళాలి అన్న పట్టుదలకలిగిన సంకల్పజీవి. అతడు సముద్రమార్గాలకి ఈదుకు వెళ్ళిన మనిషి. యుద్ధంలో రంగూనుకు వెళ్ళినప్పుడు సముద్రం ఓడమీద దాటినవాడే. ఏరేదైనా సముద్రానికి అవతలవొడ్డు రేవు కాదు. సముద్రంవేరు, రేవులువేరు. రేవులన్నీ, సముద్రానికి సేవకులవంటివి అని బుచ్చి వెంకట్రావు ఊహించుకొన్నాడు.

తాను తన జీవితంలో గొప్పవాడవటం తన పద్మావతి కొరకే. తనకు తన పద్మావతికి ఒకసారే చదువురావాలి. తన జీవితం చెట్టు అయితే ఆ చెట్టంతా నిండి వికసించిన పూవులప్రోగు పద్మావతి. పూవులులేనిచెట్టు అందమే కాదు. చెట్టు లేక పూవులు ఎట్లా వికసించగలవు.

ఇద్దరికి ఒకడే ప్రయివేటుమాష్టరు. ఇద్దరికి ఒకే పాఠాలు చెప్పుతున్నాడు ఆ మాష్టారు. పద్మావతి డబ్బున గ్రహిస్తుంది డబ్బున మరచిపోతుంది. బుచ్చి వెంకట్రావు ఒక పట్టాన పాఠం త్వరగా గ్రహించలేడు. గ్రహించిన పాఠం త్వరగా మరచిపోడు. కాబట్టి తన భార్యకు తానే చెపుతుండేవాడు వెంకట్రావు. ఏపాఠమైనా నాలుగుసార్లు త్వరగా గ్రహించి వెంటనే మరచిపోయినతరువాత ఐదవసారి పద్మావతికి పాఠం శాశ్వతంగా వచ్చేది. ఈ విధంగా ప్రవాహాలు సుళ్ళు, ప్రవాహాలు సుళ్ళుగా వారిద్దరి జీవితాలలోకి జ్ఞానం ప్రవహించుకు రాసాగింది. ఆ జ్ఞానంతోపాటు లోకానికి కప్పివున్న తెరలు ఒక్కొక్కటే పైకి చుట్టుకుపోసాగాయి.

పద్మావతి భర్తను తన్ను కూడా ఈ ప్రదేశాలకు ఆ ప్రదేశాలకు త్రిప్పి ఉత్తమ గాయకుల పాటలు తాను వినేటట్టు చేయవలసిందని ప్రార్థించింది. వాళ్ళిద్దరు సంగీత సభలకు మద్రాసుకు వెళ్ళసాగారు. కాని కర్ణాటకవాణి పద్మావతికి పులకలు కలిగించలేకపోయింది. వారిద్దరు రామేశ్వరంవరకు ప్రయాణం చేసినప్పుడు దర్శనం చేసికొన్న తంజావూరు, చిదంబరం, శ్రీరంగం, మధుర, రామేశ్వరం మొదలైన దివ్య క్షేత్రాలలో ప్రత్యక్షమైన దేవాలయాల రీతిగానే కర్ణాటక వాణీవుంటుంది. రాగాలు, మూర్ఛనలు, కీర్తనలు, గతులు, తాళాలు, క్షేత్రాలై మండపాలై ఉత్తుంగ గోపురాలై విమానాలై పద్మావతికి గోచరించినవి. ఆమెకు ఆనందము కలిగినది, భయమువేసినది.

ఏ సుబ్బలక్ష్మో, శంబంగుడో, కర్ణాటక సంప్రదాయ ప్రపంచం ఇంద్రజాలికులులా ప్రత్యక్షం చేసేటప్పటికి పద్మావతి దిగ్భ్రమచెంది అతిలోకమైన దివ్యమాధుర్యంలో మైమరచిపోయి స్థాణువులా ఐపోయేది.

పద్మావతి: నాబోలాంటి సంగీతం ఏలా వస్తుందండీ? ఈ రాగాల లోతులకే నా గ్రహింపు తీరి మించిపోతున్నాయి. నేను ఎన్నాళ్ళు తపస్సుచేస్తే ఆ తపస్సు ఎన్ని జన్మలో విద్యా దీక్షతో ఆచరిస్తే, నాకు ఈలాంటి సంగీతం అబ్బగలదు? ఎందుకు నాకు ఈ సంగీతం నేర్పించడం. ఆ సుబ్బలక్ష్మి అమృతప్రవాహం ముందర నాకంఠం ఉప్పునీళ్ల కాలవలా కనపడింది.

బుచ్చి వెంకట్రావు: ఒసి వెర్రిదానా! ఒక్కరోజులో సుబ్బలక్ష్మి తనకున్న యావత్తు సంగీతశక్తితోను పూడి

పడిందా? ఎన్ని సంగీతాలు కష్టపడిందో. నేను లక్షాధికారిని కావాలంటే ఒక్కరోజులో కాగలనా చెప్పు.

పద్మ: అంతవిద్య మన నరసింహమూర్తి మాష్టారు చెప్ప గలరా లేదా?

బుచ్చి: నరసింహమూర్తి మాష్టారు కావలిస్టేషను అనుకో. ఇంకా బిట్రగుంట, నెల్లూరు, గుడూరు జంక్షను చెన్న పట్టణం ఉన్నవికదా?

పద్మ: ఎన్ని వుంటే ఏమండీ? నాకెట్లావస్తుంది ఆ సుబ్బ లక్ష్మి కంఠం?

బుచ్చి: ఎవరందాలు వారివి; ఎవరిగొప్పలు వారివి; ఏమం టావ్! నీ కంఠంలో తీపి ఆ సుబ్బలక్ష్మి కంఠంలో కన పడేలేదు! నీకున్న గొప్పవారిది.

పద్మ: ఐతే నన్ను పట్నం తీసికెళ్లో లేకపోతే దక్షిణాదికి తీసుకుపోయో గొప్పవారిదగ్గర సంగీతం చెప్పించండి.

3

బుచ్చి వెంకట్రావు ఎంతురొయ్యపప్పు ఎగుమతి మద్రాసునుండే చేయ సంకల్పించాడు. తన ఆఫీసు కావలి నుండి మద్రాసుకు మార్చాడు. కావలినుండి మద్రాసువరకు ఉండే పల్లెగ్రామాలలో పల్లెవాళ్లను తన కంపెనీకే వారి రొయ్యపప్పు అమ్మేటట్లుగా ఏర్పాటు చేసికొన్నాడు. తన ఆఫీసు వాల్‌టాక్సు రోడ్డులో కుదుర్చుకొన్నాడు. తను కాపురం ఉండే యిల్లు రాయపేటలో కుదుర్చుకొన్నాడు. బ్రహ్మ ప్రళయంమీద ఊరంత జల్లిస్తే ఆ ఇల్లు దొరికింది. భార్యకు సంగీతం చెప్పే నరసింహమూర్తి మాష్టారును కూడా తీసికొని వచ్చాడు.

పద్మావతికి చెన్నపట్నం వచ్చినప్పటినుంచీ జీవితం ఒక అనంతమాలికలా అయి పోయింది. కావలనిన్ని జాజి పూవులు. కావలి వచ్చినప్పుడే ఆమెకు మొదటి సారి జాజి మల్లె ప్రత్యక్షమైనది.

వొక్కొక్క వస్తువు, ఒక్కొక్కరి జీవిత ప్రవాహాన్ని నూతన పథాలకు త్రిప్పుతుంది. ఒక్కొక్క పుష్పం ఒక్కొక్క బాలిక ప్రాయపు మధుర్యాలగని. పెద్ద జాజి పుష్పాలు మద్రాసులో జాజిమల్లి పూవు అంటారు. తెలుగు దేశంలో పెద్ద జాజి అని వ్యాగ్రమే తీస్తారు. అసలు జాజికి మల్లికి పుట్టించిన పుష్పం అయివుంటుంది. అటు మల్లి పూవులోని సౌందర్యాలూ ఉన్నవి. ఇటు జాజిలోని సుకుమారతా ఉన్నది. ఏదో వివశత్వం కలిగించేమత్తు వాసన నక్షత్ర రూపమై, నక్షత్ర లోకాల అవలి దశలకు కొని పోయే రూప సౌందర్యము స్వచ్ఛత జాజిమల్లి పూవు లో నృత్యమాడుతూ ఆమెకు గోచరించినవి. ఆమె మల్లి పూవులెరుగును; నాగమల్లి పూవులూ ఎరుగును. నాగమల్లి చెట్లు వాళ్లపల్లె దగ్గరనే ఉన్నవి. వర్షాకాలం రాగానే అవిచక్కగా వికసించి వానజల్లులతో పాటు అవిజల్లులు జల్లులై కురుస్తవి. తెల్లవారగట్లే లేచేది పద్మ. వాటిని ఏరుకోటానికి. చెవులలో జూకాలుగా అమరించుకొనేది. దండలుగుచ్చి మెడలో వేసుకొనేది. తన చింపిరిజుట్టులో అలంకరించుకొనేది. ఒక్కొక్క పువ్వూ ముచ్చిక తెంపి ఆ పువ్వులోని తియ్యటి పాలనుతాగేది. సన్నగా బూరాలు ఊదేది.

ఆ నాగమల్లి పువ్వులుగాని జాజిమల్లి ఎదుట సామ్రాజ్ఞి ఎదుట రాణులులా అయి పోయినవి. నాగ మల్లి మల్లియ పీఠానికి దారి చూపిస్తుంది. మల్లిక జాజిమల్లి సింహాసన వితర్దిక కడకు గారవంగా తీసికొని వెళుతుంది.

కావలి పట్నంలో తాను తన భర్తకాపురం పెట్టిన మొదటి వసంత మాసంలో ఈ జాజిమల్లె పువ్వులు అమ్మ కానికి వచ్చినప్పుడు ఏమిటి ఈ కొత్తరకం పూవులు ఇంత అందంగా ఉన్నాయేమిటి అనుకొన్నది. జీవితం అనుగు భాగాలలో దాగుకొని ఉన్న ఏవో కాంక్షలను ఆశయా లను ఈ జాజిమల్లి పూవుల వాసన రేకెత్తించినవి. ఎక్కి ఎక్కి పైకి ఎక్కి ఏదో ఒక మహానది ప్రవహించి క్రిందికి వచ్చే శైల జన్యపు పర్వత సానువుల చెరియల వెంబడే పైకి ఎక్కుతూ కొండలు దాటుతూ అనవీ బాలిక ఉద్భవించే పరమ రహస్య ప్రదేశాలకు ఆ జాజిమల్లి వాసనలు తీసి కొని పోతున్నట్లుగా ఆమె మనస్సుకు ఊహాలు కలిగించేవి.

చెన్నపట్నంలో అన్నీ జాజిమల్లి పూలే! అంటి దొప్పలలో దొంతరలు; దండలచట్లు, తక్కెడలో తూకాలు; జాజిమల్లియతో సంగమిస్తున్న కనకాంబరాలు, మరువంకురువేరులున్న కదంబ మాలలు. మదరాసు జాతీయ కుసుమ వైభవ సమృద్ధమైన మహానగరం.

ఎన్ని కాంక్షలు ఆ నగరంలో ఉద్భవించనున్నాయో! తీరనికలలు, గాఢవాంఛలు, ఉత్కృష్టమైన ఆశయాలు జాతీయకుసుమ పరిమళ సంఘాతాలై ఆ మదరాసు నగరంలో ఎన్ని బ్రతుకులలోనో పుట్టి పెరిగి, మహాఝంఝులై గాలి వానలై పోనున్నాయో!

౪

నరసింహమూర్తి సంగీతం మేష్టారు వాళ్ళింటిలోనే మకాం. నెమ్మదిగా సంగీతం మేష్టారు వంట బ్రాహ్మణుడూ అయ్యాడు; పద్మావతికి పితృదేవుడూ గురువూ అయ్యాడు. పద్మావతి కనుముక్కు తీరుగల అందమైన ముఖముకల పడుచు. ఆమెలో నాగరికత స్థానం ఏర్పరచుకొన్నప్పటినుంచీ ఆమెకున్న నీలోత్పలకాంతి ఉజ్జ్వలశ్యామలకాంతి కాజొచ్చింది. శరీరం సామ్యాంగ పరిపుష్టమై కాకతీయ శిల్పబాలికా సౌందర్యం మూర్తించుకొన్నది.

సంగీతం మేష్టరు నరసింహమూర్తికి పల్లెపద్దాలు పడుచు ఏవో పరమరహస్యాల పాల సముద్రతరంగాలలోనుండి అవతరించిన లక్ష్మిలా గోచరమయ్యేది. పల్లెవారికి ఈ అందాలు ఎక్కడనుంచి వచ్చాయి? కాశీరాజు మత్స్యగంధి చేప గర్భంలో దొరికినట్లు ఈ పద్మావతి కూడా ఏ సముద్రపు అలలలో కొట్టుకువచ్చిన వరుణదేవుని కొమరిత ఏమో! నల్లవారున్నారు. వారు తెల్లచీర కట్టుకుంటే చీరనల్లబడిపోతుందేమో అన్నట్టుంటారు. కాని పద్దాలు నలుపురంగు ఆకాశ నీలంలా, సముద్రం లోతుల గరుడపచ్చల నీలంలా నరసింహమూర్తికి దర్శనం అయ్యేది. జూకామల్లి పూవుల నీలంలో ఉన్న ఆర్ద్రత ఆమె శరీరచ్ఛాయలో వికసించి ఉన్నదని నరసింహమూర్తి అనుకున్నాడు.

నరసింహమూర్తి: ఏమమ్మా పద్మావతి ఏదో ప్రవేటు మేష్టరును పెట్టి మీ ఆయన నీకు ఏదో నానాకాలం చదువు చెప్పించాడు. నిజంగా సంగీత రహస్యాలే అర్థమవాలంటే చదువుకూడా బాగావచ్చితీరాలి అమ్మాయి.

పద్మావతి: ఇక్కడకూడా ప్రయివేటు మాస్టారును పెట్టించుకోవచ్చు కాదటయ్యా!

నర: ప్రయివేటు మాస్టారు చదువు ఆటా పాటలచదువు. ఏదయినా స్కూలులో చేరి చదువుకోవాలి. ఆ చదువుకి ప్రయివేటు మాస్టారు చగవు బలమిస్తుంది.

పద్మ: ఇంత పెద్దదాన్ని ఇప్పుడు స్కూలు ఏమిటండీ మాస్టారు?

నర: ఆంధ్ర మహిళా సభలో చేరరాదూ వాళ్లు ఆ జెనారసు యూనివర్సిటీ పరీక్షకు పంపిస్తారు. రెండేళ్లల్లో టింగు, రంగా అని ఇంటర్మీడియెట్‌లో చేరవచ్చును.

పద్మ: ఇవాళ మా వాళ్లను అడుగుతామండండి. ఒక్కొప్పుడు నాకు ఈ చదువెందుకు బాబూ అనిపిస్తుంది. ఈ పట్టణవాసం, ఈ మోటారు కార్లు ఈ గడబిడలల్లో ఏమి ఆనందం ఉంటుంది. మా పల్లెలో ఆ సముద్రం వొడ్డునే ఆ ఏటికాడనే ఎంతో ఆనందంగా ఉండేది.

నర: ఇక్కడమాత్రం సముద్రం లేదటమ్మా.

పద్మ: ఇక్కడ సముద్రం సముద్రంలా అనిపించదయ్యా.

నర: అక్కడ కెరటాలు ఇక్కడ ఉన్నాయ్. అక్కడ ఇసుక ఇక్కడ ఉన్నది.

పద్మ: ఎట్లా అయినా ఆ సముద్రం వేరు, ఈ సముద్రం వేరు. ఇన్ని లక్షల జనంలో సముద్రం మన సముద్రంలా కనిపించదు. ఎవరి సముద్రమో చూడడానికి వచ్చినట్లుగా వుంటుంది. మాస్టారూ ఈ సముద్రంలో చేపలు దొరుకుతాయా.

నర: అదేమిటమ్మా! పొద్దున్నే తెప్పలు కట్టుకొని మీవాళ్లెంతమందో తెల్లారకట్టే సముద్రంలోకి వెళ్లిపోతారు. పది పన్నెండు గంటలకు తిరిగి వస్తారు. తెప్పలనిండా కావలసినన్ని చేపలు పట్టుకు వస్తారు.

పద్మ: అవి విదేశీ చేపలేమో?

నర: మంచిదానవే!

పద్మావతి ఆంధ్రమహిళాసంస్థలో చేరింది. బుచ్చి వెంకట్రావు తాను అగ్నికుల క్షత్రియులమని చెప్పాడు. ఆంధ్ర మహిళాసభ విద్యాలయంలో చేరినప్పటినుండే పద్మావతికి దీక్ష ఎక్కువ అయింది. రాత్రింబవళ్లు చదువే. మహిళాసభ విద్యాలయంలో ఉన్న బి.ఏ., పాసయిన ఉపాధ్యాయినిని ఒకర్తె ఆమెకు ప్రయివేటు మాష్టరుగా కుదిర్చాడు బుచ్చి వెంకట్రావు.

మద్రాసు వచ్చినప్పటినుంచీ బుచ్చి వెంకట్రావు వ్యాపారం వృద్ధిఅయింది. వచ్చిన ఆరు నెలలలో అతనికి ఎనిమిదివేలు లాభం వచ్చింది. భర్తను ఆంధ్రమహిళా సభకు దగ్గరిగా ఇల్లు అద్దెకు పుచ్చుకోమని పద్మ పోరు పెట్టింది. సలివన్స్ గార్డన్‌లో చిన్న మేడ నూరు రూపాయలు అద్దిచ్చి కుదుర్చుకొన్నాడు బుచ్చి వెంకట్రావు.

చదువు వస్తున్న భార్య బుచ్చి వెంకట్రావుకు నిత్య నూతన విద్యామూర్తిలా, సౌందర్య దేవతలా కనిపించేది. చదువుకున్న బాలికలతో సహవాసాలు అలవరచుకొన్న పద్మావతికి ఏదో ఒక నూతన ప్రపంచం సన్నిహితము కాసాగినది. చదువులు, దేశాలు, దుస్తుల విధానాలు, వివిధ భాషలు, రాజకీయాలు, అలంకరణలు, ఆనందాలు, శుచి, శుభ్రతలు పద్మావతికి అర్థం కాసాగినది.

ఆమె ఇల్లు అలంకరించటం నేర్చుకొన్నది. తాను కడిగిన ముత్యంలా ఎప్పుడూ నిర్మలంగా ఉండటం నేర్చుకొన్నది. వివిధ సువాసనలు, తమ తమ వ్యక్తిత్వాలతో ఆమె జీవితంలోనికి వచ్చి చేరినవి. తాను అర్థం చేసికొన్న ప్రతి సంస్కృతి ఆ బాలిక తన భర్త జీవితంలో కూడా ప్రవేశపెట్టాలని ప్రయత్నించేయసాగింది. బుచ్చి వెంకట్రావు ఆమెకు దాసానుదాసుడైన శిష్యుడైనాడు. వారిద్దరికి ఈ దైనందిన సంస్కృతి విద్యా శిక్షణ ఎంతో ఆనందం కలిగించే వ్యావర్తి అయింది.

ఇల్లు అలంకరించుకొనే పాఠం ఉపాధ్యాయిని చెప్పేది. చెప్పిన పాఠమెల్లా ఆచరణలో పెట్టాలని పద్మావతికి కుతూహలం. భర్తతో మరాం పెట్టేది. రోజుకు ఒక కొత్తరకం భావం బుచ్చి వెంకట్రావును ఉక్కిరి బిక్కిరి చేసేది. ఇవాళ కిటికీలన్నిటికి పచ్చరంగు, ఎర్రరంగులు కలిగిన పువ్వులు, రేపు నీలంమీద తెల్ల బారలు కలిగిన తెరలు; ఇవాల పేము కుర్చీలు, రేపు రోజు వుడ్డుసోఫా కుర్చీలు. "నీకేమైనా మతిపోయిందా" అంటాడు బుచ్చి వెంకట్రావు.

నరసింహమూర్తి మాష్టారు పద్మావతి భావాలన్నీ వింటూ ఎంతో ముచ్చట పడిపోయేవాడు. ఎంతోకాలం సంగీతంలో ప్రయివేటు మాష్టరుగా ఉండి నూరు రూపాయలు నెల్లూరులో సంపాదించుకుంటూ కుటుంబం పోషించుకుంటూ ఉండేవాడు. నేడు 62 ఏళ్లు వచ్చాయి. భార్య పోయింది. బిడ్డలు లేరు. స్వచ్ఛమైన వెలనాడి బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. పెద్దవాడవటంచేత నెమ్మదినెమ్మదిగా పాఠాలు తగ్గిపోయినాయ్. నెల్లూరు వదలి స్వగ్రామమయిన కావలి చేరుకొన్నాడు. కావలి చేరుకొన్న కొద్ది దినాలకే బుచ్చి వెంకట్రావు 50 రూపాయిలిచ్చి నరసింహమూర్తిగారిని భార్యకు సంగీతపు మాష్టరుగా ఏర్పాటు చేసినాడు. నేడు ఈ కుటుంబంతో తాను మదరాసు వచ్చాడు. తానింత వండుకొని వాళ్లిద్దరిని వడ్డించుకు తినమని ఇవతల పెట్టేసేవాడు. పద్మావతే అతనికి కూతురైంది. బుచ్చి వెంకట్రావు అల్లుడైనాడు. వీళ్లిద్దరి దినదినాభివృద్ధి అతనికి నిత్యసంతోష కారణమైనది.

రూపకం

అద్దంమీద ఆవగింజ

శ్రీమతి కొత్తపల్లి లలిత

[వెనుకటి కథలో రామం, జానకి ఏదో చిన్న వాగ్వివాదంవల్ల అలుకవహిస్తారు. జానకి భోజనంమాని పడుకుంటుంది. తాతయ్య తంటాలు ఇక చదవండి]

మూడవరంగం

(హాలులో మూడు కుర్చీలు, ఓ టేబులు; టేబులు మీద తాంబూల సామగ్రి వెండి ట్రేలో; రామం, తాతయ్య, చెరో కుర్చీలో కూర్చుని వుంటారు తాంబూలం వేసుకొంటూ.)

రా : (ఆశ్చర్యంగా) నిజమేనా, తాతయ్యా.

తా : నీతో అబద్ధం చెబుతానట్రా? జానకి తలికితండ్రి మాకు కావలసినవాడే. అందుకనేగా, జానకి తల్లిని మామయ్యకి నేను చేసుకొంటా. ఇప్పుడు నీకు చెప్పింది, జానకి అమ్మమ్మను గురించి. ఆవిడికి ఎంతకోపం అనుకొన్నావు. మీ మామయ్య పెళ్లిలో, ఆవిడి తన మొగుడిమీద కోపం వచ్చి...

రా : కోపం వచ్చి...చెప్పు తాతయ్యా!

తా : ఆఁ. ఏముందిలే. బావిలో పడింది.

రా : బావిలోనే! నలుగురిలో ఎంత అల్లరి, అప్రతిష్ఠ!

తా : [illegible]. పెళ్లికొచ్చిన వాళ్లంతా విస్తుపోయారు. మీ మామయ్య మామగారు తలెత్తుకొని తిరగలేకపోయాడు.

రా : తరవాత ఏంజరిగింది?

తా : ఆఁ ఏం జరుగుతుంది! ఆనాటినుండి ఆయన చచ్చేదాకా పెళ్లానికి ఎప్పుడూ కోపం తెప్పించి ఎఱుగడు. ఆమె నంది అంటే నంది; పంది అంటే పంది. లేకపోతే కాపరం పాడుచేసుకొంటాడురా!

రా : (ఆలోచిస్తూ) ఆవిడ జానకికి ఏమవుతుంది.

తా : అదిగో! రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుంది అన్నాట్ట, నీలాంటివాడే ఒకడు. అమ్మమ్మ అవుతుందిరా. ఆవిడపేరే దీనికి పెట్టారు. వాళ్లవంగడం అన్ని విధాలా మంచివాళ్లేగాని, కాస్త ప్రథమకోపం...

రా : జానకికీ అంతే...ఆ వంగడమేగా.

తా : అందుకనే కాస్త జాగ్రత మంచిది అన్నాను. దాన్లో అన్నీ సుగుణాలే ఇది తప్ప.

రా : (ఆతురతతో) మరేం చెయ్యమంటావు! నువ్వే చెప్పు సలహా. అదే చేస్తాను.

తా : ఆఁ ఏముంది. ఆడవాళ్లని వశం చేసుకోడం అరనిమిషం. వాళ్లు ఏదంటే అది అనడమే. మొదట్లో అలా అంటే, చివరికి వాళ్లే లొంగి మనం ఏదంటే అది చేస్తారు. వాళ్లతో ఎప్పుడూ వాదించకు.

రా : అదికూడా చదువుకొందిగదా అని వాదించి హేతువు చూపించి ఒప్పిద్దామని నా ఊహ.

తా : అక్కడే పప్పులో కాలేసి—జఱ్ఱున జారావు. ఎంత చదువుకున్నా ఆడవాళ్లు బుద్ధితో ఆలోచించరురా!

రా : ఏమో! నీదంతా పూర్వపద్ధతి.

తా: సరే! నీ నవీన పద్ధతి—ఇంతకు వచ్చింది.

రా: ఇకనుంచి నువ్వు చెప్పినట్లే చేస్తా. నేను కాస్త వీధిలోకి వెళ్లివస్తాను. (అనిలేచును)

తా: ఒరేయ్ ఒక్కమాట. ఇదంతా దానితో చెప్పేవు. జాగ్రత్త. అసలికే మోసం వస్తుంది.

రా: అబ్బెబ్బే. మన వ్యూహాలు దానికి తెలియనిస్తానా? (అని వెళ్లిపోవును)

తా: (వంటవాడితో) ఇదుగో, నిన్నే. భోజన సామగ్రి అంతా ఆ వెండికంచంలో వడ్డించి నాతో మేడమీదికి రా. నేను మేడమీద అమ్మాయిగారి గదిలో వుంటాను.

వం: చిత్తం. (వెళ్లిపోవును)

(తాతయ్య మేడమీదికి పోవును వంట ఇంటిలో గిన్నెల చప్పుడు)

నాలుగవ రంగం.

(మేడమీద గదిముందు తాతయ్య నిలుచబడి యుండును.)

తా: అమ్మాయీ, జానకమ్మ.

జా: ఎవరదీ.

తా: నేనే. తాతయ్యని.

జా: ఎందుకూ? క్రింద మీ మనుమడుగారున్నారుగా!

తా: అదీ నీ వరస. కాస్త రాకూడదే తలుపుతీసి?

జా: నే నెందుకు? మీరంతా ఒకటి, నేనొక్కదాన్ని ఒకటి.

(జానకి తలుపుతీయును)

తా: ఎందుకే ఈ కోపం. అన్నంకూడా మానేశావు. రోజూ ఇంతేనా ఏమిటి? లేకపోతే, ఈవేళ నేను వచ్చాననా!

జా: నా బ్రతుకింతే. అందరూ నన్నే తిట్టండి (అని గద్గద స్వరముతో ప్రత్యుత్తర మిచ్చును)

తా: (జానకి దగ్గరగా వెళ్లి బుజ్జగిస్తూ) లేదు తల్లీ తాతయ్య నిన్నా అంటాడుటే. ఆ రామిగాడికి బుద్ధిలేకగాని బంగారంలాంటి నిన్నా తిట్టట మేమిటే?

జా: మీకూ అదే ఇష్టంగా. ఈవేళ అన్నాలవేళ మీరిద్దరు, నేను లేకపోతే, శని విరగడయిపోయిందని సంతోషిస్తూ భోజనం చేశారుగా!

తా: నీయిల్లు బంగారంగానూ, అదేంమాటలే. ఈవేళ భోజనాలదగ్గర వాణ్ణి ఎలా తిట్టానో నీకేం తెలుసు. కావలిస్తే...

జా: అక్కర్లేదులే. నీకు నేనంటే చాలా ఇష్టం అని తెలుసు.

తా: మరి అన్నీ తెలిసుండేనా ఇలా వుండడం! లేచి చప్పు చప్పున నాలుగు ముద్దలు తిని, రేడియో పెట్టుకో. అప్పటికి వాడుకూడా వస్తాడు.

జా: (అనుమానంతో) ఆయన లేరా ఇప్పుడు?

తా: అబ్బే. నేను తిడితే పశ్చాత్తాపం కలిగి అలా ఎక్కడికో వీధిలోకి వెళ్లాడు. ఇప్పుడే వస్తాడు.

జా: [illegible]!

తా: (లాలిస్తూ) ఒసే, నాకు తెలియక అడుగుతాను. వాడు నిన్నేమన్నాడే.

జా: ఏమనాలి. అసలు నామీద ఆయనకి ప్రేమ లేదు. వుంటే ఈవేళ నన్ను కారు నడపనిస్తారా ఏమిటి?

తా: వాడి మొహం నీమీద ప్రేమ లేకపోతే వాడు బతకగలడే. నేను వచ్చానుగదా అని తాను నడపడం మొదలెట్టాడు. అంతే.

జా: నువ్వు వచ్చావుగదా అనే నేనూ నడపాలనుకొన్నా. నే నడపడం ఆయన కిష్టంలేదు. ఆ ఘనత ఏదో తానే బావుకోవాలని ఊహ.

తా: వాడి మొహం. బావుకొన్నాడుగా. కారు చెడగొట్టాడు నయం. బ్రతికి బయటపడ్డాము. అంత తొందరపాటు కూడదు.

జా: (కొంచెం సంతోషంతో) బాగా అన్నావు, తాతయ్యా. ఆయనది అతి తొందర. అన్నింటికీ ముందు సిద్ధం. ఆయనతో వాదిస్తే...

తా: అవునుగాని నేను ఒక్కటి చెబుతాను విను. వాడితో వాద మేమిటే! మొగాళ్లతో వాదించి ఏ ఆడది జయించిందే!

జా : చదువుకొన్న వాళ్ళు కాదా అనీ, నవీనాభిప్రాయాలు ఉన్నాయనీ, వాదించి సహేతుకంగా నచ్చ చెప్పాలని నా ఊహ. మధ్యాహ్నం అలాగే. ఏదో, ఇంకా, నేను చెప్పక పూర్వమే దెబ్బలాట. ఓర్పు బొత్తిగా లేదు.

తా : నీకావిషయం కొత్త ఏమోగాని నాకు పాతే. ఆ ప్రథమ కోపం వాళ్ల వంశంలోనే వుంది.

జా : అలాగా. నాకు తెలియదు. ఇది వంశ పారంపర్యంగా వస్తూన్నదన్నమాటే.

తా : ఆహా! నీకేం తెలుసు. నక్కపుట్టి మూడాదివారాలు కాలేదు, ఇంత గాలివాన ఎరగనందిట. రామం తండ్రి తండ్రి ఉన్నాడే—అంటే మా వియ్యంకుడు—అబ్బ ఎంత కోపం. మాటిమాటికి చిట్టు బుట్టు మంటూండే వాడు. మాట పడ్డా ఎరగడు. అందమేగాని, ఓమాటు ఏమయిందను కొన్నావూ......ఎందుకంటే అదంతా ఇప్పుడు...

జా : (తాతయ్యకి దగ్గరగావచ్చి బతిమాలుతున్నట్లుగా) చెప్పు తాతయ్యా...చెప్పుమరి...ఏమయింది.

తా : ఆఁ. ఏమీలేదు. మీ అత్తయ్య పెళ్లిలోనే...మా వియ్యపరాలు ఏదో అందిట. ఆపళంగా, అందరి ముందూ, ఏంచేశాడనుకొన్నావు...

జా : (తొందరగా) చెప్పుతాతయ్యా. ఏంచేశాడు.

తా : ఆఁ. ఏం చేస్తాడు. జంధ్యాలు తెంపేసుకొని, "నాకీ సంసారం అక్కర్లేదు. నేను సన్యసిస్తా" నన్నాడు. పెళ్లి కొచ్చిన వాళ్లంతా ముక్కుమీద వేలేసుకొన్నారు.

జా : ఎంత అభాసు! ఎంత అప్రతిష్ఠ! మీరేం చేశారు?

తా : ఏముంది చెయ్యడానికి. మావియ్యపరాలిని బతిమాలి, ఆవిడచేత క్షమార్పణ చెప్పించి, మళ్లీ జంధ్యాలు వేయించాము.

జా : (ఆతురతతో) ఆయన రామానికి ఏమవుతాడు తాతయ్యా!

తా : నీ తెలివి తెల్లారినట్లే వుంది. తాతే. తండ్రి తండ్రి.

జా : ఇప్పుడు నాకు అర్థం అయింది ఈయన కోపం. వీళ్లల్లో ఇదివరనుంచీ వున్నదన్న మాటే. తరువాత, ఆవిడేం చేసింది?

తా : ఏముంది చెయ్యడానికి! ఆయనకి కోపం తెప్పించకుండా, తన పని తాను చేయించుకొనేది. మగాడిని ఆడది వశం చేసుకోడం ఎంతసేపే.

జా : ఈయన లొంగరుగా! ఎంత హేతువు చూపించి వాదించినా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అంటారు.

తా : అక్కడేవుంది నీ పొరపాటు. మొగుడితో వాదించడ మేమిటే! వాళ్లని లొంగతీసుకోడానికి యుక్తులు పనికిరావే, వెఱ్ఱిపిల్లా.

జా : మరేం చెయ్యమంటావు.

తా : సామెత చెప్పినట్లుంది నీ ప్రశ్న. అందుకే మా రోజుల్లో చిన్నప్పుడు పెళ్లిళ్లుచేసి, రాకని పోకని కల్పించి ఒకర్ని ఒకరు అర్థం చేసుకొనేలా చేసేవారు. ఇప్పుడేం లేదు. ఈవేళ చూడ్డం. రేపు పెళ్లి. ఎల్లుండి...

జా : సరేగాని చెప్పుతాతయ్యా సలహా.

తా : ఏమీలేదు. వాడేదంటే దానికి సరే అనడం. తన మాట విన్నానని వాడనుకొని ఇంక నువ్వేమడిగితే అదే చేస్తాడు. అంతేగాని ముందే వాదంలోకి దిగితే పట్టుదలలు అధికమై రంగం చెడుతుంది. అమ్మాయ్. ఇంక నువ్వు భోజనం చెయ్యి. వంటవాడు పైకి తెస్తాడు. అప్పుడే చాలా ఆలస్యం అయింది. నే క్రిందకి పోయి పడుకొంటా...అయితే. మెట్లమీద దీపం వుందా... నాకు రాత్రి కొంచెం కనబడదులే...

జా : ఆ వుంది. మెల్లిగా దిగివెళ్లు.

(నిష్క్రమింతురు)

ఐదవ రంగం

(రామం సావడిలో కుర్చీలోనే నిద్రపోతూ వుంటాడు. అకస్మాత్తుగా దొడ్లో పెద్ద చప్పుడవుతుంది.)

రా : (ఉలిక్కిపడిలేచి, అలవాటు చొప్పున) జానీ (అని పిలిచి నాలిక కొరుక్కొని) ఎవరది (అంటాడు.)

వం: (ప్రవేశించి) ఏంబాబూ అలా కేక వేశారు.

రా: ఏంలేదు. దొడ్లో ఏదో పెద్ద చప్పుడయింది. నువ్వు విన్నావా?

వం: మీరంటే జ్ఞాపకం వచ్చింది. నాకూ నిద్దట్లో ఏదో వినబడింది. నూతివైపునుండి వచ్చినట్లయింది.

రా: (ఆతురతతో) ఆఁ (అని మేడమీదికి పోవును. వంటవాడు నిశ్చేష్టుడై చూచుచుండగా జానకి ప్రవేశించును)

జా: (రెండవ వైపునుండి ప్రవేశించి) ఏమయ్యా నీకేమైన పెద్ద శబ్దం వినబడిందా?

వం: మీరంటే జ్ఞాపకం వచ్చింది. నాకూ నిద్దట్లో ఏదో వినబడింది. నూతివైపునుండి వచ్చినట్లయింది.

జా: నూతివైపునుండా? అసలు నువ్వు ఇక్కడ ఎందుకున్నావు?

వం: బాబుగారు...

జా: (తొందరగా) ఊ..చెప్పు. బాబుగారు...

వం: పిలుస్తే వచ్చాను.

జా: (భారము పోయినట్లుగా) బాబుగారు పిలిచారా? ఏరి వారు?

వం. మేడమీదికి వెళ్లారు.

జా: సరే నేనూ మేడమీదికే వెళుతున్నాను. (అని వెళ్లబోవును. ఎదురుగా రామం ప్రవేశించును. జానకి ఆగిపోవును. ఇద్దరు ఒకరివైపు ఒకరు తప్పు చేసినట్లు చూసుకొంటూ నిలబడిపోదురు. వంటవాడి సంగతే వారికి పట్టినట్లులేదు)

వం: (మెల్లిగా) ఆ చప్పుడు ఏమిటో . తెస్తా ..

రా: (నిద్రలోంచి మేల్కొన్నట్లు ఉలికిపడి) మరే దాని సంగతే మరచిపోయాం. నువ్వు దీపం పట్టుకు రావయ్యా. పద నేనూ వస్తున్నా.

(వంటవాడు దీపానికై వెళ్లును.)

జా: నేనూ వస్తా.

రా: నువ్వెందుకు? ఈమాత్రం భాగ్యానికి.

జా: మీరే వెళ్లాలి కాబోలు.

రా: నేను కాకపోతే నువ్వు వెళ్లు.

జా: అప్పుడే అంత కోపం ఎందుకు. మీరే వెళ్లండి నేనిక్కడే వుంటాను. నేనేమైతే నేమి మీకు.

రా: (ఏదో జ్ఞాపకం తెచ్చుకొన్నట్లయి) సరే, నువ్వు కూడా రా. తప్పుమాటలెందుకు?

జా: (ఏదో జ్ఞాపకం తెచ్చుకొన్నట్లయి) మీరు వెళ్లండి నేను తాతయ్య...

రా: అయ్యో! తాతయ్య ఏడీ! (అని లోనికి పరుగునవెళ్లి తిరిగివచ్చి) గదిలో తాతయ్య లేడు.

జా: ఇందాకా నాతో చీకట్లో నా కంతగా కనపడదన్నాడు. అయ్యో, అయ్యో, దొడ్డిలో నూతిలో నూతిలో పడిపోలేదుగదా!

రా: రండి, రండి (అని దొడ్డిలోనికి పరుగెత్తును, లాంతరు తీసికొని వంటవాడుకూడా వచ్చును. జానకి వెనుకనే వెళ్లును.)

జా: అయ్యో, అయ్యో! ఎవరేనా నూతిలోకి దిగండి. తాతయ్యా (అని ఏడువబోవును.)

రా: అన్నింటికీ ముందు ఏడుపు. ఆడవాళ్లకి నెత్తిమీద నీటికుండ వుంటుంది. ఏమయ్యా నువ్వు పైన తాడు పట్టుకో నే దిగుతా. జానకీ నువ్వు లోపలికి దీపం చూపించు.

జా: అతను దిగుతాడు. మీరు తాడు పట్టుకోండి. మీరు పైనవుంటే తాతయ్యని వెంటనే అందుకొని ఫస్టు ఎయిడ్ చేయవచ్చు. లేకపోతే తాడు ఆ చెట్టుకి కట్టండి.

రా: నే చెప్పినట్లు చేస్తావా వాదమా?

జా: నాకు వాదమెందుకు, నాకు తోచింది చెప్పాను. మీ ఇష్టం మీది, నా ఇష్టం ఎందుకు?

రా: అన్నింటికీ ముందు మాటవిరుపులు, కోపాలు, తాపాలు. (కొంచెం ఆలోచించి) జానకీ, నీ ఇష్టం వచ్చినట్లే చేద్దాం. ఆ తాడు ఆ చెట్టునకు కడదాం. రా.

ఏమయ్యా నువ్వు లాంతరుతో నూతిదగ్గరవుండి ఆ టార్చితో లోపలికి చూడు.

జా: (మెత్తగా) ఊరికే అన్నానుగాని, మీకు మాత్రం తెలియదూ. ఇంతకీ ఆ వంటవాడికి ఈతరాదేమో! మీరంటే గోదావరిని ఇద్దరినుండి అద్దరికి ఈదినవాళ్లు.

రా: కాదు, జానీ, అతణ్ణే దింపుదాం. నువ్వన్నట్లు నేను తాతయ్యకు ప్రథమ చికిత్స చేయవచ్చు.

జా: కాదు, రామూ నీ ఇష్టం...

రా: కాదు, జానీ, నీ ఇష్టం... (అని చెట్టు వైపునకు నడతురు)

(తాతయ్య ఎదురుగా వచ్చును)

తా: ఆహాహా! ఎంత సమయస్ఫూర్తండీ. ఈ రాత్రంతా ఒకరినొకరు ఒప్పించుకొంటూనే గడిపేవారా! లేక నన్నేమైనా నూతిలోంచి తీసేవారా? పదండి లోపలికి. (ఇదంతా వంటవాడు ఆశ్చర్యంగా చూస్తూ చూస్తూ వెళ్ళిపోవును) ఇంక మీరు వెళ్లి పడుకోండి. చాలా రాత్రయింది. ఇందాకటినుంచీ నువ్వు సావిట్లోనే వున్నావురా రామం.

రా: రాత్రి ఆలస్యంగా వచ్చాను. దాన్ని లేపడం ఎందుకని...(అని నసుగును)

తా: ఓహో! అదా సంగతి, కోపం కాదన్నమాట. సరే ఇంకెలాగా లేచిందిగా. పైకి వెళ్లండి. (జానకితో) వెళ్లండే రాత్రంతా అలాగే ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకొంటూ నిలబడతారా ఏమిటి. ముసలాణ్ణి కాస్త నాకు నిద్రా, నిప్పులూ అఖ్ఖర్లేదూ. మళ్లీ రేపు రైలుకి పోవాలి.

రా, జా: (ఇద్దరూ) రేపే తాతయ్యా!

తా: రేపు రాకపోతే ఎల్లుండి. ఇక్కడే వుంటానా ఎప్పుడూ? ఏదో మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను. కాస్త...గుణపాఠం...నేర్పి...

జా: నువ్వు నూతిలో పడిపోయావని అనుకొన్నాం.

రా: నేననుకోలేదు సుమా.

జా: అనుకోపోతే నూతిదగ్గరికి ఎందుకు వెళ్లారు?

రా: మొట్టమొదట నేను మేడమీదికి వెళ్లాను.

జా: ఓహో! ఆగా! అయితే నేను అనుకోలేదు. నేను మీ గది దగ్గరికి వెళ్లి చూసా మొట్టమొదట.

తా: మళ్ళీ మొదలు పెట్టారట్రా. మీ రనుకోడానికి అసలు నే పడందే. ఇంక వెళ్లండి, వాదన ఆపి.

రా: (నవ్వుతూ) అబ్బే ఇంక మేం వాదించుకోం.

జా: వాదించుకోన్నా కోపించుకోం. కలహించుకోం.

తా: అవును. అంచేతే పెద్దలు, ఆలుమగల కలహం అద్దం మీద ఆవగింజంత సేపు నిలుస్తుంది అన్నారు. వెళ్లండి. వెళ్లండి.

రా, జా: (నవ్వుతూ) నీ కంటె పెద్దలెవరు తాతయ్యా!

తా: సరే పోనీ, నేను అన్నాను. ఇంక మీరు వెళ్లి పడుకోండి. ఉస్...

(తెర)

★

సంధ్య

❋ శ్రీమతి కే. కామాక్షి ❋

ఓహో! వసంత సంధ్యారాణీ
నీదునను సిగ్గులో నీ అరుణ కాంతిలో
కవికుమారుని కలము పరువులెత్తేనో?
కోకిలా కంఠాన మధురిమము పెరిగెనో??
నీరాగ కిరణాల నీదు చిరునవ్వులో
ఈ వసంత కుసుమాల మధు సౌరభములోన
భావుకుల హృదయాలు విరిసెరే పువ్వులై!
నీకదృష్ట జ్వాల నీ అలంకారములో
నైరాశ్యశీతాల నినుపల్లవించేటి
భగ్నహృదయములోన కిసలయించునో ఆశ?
ఓహో! వసంత సంధ్యారాణీ.

★

పోస్టు చెయ్యని ఉత్తరం

❋ శ్రీ గోపీచంద్ ❋

హేతువాదం అంటే ఏమిటి? హేతువాదం మనకిచ్చే జ్ఞానం ఎటువంటిది? అనేఘట్టంలో పోయినమాటు ఆపుచేశా. హేతువాదం స్వభావం ఏమిటో ప్రస్తుతంలో ఆలోచిద్దాం.

హేతువాదానికి శక్తిలేదని ఎవ్వరూ అనరు. దాని ప్రయోజనం అందరూ అంగీకరించేదే! కాని స్వల్ప విషయాలూ, తాత్కాలికావసరాలకు కావలసిన విషయాలూ తెలుసుకోటానికి మాత్రమే హేతువాదం పనికి వస్తుందని, సంపూర్ణ సత్యాన్ని తెలుసుకోటానికి ఇది ఉత్తమ సాధనం కాదనీ, అందువల్లనే హేతువాదులు సంపూర్ణసత్యం తెలుసుకోవటం సాధ్యపడే పనికాదు అంటున్నారనీ ఆధ్యాత్మికవాదులు వాదిస్తున్నారు.

హేతువాదానికీ సత్యానికీ సంబంధం ఉన్నమాట ఎవ్వరూ కాదనరు. మనం కొద్దిగా తెలుసుకోగలిగితే దాన్ని బట్టి అంతా తెలుసుకోగలం. మనలను మనం తెలుసుకోగలిగితే, ప్రపంచాన్ని తెలుసుకోగలం. భాగంలో ఏముంటుందో మొత్తంలోనూ అదే వుంటుంది అని హేతువాదులు చెపుతారు. కాని హేతువాదం ఎప్పుడూ నిజాన్నే చెపుతూ వుందా? తప్పటడుగులు వెయ్యలేదు? అని ప్రశ్నిస్తున్నాడు నళినీకాంత గుప్త. "అనేకసార్లు తప్పటడుగు వేసింద"ని తానే జవాబు చెపుతున్నాడు. ఈనాడు భూమి సూర్యునిచుట్టూ తిరుగుతూవుందని హేతువాదం చెపుతూ వుంది. అనేక సంఘటనలు ఈ సిద్ధాంతాన్ని ఋజువు చేస్తున్నవి. కాని హేతువాదం ఎల్లప్పుడూ ఈ మాటే చెప్పి వుండలేదు. ముందు చెప్పకపోవచ్చుకూడా. పూర్వులు అనేకమైన ఋజువులతో దీనికి విరుద్ధమైన సిద్ధాంతాన్ని నమ్మారు. రాబోయేవారు దీనికి విరుద్ధమైన, పై రెంటికీ సంబంధంలేని మరొక సిద్ధాంతాన్ని సృష్టించగలరు. వీరందరూ హేతువాదులే! ఈ సిద్ధాంతాలన్నీ హేతువాదం మీద ఆధారపడి సృష్టించబడ్డవే. దీనినిబట్టి హేతువాదం సత్యాన్ని తెలుసుకోగలదు అనుకోవటం కంటె, రకరకాల సిద్ధాంతాలను సృష్టించగలదు అని మాత్రమే అనకోటానికి వీలవుతుంది అంటాడు నళినీకాంతగుప్త, "కొంతమంది హేతువాదం సత్యాన్ని క్రమక్రమేణా తెలుసుకోగలుగుతుంది అని చెపుతారు. కాని వెంటనే సంపూర్ణసత్యం తెలుసుకోబడదు అంటారు. మనకు కావలసింది క్రమక్రమేణా సత్యం దగ్గరకు వెళ్ళటంకాదు. సత్యం తెలుసుకోవటం. ఈ పని హేతువాదం చెయ్యలేదు."

యోగాభ్యాసంవల్ల సహజ జ్ఞానాన్ని ప్రకాశవంతం చెయ్యొచ్చనీ, అది సత్యాన్ని తెలుసుకోగలుగుతుందనీ ఆధ్యాత్మికవాదులు చెపుతారు. "జీవితాన్ని పరిపూర్ణంగా చూడలేదు గనకా, మనిషినీ ప్రపంచాన్నీ కలిపి చూడలేదు గనకా, హేతువాదం సత్యాన్ని తెలుసుకోటానికి తగిన సాధనం కాదు" అన్నాడు బెర్గసన్.

జీవితంలో అనేక ముఖ్యవిషయాలు దానికి అందుబాటులో లేవు. విమర్శించి, వ్యాఖ్యానించి, జతపరచటం హేతువాదం గుణం. ప్రాపంచిక వ్యవహారాలు నెరవేర్చుకోటానిగ్గాను హేతువాదం పుట్టింది. దీనికి ప్రపంచాన్ని ముక్కలు ముక్కల క్రింద చూడటం అవుసరం. హేతువాదం ఈపనే చేస్తుంది. ఉనికిని ముక్కలు ముక్కలుగా విభజిస్తుంది. విభిన్న శక్తులక్రింద జమ కడుతుంది. వస్తు అన్నిటినీ తన నియమాలను అనుసరించి జత పరుస్తుంది. జీవితాన్ని నడపటానికి ఇది అవసరం—కాని యథార్థం తెలుసుకోటానికి మాత్రం ఇది మార్గం కాదు. ఎందుకంటే ప్రపంచంలో దేనికీ స్థిరత్వంలేదు. జీవితం ఎప్పుడూ మారుతూ వుండేదే, ఇటువంటిదాన్ని ముక్కలక్రింద చూట్టమే తప్పు. కాబట్టి సత్యాన్వేషకులు హేతువాదం మీద ఆధారపడి లాభంలేదు అంటారు ఆధ్యాత్మికవాదులు. ఈ విధంగా హేతువాదం హద్దులను నిరూపించి సహజ జ్ఞానాన్ని సమర్థిస్తున్నారు ఆధ్యాత్మికవాదులు.

మనస్సుకి కొంత స్వతంత్ర శక్తి వుండటంవల్ల ఎటుపడితే అటు ఆలోచించ గలుగుతూవుంది. క్రొత్తగా స్వాతంత్ర్యం

పొందిన ధానిపలాగా విజృంభిస్తూవుంది. అందువల్ల మానవుణ్ణి తన స్వభావానికి ఆటంకం అయినదారుల్లోకి కూడా నడిపించగలుగుతూ వుంది. మానవుడు ఈ అపాయాన్నుంచి తన్ను తాను రక్షించుకోవాలంటే, తన సహజ జ్ఞానంమీద ఆధారపడాలి. అంటే జంతువులకున్న సహజ జ్ఞానం వాటికి తెలిసిన జ్ఞానంకాదు. ఆ జ్ఞానాన్ని మానవుడు చైతన్య పూరితం చెయ్యగలడనీ, అలా చేస్తే దాని స్వభావాన్ని మనం తెలుసుకోగలుగుతామనీ, అప్పుడది మన జీవితాలను సక్రమంగా నడప గలుగుతుందనీ వారు చెపుతున్నారు.

అధ్యాత్మికవాదులు, సహజ జ్ఞానాన్ని గురించీ, హేతు వాదాన్ని గురించీ ఏమంటున్నారో తెలియజెయ్యటానికి, వారి దృష్టినిగురించి ఇంత విపులంగా వ్రాశానుగాని, వారి దృష్టినంతా నేను అంగీకరిస్తున్నానని నీవు అనుకోగూడదు. ఏ విషయాన్ని గురించి అయినా అవునూ, కాదూ అనే నిర్ణయానికి వొచ్చేముందు ఆ విషయాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలిగదా! నిజంగా సహజ జ్ఞానాన్ని ప్రకాశవంతం చెయ్యటం అంటే ఏమిటో నాకు అర్థంకావటం లేదు. ఏ విధంగా ప్రకాశమానం చెయ్యాలో, దేని సహాయంతో చెయ్యాలో నా బుద్ధికి అందటం లేదు.

నేను హేతువాదానికి కొన్ని హద్దులున్నాయనే విషయం అంగీకరిస్తాను. కాని హేతువాదంద్వారా కాక మరోకవిధంగా అయితేనే సత్యాన్ని గ్రహించగలం అనే మాటగాని, హేతువాదం అవసరంలేదు అనే మాటగాని ఒప్పుకోలేను. ఈ మధ్య హేతువాదం చాలా నిశిత విమర్శలకు గురిఅయిన మాట నిజమే. ప్రగ్మాటిజం ఉద్దేశాలలో హేతుబద్ధత లేదనీ, మనస్తత్వ శాస్త్రం మానవుని ప్రవర్తనలో హేతు బద్ధతలేదనీ, నిరూపించటానికి ప్రయత్నిస్తుంది.

ఈ రెండు సిద్ధాంతాలు కలసి, అభిప్రాయాలుగాని, ప్రవర్తనగాని హేతువాదానికి కట్టుబడివుండవలసిన అవసరం లేదని, అలావుండటానికి అర్హతపొందిన హేతువాద పద్ధతి లేదనీ చదువరులకు స్ఫురింపజేస్తయి. నీకూ నాకూ అభిప్రాయభేదాలు వుంటే వాదంలోకి దిగటం వల్లగాని, మధ్యవర్తిత్వాన్ని అంగీకరించటం వల్లగాని ప్రయోజనం ఏమీ వుండదని తెలియజేస్తాయి. మనకున్న ఆర్థిక సంపత్తిలోను మిలిటరీ సంపత్తిలోను, పోట్లాడి తేల్చుకోవటం కంటే గత్యంతరం లేదని ఈ సిద్ధాంతాలు తేలుస్తాయి. ఈ దృష్టి చాల అపాయకరమైందని నాతో ఏకీభవిస్తావను కుంటాను. కాబట్టి ఈ సిద్ధాంతాల వల్ల హేతువాదబలం క్షీణించ లేదనీ, జీవితానికి గానీ, ఆలోచనలకు గానీ మార్గం చూపగలిగినదాని శక్తి ఏమాత్రం సన్నగిల లేదనీ, మనం చెప్పుకోవాలి, నిరూపించుకోవాలి. హేతువాదాన్ని మనం సౌలభ్యంకోసం రెండు భాగాలుగా విభజించవచ్చు. 1. సిద్ధాంతానికి సంబంధించినది. 2. జీవితానికి సంబంధించినది. మొదటి లక్షణాన్ని 'మనం ఒక నమ్మకాన్ని కుదుర్చుకోనే నిమిత్తం అవసరమైన సాక్ష్యాన్ని పోగుచేసే అలవాటు' అని నిర్వచించాడు బెర్ట్రెండ్ రసెల్. హేతువాది గట్టిగా ఇదమిద్ధమని తేల్చుకోలేనప్పుడు మిగిలిన విషయాలను గమనంలో ఉంచుకునే, తన సాక్ష్యాన్నిబట్టి నమ్మటానికి ఎక్కువ వీలున్నదానికి ప్రాముఖ్యత ఇస్తాన్నాడు. ఒక విషయానికి ప్రాముఖ్యత ఇస్తున్నా తేలని విషయాలను గురించిగాని, తక్కువ నమ్మటానికి ఆస్కారంగావున్న విషయాలను గురించిగాని ఆలోచించకుండా ఉండడు. వాటిని గమనంలో ఉంచుకుని, వాటిని ఎప్పటికప్పుడు విమర్శించుకొని చూచుకుంటూ వుంటాడు. క్రమక్రమేణా వాటికి అనుకూలమైన సాక్ష్యం పోగైతే వాటిని నమ్ముతాడు. కొంతమంది మన అభిప్రాయాలకు వర్తించవలసిన Objective fact అనేదే లేదు అంటారు. వారి ధోరణిలో అభిప్రాయాలు అనేవి బ్రతుకు తెరువుకి సాధనాలు మాత్రమే. కాబట్టి ఏ అభిప్రాయాలైతే మానవునికి సహాయపడతవో, అవే 'యధార్థ' మైనవి.

ఈ సందర్భంలో క్రీస్తు శకం ఆరవశతాబ్దంలో జపాన్లో జరిగిన ఒక సంఘటనను రసెల్ ఉదాహరణగా చెప్పాడు. అప్పుడే ఆ దేశంలోకి బౌద్ధమతం అడుగు పెట్టిందట. ఈ కొత్తమతం మంచిదో చెడ్డదో తెలుసుకోటానికని ఒకరిని అనుసరించి చూడవలసిందని చెప్పారట. అతను ఇతరులకంటే మంచి స్థితిలో వుండటం సంభవిస్తే అందరూ ఈ మతాన్ని స్వీకరించ దలిచారట! నేటి ప్రగ్మాటిస్టులు

పోస్టు చెయ్యని ఉత్తరం

కొద్ది మార్పులతో ఇటువంటి సిద్ధాంతాన్నే సమర్థిస్తున్నారు. కాని అనుభవంలో ఇలా జరగటంలేదు. నిత్య జీవితంలో వీరూ మామూలుగానే వ్యవహరిస్తున్నారు. వీరిలో ఎవ్వరైనా ఏ జ్యూరీలోనైనా సభ్యుడుగా వుండటం తటస్థిస్తే, నేరస్తుడు తప్పుచేశాడా లేదా అని ఆలోచిస్తారే గాని ప్రజల్లో ఎవ్వర్ని వురితీస్తే లాభమా అని ఆలోచించరు. కాని ఇల్లాంటి దృష్టి కొన్ని దేశాల్లో లేకపోలేదు. అయితే ఇటువంటిది జరిగేటప్పుడు అంతా రహస్యంగా ఉంచుతారు. రహస్యం దాగకపోతే స్కాండల్ పుడుతుంది. ఈ దాయటమనే ప్రయత్నాన్ని బట్టి క్రిమినల్ విచారణలో వున్న Objective truthలో పోలీసువాడికున్నూ కూడా నమ్మకం వున్నట్లు స్పష్టపడుతుంది. సైన్సు తెలుసుకో దలిచిందీ ఇటువంటి సత్యాన్నే. అసలు సత్యమే లేదనే వాదం, ఉన్న సాక్ష్యానికి విరుద్ధంగా మరొక విషయాన్ని నిరూపించ దలిచినప్పుడూ, అసలు సాక్ష్యంలేనిదాన్ని నిరూపించ దలిచినప్పుడూ పుడుతుంది. మామూలు వ్యవహారాల్లో మనం సత్యం అనేది వున్నట్టే ప్రవర్తిస్తాము. దీనినిబట్టి అసలు 'నిజాలు' అనేవి వున్నాయనీ, కొన్ని నిజాలు మనం తెలుసుకోగలమనీ, మనకు తెలిసిన నిజాలనుబట్టి తెలియని నిజాలనుకూడా షుమారుగా తెలుసుకోవొచ్చనీ చెప్పుకోవలసి వసుంది. Can man be rational అనే వ్యాసంలో రసెల్ ఈ విషయాన్ని చర్చించి, "నిజాలను గురించిమన నమ్మకాలను మన కోర్కెలనుబట్టీ, అలవాట్లనుబట్టీ, అసహ్యాలనుబట్టీ ఏర్పరచుకోకుండా, సాక్ష్యాన్నిబట్టి ఏర్పరచుకోవటమే హేతువాదంయొక్క సిద్ధాంతరూపం" అని చెప్పాడు.

కొంతమంది మన తత్వశాస్త్రం హేతువాదంయొక్క శక్తిని సంకుచితపరచిందనీ, ప్రజల అభిరుచుల పుట్టుకను చూపి మన నమ్మకాలు హేతుబద్ధంగా వుండటానికి వీల్లేదని చెపుతుందనీ అంటున్నారు. కాని ఇది యదార్థం కాదు. మన తత్వ శాస్త్రం హిస్టీరియా, పిచ్చి మొదలైన జబ్బులను నయం చెయ్యటానికి పుట్టిందనే విషయం జ్ఞప్తికి వుంచుకుంటే ఈ విషయం మనకు తేలిగ్గా బోధపడుతుంది. పిచ్చి మొదలైన జబ్బులు సహజ వాంఛలను అణుచుకోవటం వల్ల వొస్తాయనీ ఈ వాంఛలను బహిర్గతం చెయ్యటంవల్ల పోతయ్యనీ మన తత్వ శాస్త్రజ్ఞులు చెపుతారు. ఈ చికిత్స మానవునికి ఆరోగ్యకరమైన స్థితి వొకటివుందనీ, ఈ రోగులు ఆ స్థితినుంచి దిగజారారనీ, తాము మరచిపోదలచిన కోర్కెలనుకూడా జ్ఞాపకంచేసి వళ్ళీ మామూలు స్థితికి తీసుకురావొచ్చనీ ఈ శాస్త్రం నమ్ముతుంది. దీనివల్ల మన తత్వశాస్త్రం హేతువాదానికి విరుద్ధమైందనిగానీ, హేతువాదం నిలవటానికి వీల్లేనివని నిరూపిస్తుందనిగానీ అనుకోటానికి కుదరదని నీవు నాతో అంగీకరిస్తావు.

ఇంతవరకు మనం సిద్ధాంతానికి సంబంధించిన హేతువాదాన్ని గురించి ఆలోచించాం. ఇక జీవితానికి సంబంధించిన హేతువాదాన్ని గురించి ఆలోచిద్దాం.

జీవితానికి సంబంధించిన విషయాల్లో అభిప్రాయ భేదాలు రెండు రకాలుగా వుంటై. 1. కోర్కెలలో భేదం. 2. పద్ధతుల్లో భేదం. ఈ కోర్కెలకు కారణాలు తెలుసుకోవటం చాలా కష్టం. మన కోర్కెలు హేతుబద్ధమైనవో కావో తెలుసుకోవటం కూడా కష్టమే! మన కోర్కెలకు అనుకూలంగా ఊహించటం, అనుకూలమైన సాక్ష్యాలు పోగుజెయ్యటం అనేది మామూలుగా జరుగుతున్న విషయమే! మానవుడు తన్ను తాను వంచించుకోవటంలో అందెవేసిన చెయ్యి. ఒక పద్ధతిగా నడుద్దామని అభిలషించినప్పుడు ఆ మార్గం వొక గమ్యస్థానానికి తీసుకొనిపోతుందని నమ్ముతాడు. నిజాలనుగురించీ, జరిగే అవకాశాలను గురించీ తనకు అనుకూలంగా, తన దృష్టికి వ్యతిరేకంగా వున్నవానికి భిన్నంగా వూహిస్తాడు. జూదగాళ్లు తమకు అనుకూలమైన గుడ్డి నమ్మకాలను అనేకం పోగుజేస్తారనే విషయం మనకు తెలిసిన విషయమే! రాజకీయాల్లో పాల్గొనేవారు తమ పార్టీ నాయకుడు ఇతర పార్టీల నాయకులుచేసే మోసపు పనులు చెయ్యడని నమ్ముతారు. అధికారవాంఛ వున్నవాళ్లకు ప్రజలు 'మందగా' కనుపిస్తారు. పొగాకుతాగేవాళ్లు నరాలకు మంచిది అంటారు. ఈ విధంగా మానవుడు చాలావరకు దృష్టిదోషానికి గురి అవుతాడు. ఈ దృష్టిదోషం తగలకుండా తప్పుకోవటం చాలా కష్టం. రచయితల విశ్వాసాలనుగానీ శాస్త్రవేత్తల విశ్వా

(తరువాయి ౪౮-వ పేజీలో)



"అమ్మా!..."

"పడుకోమ్మా!...నిద్రపో!"

"నాన్నేరే?"

వస్తారులే అమ్మా! పడుకో! మా తల్లివి గాదూ! నిద్రపోమ్మా!"

చిట్టి ఈవేళ ఎంతసేపు జోకొట్టినా నిద్రపోవడం మానేసి నాన్న కావాలని ఏడుస్తూంది. చిట్టికి రోజూ తండ్రి కథలు, కబుర్లు చెబుతూంటే అలా వింటూ నిద్రపోవడం అలవాటు. నరసమ్మ కాపరానికి వచ్చిన ఆరేళ్లకి చిట్టి పుట్టింది. చిట్టికిప్పుడు నాలుగో ఏడు. లేక లేక కలిగిన సంతానం కావడంవల్ల చిట్టికి తల్లిదండ్రులు బాగా గారం చేశారు. చిట్టి తరవాత నరసమ్మకి మళ్లీ సంతానం కలగలేదు.

చిట్టి ఉలిక్కిపడి లేచి ఏడవడం మొదలుపెట్టింది. ఎంత ఊరుకోబెట్టినా ఊరుకోలేదు. జడుసుకుందో ఏమో! నరసమ్మ అమ్మవారికి పూజచేసిన కుంకం చిట్టి నొసటను పెట్టి, పిల్లను ఎత్తుకుని ఓదారుస్తూ అటూ ఇటూ తిరిగింది. పిల్ల "నాన్న నాన్న" అంటూ గుక్కపట్టిన ఆయాసంతో అలిసిపోయి మళ్లీ కళ్లుమూసింది. నరసమ్మ చిట్టిని మళ్లీ జాగ్రత్తగా మంచం మీద పడుకోబెట్టి చేతులతో మెల్లి మెల్లిగా తట్టుతూ జోకొట్టింది. చిట్టినిద్రలో అప్పుడప్పుడు ఉలికి పడుతున్నది.

నరసమ్మకు కూడా ఆవలింతలు వస్తున్నాయి. రాత్రి ఒంటిగంట కావస్తున్నది. ఊరంతా మాటుమణిగింది. దూరంగా అప్పుడప్పుడు కుక్కలు మొరిగిన చప్పుడు వినవస్తు

న్నది. ఇద్దరు బంట్రోతుల్ని పిలిచి ఇంటికి కాపలాపెట్టి ఇనస్పెక్టరు వెంకటరావు సాయంత్రం పెందరాళ్లే భోజనం చేసి పోలీసులతో ఎక్కడికో వెళ్లిపోయాడు. మళ్లీ తిరిగి 10, 11 గంటల లోపుగానే వస్తానని చెప్పాడుగాని ఇంత వరకు తిరిగి రాలేదు. ఆయన మారుమూల పొలాల్లో దాగి ఉన్న ఎవరిని పట్టుకోడానికి వెళ్లారో ఎవరికి తెలుసును!

వెళ్లేటప్పుడు నరసమ్మ ఈవేళ ఎప్పటికి తిరిగివస్తారని అడిగింది! యథాప్రకారంగానే వెంకటరావు చిట్టిని ఒకసారి ఎత్తుకుని ముద్దు పెట్టుకుని, చిరునవ్వు నవ్వుతూ సాధ్యమైనంత త్వరలోనే వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. నరసమ్మ గుమ్మందాకా వెళ్లి నిలబడింది. బంట్రోతులతో ఇల్లు భద్రమని చెప్పి వెంకటరావు పోలీసులతో చరచరా నడిచి వెళ్లిపోయాడు.

ఈ మధ్యన దోపిడీలు, గృహ దహనాలు ఎక్కువైన కొద్దీ ఆ ఊళ్లో అలజడి ఎక్కువగా ఉంది. ఆ ఊరు ఒక మారు మూల ఉన్న ఊరు. ఒక చిన్న పోలీసు స్టేషను ఉంది. ఊళ్లో చిన్న పోస్టాఫీసు ఒకటి ఉన్నా ఆ ఊరు నించి ఉత్తరంవేస్తే అది రెండు మూడు రోజులదాకా అసలు ప్రయాణమే మొదలు పెట్టదు. అక్కడక్కడ పల్లెటూళ్లలో జరుగుతున్న దారుణ కృత్యాలు విన్నప్పటినించీ నరసమ్మకు భర్త ఈ ఉద్యోగం చెయ్యడం చాల ప్రమాదకరమని తోచింది. అయితే ఉద్యోగం లేకపోతే రోజు గడవడం ఎలాగ? గత్యంతరం లేక మరిఒకచోటి కెక్కడికైనా సురక్షిత ప్రదేశానికి వెళ్లిపోదామని ఆమె పట్టు పట్టింది. వినిపించుకోకపోతే సాయంత్రం భోజనాలవేళ మళ్లీ రెట్టించింది.

"ఇలాంటప్పుడు బదిలీ చెయ్యమంటే చెయ్యరు."

"ఏం?"

"ఇక్కడ ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని తెలిస్తే పైవారు మాత్రం ఇక్కడ బదిలీకి ఇష్టపడతారా?"

"పోనీ జబ్బుచేసిందని సెలవు పెట్టండి?"

"అతి కష్టంమీద సెలవు దొరుకుతుందే అనుకో! సెలవులయిపోయిన తరవాత మళ్ళీ ఇక్కడికే రావాలిగా!"

నరసమ్మకేమీ తోచలేదు. మళ్లీ కొంతసేపూరుకుని అతని ముఖంకేసి చూసి ఇలాగ అంది.

"పోనీ, నేనూ చిట్టీ మా యింటికి వెళ్లిపోతాము పంపించివెయ్యండి!"

"నేను కాదన్నానా! అసలు కాస్త మంచి రోజు కుదిరితే పంపించివేద్దామనే అనుకుంటున్నాను."

ఈ మాట అనేసరికి నరసమ్మ ఇక మాట్లాడలేక పోయింది. అసలు తానే పట్టుమని పదిరోజులపాటు ఆయన్ని విడచి ఉండలేదు! చిట్టి క్షణం నాన్న కనబడక పోతే నానా గందరగోళము చేస్తుంది. వెనక ఒకసారి బయలుదేరి పుట్టింటికి వెడితే వారం రోజులయ్యేసరికి చిట్టి జ్వరం పెట్టుకుని చిక్కి శల్యమైపోయింది. పట్టుమని పది రోజులైనా ఉండకుండా తిరిగి బయలుదేరవలసి వచ్చింది.

నరసమ్మ అల్లాగే ఆలోచిస్తూ మంచాని కానుకుని కునికిపాట్లు పడుతూంది. రాత్రి మూడవ పొలాలలోనుంచి కీచులాళ్ళమోత వినిపించేటంత నిశ్శబ్దంగా ఉంది.

ఒక్కసారిగా ఇరుగు పొరుగున ఉన్న కుక్కలన్నీ భోయ్యమన్నాయి. నరసమ్మ ఉలిక్కిపడిలేచి బంట్రోతుల్ని కేకేసింది. రెండోజాము నిద్రలో ఉన్నారేమో! వాళ్లెవరూ పలకలేదు! వాళ్లు గుర్రుపెట్టి నిద్రపోతున్న చప్పుడుమాత్రం స్పష్టంగా వినిపిస్తున్నది.

మళ్లీ చెవులు గింగురుమనేటట్లు కుక్కలు మొరిగాయి. ఊళ్లో దూరంగా పెద్ద కోలాహలం వినబడింది. కుక్కలు మొరగడాలు అంతకంతకు ఎక్కువౌతున్నాయి గాని తగ్గడం లేదు. నరసమ్మ గట్టిగా "వెంకన్నా!" అని బంట్రోతును కేక పెట్టింది. అరుగుమీద పడుకున్న బంట్రోతులు లేస్తున్నారో లేదో చూదామని ఆమె కిటికీ దగ్గరకు వెళ్లింది. కిటికీ తలుపులు తెరిచిచూసింది. ధామ్! ధామ్! అని 5, 6 సార్లు తుపాకి మోతలు వినిపించాయి.

ఆ దృశ్యం చూసేసరికి ఆమెగుండె ఆగిపోయినట్లయింది. ఎదురుగా యాభై అరవైమంది, నల్లటి చొక్కాలు, లాగులు తొడుక్కుని చేతుల్లో కాగడాలు పట్టుకుని వస్తున్నారు. అందులో ఒకడు బూరాలో మూతిపెట్టి గట్టిగా "తలుపులు తెరవకండి! వీధుల్లో రాకండి! తలుపు తెరిస్తే తల లెగిరిపోతాయి." అని కేకలు పెడుతున్నాడు. కొందరి చేతుల్లో కత్తులు బల్లాలు కాగడాల వెలుతురులో తళతళ మెరిసిపోతున్నాయి. 'మరికొందరు తుపాకులు బుజాల మీద పెట్టుకున్నారు. వారందరు ఒకే క్రమంతో అడుగులు వేసుకుంటూ కాళ్లతో గట్టిగా చప్పుడు చేసుకుంటూ నడిచి వస్తున్నారు. ఆమె గట్టిగా కేకలువేసి బంట్రోతుల్ని పిలిచింది. వాళ్లెవ్వరూ పలకలేదు. రెండోవైపునున్న మరో కిటికీ తెరిచిచూసింది! ఇంతవరకు అరుగుమీద పడుకుని ఉన్న బంట్రోతు లెవ్వరూ కనబడలేదు. ఒక్కసారిగా ఆమె మనస్సులో వాళ్లు తమ ప్రాణాలు దక్కించుకోడానికి పారిపోయిన సంగతి మెరుపులా మెరిసింది. ఆమెకు మరి కాళ్ళాడలేదు! భయంతో నోరార్చుకుపోతు నాలుక పిడచ కట్టుకుపోతూన్నట్లనిపించింది. ఆ తరవాత ఆమె చిట్టిని కదలకుండా జాగ్రత్తగా మంచంకింద పడుకోబెట్టి పిల్ల కనబడకుండ దుప్పటీ మంచంకోళ్ల కిందికి దిగజార్చింది. మళ్ళీ చిట్టిని ముద్దుపెట్టుకుని నిశ్శబ్దంగా ఏడుస్తూ మంచం కోడుదగ్గిర బిక్కుమంటూ కూర్చుంది. భయంవేత ఆమె కాసమయంలో ఆలోచించే శక్తికూడా నశించిపోయింది...

ఇంతలో ఎవరో దబదబా తలుపు కొట్టారు!

"తలుపు! తలుపు!" పికిలగా తలుపులమీద ఒక వంద తాపులు వినిపించాయి! తరవాత ఒక పెద్ద దుంగతో తలుపులమీద మోదిన చప్పుడు...తలుపులు తటాలున ఊడి

చెరి ఒక పక్కకీ పడిపోయాయి! బిల బిలమని కాగడాలతో 50, 60 మంది లోపలికి ప్రవేశించారు.

ఆమె భయంతో గోడకు ఒక మూలగా కూలబడి పోయింది.

“ఇనస్పెక్టరెక్కడ దాక్కున్నాడు?” అని ఒక కర్కశ స్వరం అడిగింది.

“దాక్కోలేదు! పోలీసుల్ని తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయారు!”

“నిజం చెప్పు.” చింతనిప్పుల్లా ఎర్రగా మెరుస్తున్న రెండు కళ్లు ఆమెను గద్దించి అడిగాయి!

ఆమె చేతులు జోడించి దీనంగా నిజమే చెబుతున్నానని సమాధానం చెప్పింది.

ఒక తర్జని భయంకరంగా ఆమెను నగలన్నీ ఒలిచి ఇమ్మని ఆజ్ఞాపించింది.

ఆమె కిక్కురు మనకుండా నగలన్నీ ఒలిచి ముందు పెట్టింది. ఈలోగా బాటరీలైట్లు కొన్ని విద్యుద్వీక్షణాలతో ఇల్లు నాలుగు మూలలా గాలించాయి.

మళ్లీ కర్కశమైన ప్రశ్న—

“పిల్లనెక్కడ దాచావు?”

ఆ ప్రశ్నతో ఆమె హృదయంలో రక్తం గడ్డకట్టుకు పోయింది. ఆమె హీన స్వరంతో సమాధానం చెప్పింది.

“దాచలేదు! వాళ్ళ బామ్మగారింటిదగ్గర ఉంది!”

“అబద్ధాలాడుతున్నావు! చెబుతావా? ఒక్క పోటు పొడిచెయ్యమన్నావా?”

ఆమె బావురని ఏడుస్తూ అతని కాళ్ళమీద పడింది. ఈ గల్లంతులో మంచంమీద పడుకున్న పిల్లలేచి పెద్దగా ఏడవడం మొదలుపెట్టింది.

అతను జబ్బ పట్టుకొని ఆమెను గోడ కానించి కూర్చోపెట్టి, రోజుతూ, ఆమెకేసి తీవ్రంగా చూసి మళ్లీ ప్రశ్నించాడు.

“దొంగా! నాతో అబద్ధం చెబుతావా? ఇనస్పెక్టరెక్కడ దాక్కున్నాడో చెప్పు!”

ఆమె గొల్లున ఏడుస్తూ అతి దీనంగా ఇనస్పెక్టరు పోలీసులతో వెళ్ళిపోయిన విషయం రెట్టించి చెప్పింది.

అతను పిస్తోలుతీసి మీటమీద వేలుంచి “ఇప్పుడైనా నిజం చెబుతావా? చంపెయ్యనా?” అని గద్దించాడు.

ఆమెకు సమాధానం చెప్పే ఆలోచనా శక్తి కొద్దిగా క్షీణించింది. మళ్ళీ చేతులు జోడించి అతని కాళ్లమీదపడి ఏడుస్తూ దయాభిక్ష వేడింది. ఉత్తర క్షణంలో ధామ్మని పేలిన పిస్తోలు ధ్వనితో ఆమె రోదనము వెనువెంటనే జీవము అంతరించాయి. పిమ్మట ఊరంతా దద్దరిల్లేటట్లు ప్రతిధ్వనించే విప్లవ నినాదాలతో ఆ విప్లవకారులు ఆకాంచలాలలో క్షణకాలం తమ ఆదర్శ రాజ్యం నిర్మించారు! ఆ తరవాత వారు సక్రమ పాద విన్యాసాలతో ఊరు దాటి అంధకారంలో లీనమైపోయారు.

దయాభిక్షకోసం జోడించిన హస్తాలతో అలాగే కొయ్యబారిపోయిన ఆమె కళ్లు శూన్యంకేసి నిరీక్షిస్తూ నిలిచిపోయాయి. చిన్నపిల్ల నేలమీదపడి ఏడుస్తూంటే ఒక ఎలుకపిల్ల అక్కడికివచ్చి, ముని కాళ్ళమీద నిలబడి ఆపిల్లకేసి చూసి, తిరిగి తన దారిని వెళ్లిపోయింది.



నారాధనము సేయు మత్తమామల కెపుడు,
పరిజనంబుల మీద గరుణ గలిగి,
యలుగకు కోపించి నపుడు నాథుని తోడ,
మదిలోన నుబ్బకు మన్ననలకు
దోడి కోడండ్రతో గూడియాడి చరింపు,
దాసీజనము బ్రోవు దల్లి కరణి,

బ్రాహ్మణులయందు గురులందు బంధులందు
భక్తివిశ్వాస సౌహార్ద్రి పరత నెరపు
ధన్య పతిదేవతా చార పరమపుణ్య
ధర్మ మేమరకుండుమీ తల్లి కాన.

(శృంగార నైషధము).

చిత్తమెరింగి భర్తలకు
సేవలు చేయుట ధర్మమమ్మ లో
కోత్తర యత్తగారి కెదు
రుత్తర మెత్తకు మమ్మ యమ్మరో
యొత్తకు కంచిపట్టి తల
యుయ్యెల తొయ్యలులందు నంత య
త్యుత్తమరాలు మేలనగ
నుండుట భూషణమమ్మ కోమలీ.

(పాంచాలీ పరిణయం)

కలవారి పడుచు ననుచుం
దలిపెదు సు నడకచేత దీనుల బతులీ
వులు కొంచమిడిన బదివేల్
ఫలియించు నటించుగాని పదరకుసుమ్మీ.

(పాంచాలీ పరిణయము)

పై విషయాలు వారియొక్క సద్గుణ పుంజాన్ని వినయ విధేయతల్నీ బంధుప్రీతినీ గౌరవ మర్యాదలను కాపాడే విషయంలోనూ కుటుంబ గౌరవాన్ని నిలిపే విషయం లోనూ స్త్రీలు నడచుకోవలసిన రీతిని తెలుపుతుందే కాని వారు కేవలం బానిసలుగా అత్తమామల ఆజ్ఞల్ని పరిపాలించే కీలుబొమ్మలుగా వుంటారని భావించకూడదు. అంతే కాదు పూర్వకాలమున స్త్రీలు వంటయింటి బానిసలుగాను, పిల్లలుగను యంత్రములుగాను వుండేవారను భావం మన వారిలో చాలా ప్రబలంగా వ్యాపించివుంది. కాని వారిలో అతి ప్రతిభావంతులైన విద్యాధికలుగూడ నుండిరను సంగతి ప్రబంధములను జదివినవారికి తెలియగలదు. ఈ విషయాన్ని ప్రభావతీ ప్రద్యుమ్నంలోని ఈ క్రింది పద్యం రుజువు పరుస్తుంది.

కావ్య నాటకా లంకార గాన మదన
శాస్త్ర పరిచయ మహిమంబు జాల పాగ
భామినీమణి నెరపె నుద్దామ పటిమ
నా యసూభర్త మెచ్చి పురే యనంగ

ప్రబంధ యుగానికిముందే మన దేశంలో గణిత శాస్త్రమునం దఖండ ప్రజ్ఞా సమన్వితయగు లీలావతివంటి ధీశాలురును గలరను సంగతి జగద్విదితమే.

ఒక్క విద్యలలోనేగాక పూర్వకాలమునందలి స్త్రీలకు జలక్రీడలు, దాగుడుమూతలు, ఊయేలలూగుట, బొమ్మ పెండ్లిళ్లు, పింపిళ్లు, ఓమనగుంటలు గొల్ల స్తంభాలు మొదలైన క్రీడా విలాసాల్లోనూ ఈత, కత్తిసాము, గుర్రపు సవారీవంటి సాహస క్రియలలోనూకూడా పాల్గొనేవారని ప్రబంధాలనుండి గ్రహింపగలము. అందుల కుదాహరణగా రెండు పద్యాలుదాహరిస్తాను.

దినముల్ కొన్ని చనంగ నంత గడు నర్థిన్
బొమ్మ పెండ్లిండ్లు గు
జ్జెనగూళ్లు చ్చనగండ్లు పింపిళులు కుచ్చిల్
గీరనంగింజ లో
మన గుంటల్ కనుమూసి గంతన నలు
కంబాలాట లోనైన
ఖేలనముల్ మీఱగ బోంట్లతో నలరె
బాలరత్న మెల్లప్పుడున్.

(కళా పూర్ణోదయము)

తన హృదయంబు వెంబడిన తప్పక ఘోటక మంతనంతసే
పను పడనిర్చి ముందరికి బాఱి కెలంకులకూ దొలంగి దా
వెనుకకు నేగుదెంచి కడువేడ్క యొనర్పగ బంతియాడ నె
మ్మని గనకంపు గోల నడిమింటనె త్రిమ్మర దారికొట్టుచున్.

(ప్రభావతీ ప్రద్యుమ్నము)

ప్రబంధయుగము, స్త్రీలు

నల భీమపాకమని ఎక్కువగా పేరొక్కనడానికి కారణం వారు పురుషులయ్యూ స్త్రీల విద్యలయందు ప్రకాశించడం వల్లనే. అంతమాత్రాన పూర్వం పురుషులకే గాని స్త్రీలకు వంటలు భక్ష్య విశేషాలు చేయడం చేతగాదనుకోకూడదు. పాంచాలీ పరిణయంలోని ఈ క్రింది పద్యాలను జూస్తే స్త్రీలు పాకకళయం దెంతటి సిద్ధహస్తులో తెలియగలదు.

వడ్డన జూపిరంత చెలువల్ తెలిమోగిర మొల్వపప్పు మెం
డొడ్డిః కూరగాయ ఘృత ముక్కెర చక్కెర తేనెలడ్డు వా
లిడ్డెన లానవాలు చలియించని తైరులు మేరుమేరు పై
గిడ్డి దలంచిరో యనగ గేస్తులకబ్బె సమస్తభాగ్యముల్.

చేత మెతు కంటకుండన్
సీతా భోగములవారి చినయోగిర మా
రా తుమ్మిపూర తెలుపా
హా తావియయూర వేడియని వేడిరాగిన్.

మన భారత నారీమణులు 'కార్యేషుదాసీ కరణేషు మంత్రీ...' అనే విధంగా పతులకు వివిధరంగాలలో చేదోడు వాదోడుగా వుంటూ తమకుగల చనువునుబట్టి వారికి వారి కార్యాలలో తోడ్పడుతూ వుండేవారు.

పతులు విచారముగానుండే సమయాల్లో వారికి ధైర్యాన్ని గొల్పుతూ (శృంగార నైషధంలో దమయంతి నలుని ప్రోత్సహించి ధైర్యము గొల్పుతుంది.) నిస్పృహాయ నిరాలంబ స్థితిలో తగిన ఆలోచనలు తెల్పుచూ (శంకరకవి హరిశ్చంద్రో పాఖ్యానంలో చంద్రమతి విశ్వామిత్రుని ఋణవిముక్తుడగుటకు భర్తకు తగిన సలహాల నిస్తుంది.) వున్న ఘట్టాలు ఏ ప్రబంధంలో వెదకినా మనకు కనిపిస్తూనే వుంటాయి.

వీటన్నిటికీ తోడు స్త్రీలు పురుషులతో సమానంగా ఆహవరంగంలో పాల్గొనేటంతటి ధైర్య సాహసాలూ యుద్ధ పాటవం కలవారనికూడా ఉత్తర హరివంశంలోని ఈ క్రింది పద్యాలవల్ల తెలియగలదు.

తంత్రీ వినోదంబు తడవు సైపని క్రేళ్లి
గోపాయంబు తెగలపై గోరి కనుతు
యుద్ధంబు పిడిముట్ట నలయు పాణితలంబు
లస్తకం బిటియించు లావు కలిమి

చెలికత్తె నొత్తలి చీఱలేని యెలుంగు
సింహానాదంబుచే జెదరకునికి
ప్రమద నర్తన కేలి బంతివింపని పదం
బైదురాణంబుల నలత బడమి

సోయగపు చిత్రరూపంబు జూచుచోట
వేసరు విలోచనంబులు వికృతదైత్య
లక్ష్య మీక్షించుటలు మొక్కలంపు గెలుపు
నైకొనియె సత్యభామ సంగ్రామసీమ

అఱజూచున్ హరిజూచు జూచు కములం
దందంద మందార కే
సర మాలా మకరంద బిందు సవిల
స్యందంబు లందంబు లై
తొరగం బయ్యెదకొంగొకింత దొలగం
దోర్దోః శరా సారముల్
దరహాసామృత పూరముం గురియుచున్
ధన్వంగి కేళీగతిన్.

గదవిసరి వైచె నరకుడు
వదలక సతిదునిమె శక్తివైచెను దివిజా
డది ముదిత దుమురు సేసెను
దుది బరిఘము వైచె నతడు దొయ్యలి విఱిచెన్.

ఇట్లు స్త్రీలు సమస్త విషయాలలోనూ పురుషులతో సమానంగానూ, కొండొకచో పురుషులకన్న మిన్నగానూ వ్యవహరించి కీర్తినందిన విషయాలు మనం ప్రబంధాలు తరిస్తే కొల్లకొల్లలుగా దొరుకుతాయి.

ఇంక ప్రబంధాలలో ఎక్కువగా వర్ణింపబడే శృంగార రస పోషణలో నాయికలు చూపిన చాకచక్యము ఏ ప్రబంధం చూసినా మనకు గోచరిస్తూనే వుంటుంది. ప్రబంధ వర్ణనలలో కొంతవరకు అతిశయోక్తికి తావు గల దన్నమాట వాస్తవమేగాని అందలి విషయాలు పూర్తిగా సత్యదూరమని కొట్టి పారవేయడానికి వీలులేదు.

మొత్తంమీద ప్రబంధయుగంలో స్త్రీలు సమస్త విషయాలలోనూ పురుషుల కెంతమాత్రము తీసిపోకుండా వాసి గాంచిన విషయం మనకు సులభంగా గ్రాహ్యం కాగలదు.

★

నల భీమపాకమని ఎక్కువగా పేరొక్కనడానికి కారణం వారు పురుషులయ్యీ స్త్రీల విద్యలయందు ప్రకాశించడం వల్లనే. అంతమాత్రాన పూర్వం పురుషులకే గాని స్త్రీలకు వంటలు భక్ష్య విశేషాలు చేయడం చేతగాదనుకోకూడదు. పాంచాలీ పరిణయంలోని ఈ క్రింది పద్యాలను జూస్తే స్త్రీలు పాకకళయం దెంతటి సిద్ధహస్తులో తెలియగలదు.

వడ్డన జూపిరంత చెలువల్ తెలియోగిర ముల్పపప్పు మెం
డొడ్డిన కూరగాయ ఘృత ముక్కెర చక్కెర తేనెలడ్డు వా
లిడ్డెన లానవాలు చలిఘించని తైరులు మేరుమేరు పై
గిడ్డి దలంచిరో యనగ గేస్తులకబ్బె సమస్తభాగ్యముల్.

చేత మెతు కంటకుండన్
సీతాభోగములవారి చినయోగిర మా
రా తుమ్మిపూర తెలుపా
హా తావియయారె వేడియని వేసిరి గిన్.

మన భారత నారీమణులు 'కార్యేషుదాసీ కరణేషు మంత్రీ...' అనే విధంగా పతులకు వివిధరంగాలలో చేదోడు వాదోడుగా వుంటూ తమకుగల చనువునుబట్టి వారికి వారి కార్యాలలో తోడ్పడుతూ వుండేవారు.

పతులు విచారముగానుండే సమయాల్లో వారికి ధైర్యాన్ని గొల్పుతూ (శృంగార నైషధంలో దమయంతి నలుని ప్రోత్సహించి ధైర్యము గొల్పుతుంది.) నిస్పృహాయ నిరాలంబ స్థితిలో తగిన ఆలోచనలు తెల్పుతూ (శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యానంలో చంద్రమతి విశ్వామిత్రుని ఋణవిముక్తుడగుటకు భర్తకు తగిన సలహాల నిస్తుంది.) వున్న ఘట్టాలు ఏ ప్రబంధంలో వెదకినా మనకు కనిపిస్తూనే వుంటాయి.

వీటన్నిటికీ తోడు స్త్రీలు పురుషులతో సమానంగా ఆహవరంగంలో పాల్గొనేటంతటి ధైర్య సాహసాలూ యుద్ధ పాటవం కలవారనికూడా ఉత్తర హరివంశంలోని ఈ క్రింది పద్యాలవల్ల తెలియగలదు.

తంత్రీ వినోదంబు తడవు సైపని వ్రేళ్ళ
గోణయంబు తెగలపై గోరి కనుట
యుద్ధంబు పిడిముట్టు నలయు పాణితలంబు
లస్తకం బిటియించు లావు కలిమి
చెలికత్తె నొత్తలి చీఱలేని యెలుంగు
సింహనాదంబుచే జెవరకునికి
ప్రమద నర్తన కేలి బంతివింపని పదం
బైదురాణంబుల నలత బడమి

సోయగపు చిత్రరూపంబు జూచుచోట
వేసరు విలోచనంబులు వికృతదైత్య
లక్ష్య మీక్షించుటలు మొక్కలంపు గెలుపు
గైకొనియె సత్యభామ సంగ్రామసీమ

అడిజూచున్ హరిజూచు జూచు కములం
దందంద మందార కే
సర మాలా మకరంద బిందు నవిల
స్యందంబు లందంబులై
తోరగం బయ్యెదకొంగొకింత దొలగం
దోడ్తో శరా సారముల్
దరహాసామృత పూరముం గురియుచున్
ధన్వంగి కేళీగతిన్.

గదవిసరి వైచె నరకుడు
వదలక నతిదుని మెశక్తివైచెను దివిజు
డది ముదిత దుమురు సేసెను
దుది బరిఘము వైచె నతడు దొయ్యలి విఱిచెన్.

ఇట్లు స్త్రీలు సమస్త విషయాలలోనూ పురుషులతో సమానంగానూ, కొండొకచో పురుషులకన్న మిన్నగానూ వ్యవహరించి కీర్తినందిన విషయాలు మనం ప్రబంధాలు తరిస్తే కొల్లకొల్లలుగా దొరుకుతాయి.

ఇంక ప్రబంధాలలో ఎక్కువగా వర్ణింపబడే శృంగార రస పోషణలో యువతులు చూపిన ప్రాకమ్యము ఏ ప్రబంధం చూచినా మనకు పొడగట్టుతూనే యుంటుంది. ప్రబంధ కర్తలలో కొంతమందికి అతిశయోక్తికి తావు గల దన్నమాట వాస్తవమేగాని అందలి విషయాలు బొత్తిగా సత్యదూరమని కొట్టి పారవేయడానికి వీలులేదు.

మొత్తంమీద ప్రబంధయుగంలో స్త్రీలు సమస్త విషయాలలోనూ పురుషుల కెంతమాత్రము తీసిపోకుండా వాసి గాంచిన విషయం మనకు సులభంగా గ్రాహ్యం కాగలదు.

ప్రజా ప్రాతినిధ్యాన్ని పొంది తద్వారా శాసన సభ్యులు కాదల్చుకొనే వారలందరకు

హెచ్చరిక!

ఆర్యా,

మీరు కాంగ్రెసువారే కావచ్చు—కమ్యూనిష్టులే కావచ్చు—సోషలిస్టులు కావచ్చు—లేదా రాడికల్ హ్యూమనిస్టులే కావచ్చు. మీరే వర్గానికి చెందినవారైనా బాధలేదు. మా సామాన్య ప్రజకు కూడు గుడ్డలకు లోటు లేకుండా దేశం సుభిక్షంగా వుండే పక్షాన యే పార్టీ అధికారంలోవున్నా ఒకటే. నూత్న రాజ్యాంగం తయారయింది. భారతదేశం సర్వ స్వతంత్ర రిపబ్లిక్‌గా మారింది. అది ప్రాతిపదికగా క్రొత్త యెన్నికలు కొద్దికాలంలోనే జరుగనై యున్నవి. మీ పార్టీ కార్యక్రమ ప్రణాళికన్ని ప్రజలముందు—అంటే అమాయకులమైన మాముందు పెట్టి మాకు ఆశగొల్పి మా ఓట్లను పొందేందుకు ప్రయత్నిస్తారు. ఆ విధంగా ప్రజాప్రాతినిధ్యాన్ని పొందదలిచే వారికి చేసే హెచ్చరికే యిది.

మేము తెల్లదొరతనం చేసిన దుర్మార్గాన్ని సహించి వారికి వంగి వంగి సలాములు చేశాం. కాని నేడు లక్షలాది మంది విప్లవయోధుల ప్రాణత్యాగ ఫలితంగాను—స్వతంత్ర భారత పిత గాంధి మహాత్ముని నాయకత్వాన కాంగ్రెసు సంస్థ సాగించిన అహింసాయుత పోరాట ఫలితంగాను, స్వతంత్రులమైనాము. కాంగ్రెసుపార్టీ వెంటనే ప్రభుత్వ పీఠాన్ని అధిష్టించింది. అప్పటినుండీ కూడా ప్రభుత్వం అనేక గడ్డు సమస్యల్ని యెదుర్కొనవలసి వచ్చింది. అందువలనైతేనేమి మరియేయితర కారణాలవల్లనైతేనేమి ప్రత్యక్షంగా ప్రభుత్వం మాకు—మద్యనిషేధ చట్టాన్నమలు పరుస్తూ, జమీందారీలను రద్దుపరచుట తప్ప—యెట్టి సదుపాయాన్ని గాని చేసియుండలేదనే చెప్పాలి. స్వతంత్రులమైనాముగదా—మన కష్టాలు తొలగునై సుఖిస్తాము అని యెన్నోకలలు గన్నాం. మా కలలన్నీ నేటికీ కలలుగానే నిలిచిపోయినై. "ఇంతకంటె తెల్లదొరతనమే బాగున్నది. ఇదేం కాంగ్రెసు ప్రభుత్వం గాబూ" అని పెదవులు విరిచారు మాలో కొందరు. అది కేవలం దేశపరిస్థితులనే మాత్రం అవగాహన చేసుకోనని వారు చేసే అసభ్యపు విమర్శ మాత్రమే కావచ్చు. కాని ఆకటిమంటతో అటమటిస్తున్న మాకు అవన్నీ యెలా అర్థమవుతవి? ప్రభుత్వం చేసే సగోత్ర వివాహ సమర్థనా చట్టాలతోను, ప్రజా ప్రతినిధులు వారి నాయకులయందు కుట్రలు పన్నికావించే విశ్వాస రాహిత్య తీర్మానాలతోను మాకేం నిమిత్తం? మాకు కావలసింది—కడుపునిండా తినేందుకింత తిండి—వంటినిండా కప్పుకునేందుకింత బట్ట. అంతే మా యీ న్యాయమైన కోర్కెను, హక్కును తీర్చేందుకు ప్రయత్నిస్తారనే మిమ్మల్ని యెన్నుకునేది. కాని మీరు ఆ శాసన సభా భవనంలో, ఆ గాలి పంకాల హాయిలోకి వెళ్లేసరికి మా సంగతి మరచిపోతారు. మేము మీ కిచ్చిన ప్రాతినిధ్యాన్ని దుర్వినియోగం చేస్తారు స్వార్థపరులై. ఏమంటే, మిమ్మల్ని యెన్నుకున్నాక యిక మళ్లీ యెన్నికలవరకూ కదిపేందుకా బ్రహ్మకైననూ తరంకాదు. అందుచేత మా బాగోగులు మీ మంచితనంపైన ఆధారపడి వున్న వన్నమాట. మీరు ప్రజా ప్రతినిధులుగా మీ బాధ్యతలను గుర్తించిన నాడుగాని మీలో మంచిదనంరాదు. మీ బాధ్యతలు మీరు గుర్తించాలనంటే—ఒక్కమారు మేము నివసించే ప్రదేశాల్ని, మమ్మల్ని, వచ్చి పరిశీలించండి. మా పూరి గుడిశల్నీ, వాటికి చుట్టూ వుండే మురికి గుంటల్నీ, బక్కచిక్కిన మా బడుగు దేహాల్నీ గనుక చూచినట్టయితే హృదయముండే ప్రతి మానవుడూ కన్నీరు కారుస్తాడు. మీరుకూడా—హృదయమున్నవుంటే—వలవలా యేడుస్తారు. మీరు మీ బాధ్యతలను గుర్తింపగలుగుతారు. అందుచేత—రండి. ఒక్కమారు చూడండి. మా కష్టజీవులు పడే పాట్లను మా స్థితిని చూడవలెనంటే స్వయంగా మీరు కూడా అనుభవించినట్టయితే మీరు కష్టాలను గుర్తించేందుకు యెక్కువ అవకాశం వుంటుంది. కాని సుకుమారులైన మీకు కూడా యెందుకీ కష్టాలు? మే మనుభవిస్తున్నది చాలు. మే మనుభవించే కష్టాలుచూచి మా హక్కును

హెచ్చరిక

తీర్చేందుకు ప్రయత్నించాలెననే భావం మీకు కలిగితే అదే పదివేలు.

అందుచేత మా వోట్లతో మా ప్రాతినిధ్యాన్ని పొందాలనుకునేవారు యీ క్రింది విషయాల్ని గమనించవలసిందిగా కోరుతున్నాం.

"మనం ప్రాతినిధ్యం వహించాలె ననుకున్న ప్రజల స్థితిగతులేమిటి? వాళ్లు కోరేదేమిటి? వారి హక్కులను, కోర్కెల్ని తీర్చేందుకు ప్రయత్నించడానికేనా మనం వాళ్ల వోట్లను తీసుకుంటున్నది? ప్రజా ప్రతినిధుల బాధ్యతలేమిటి? ఎంతవరకు వాటిని నిర్వర్తించగలము?" అనే ప్రశ్నల్ని ఒక్కమారు మిమ్మల్ని మీరే అడిగి చూడండి. అలా ప్రశ్నించుకొని "మనం స్వార్థంకోసం ప్రజా ప్రాతినిధ్యాన్ని కోరడంలేదు. వాళ్ల కోర్కెల్ని తీర్చగలం" అనే సమాధానాన్ని గనుకను మీరు మీ అంతరాత్మనుండి పొందినట్టయితే అప్పుడు యెన్నికలలో పోటీ చెయ్యండి.

మా స్థితిగతుల్ని అభివృద్ధి పరచేందుకు బద్ధకంకణులు గండి. మీరు అవినీతిపరులుగా తయారుకారనే నమ్మకంతోనే మేం మిమ్మల్ని యెన్నుకుంటాం. అందుకుగాను మీరు—మీ ఇజమ్స్‌తో మాకు నిమిత్తంలేదు—ఆ విధంగా నీతికి కట్టుబడి ప్రవర్తించండి. ఇదే యీనాడు మాలో ప్రతి ఒక్కరం మిమ్మల్ని కోరేది. ఏమంటే భారతదేశ ప్రతిష్ఠ, భారతీయుల జీవితము మీమీదనే ఆధారపడివున్నాయి. అందుకుగాను భావి భారత సౌభాగ్య నిర్మాతలయ్యేందుకు ప్రయత్నించండి. ఆనాడు మేము మీకు చేయూతనిచ్చి సహకరిస్తాము. ఆనాడే ప్రపంచమందలి సాటి దేశములతో సమానస్థాయితో భారతమాత సగర్వంగా తలెత్తుకొని, "సర్వమానవ సౌభ్రాతృత్వ సాధనా మహత్కార్యానికి నా చేయూతనిచ్చి సహకరిస్తాను" అని అనగలిగేందుకు వీలు కలుగుతుంది. మహాత్ముని ఆశయం ఫలిస్తుంది.

సెలవు. జై హింద్!

—రా. గంగరాజు

★

(24 వ పేజీ తరువాయి).

సాలవగానీ తరచిచూస్తే ఎక్కడో వొకచోట వారి 'దృష్టి దోషం' మనకు కనిపిస్తుంది. నిజాలకు తనకు అనుకూలమైన దృష్టిని ఆపాదించటం జరుగుతూ వుంటుంది. రాజకీయంలోనూ, మతంలోనూ ఇది మరీ ముఖ్యంగా కనపిస్తుంది. చాలామంది తమ ఉద్దేశాలు సంఘ సేవ చెయ్యాలనే కోర్కెవల్ల పుట్టినవని భ్రమపడుతూ వుంటారు. కాని చాలావరకు మనుష్యుల అభిప్రాయాల పుట్టుక మరొకచోట వుంటూ వుంటుంది. ఇందువల్ల Objectivity అనేది వుండటానికి వీల్లేదని కొందరు అనటానికి అవకాశం కలుగుతూ వుంది. ఇటువంటి సందర్భాల్లో మనస్తత్వ శాస్త్రం చాలా సహాయపడుతుంది. మనస్తత్వ శాస్త్రం ఈ కోర్కెలకు పునాదిగా, అంతర్గతంగావున్న వాంఛను పైకితెచ్చి చూపుతుంది. ఇతరులు మనలను ఏ విధంగా చూస్తున్నారో, అదే విధంగా మనలను మనం చూసుకోవటానికి అవకాశం కల్పిస్తుంది. ఈ జ్ఞానాన్ని దీనితోపాటు శాస్త్రదృష్టిని గనక ప్రచారం చేసేటట్టయితే, మానవుడు ఇప్పటికంటే హేతువాది అయి వృద్ధి చెందుతాడు. "జీవితానికి సంబంధించిన హేతువాదాన్ని, మనలో తాత్కాలికంగా ప్రబలంగావున్న కోర్కెనేకాక, అన్ని కోర్కెలనూ తెలుసుకోవటంగా నిర్వచించవొచ్చు. సంపూర్ణంగా హేతువాది అవటం అనేది సాధ్యంకాక పోవచ్చు. కాని 'పిచ్చివాళ్లు' వున్నారని మనం వొప్పుకున్నంత కాలం వొకరికంటే వొకరు ఎక్కువ హేతువాదంమీద ఆధారపడేవాళ్లు వుంటారని మనం వొప్పుకొని తీరాలి. హేతువాదం వృద్ధిచెందటం మీద పురోభివృద్ధి ఆధారపడి వుందని నా విశ్వాసం." అని చెప్పి—"మన తెలివితేటలతో మన కోర్కెలను తెలుసుకోవటం, వాటిని హద్దుల్లోపెట్టుకోవటం జీవితానికి ముఖ్యంగా కనిపిస్తుంది. జీవితం సక్రమంగా వృద్ధి చెందాలంటే ఇది అవసరం. ఇప్పుడు ప్రపంచంలోవున్న చెడుపోవాలంటే క్రమక్రమేణా తెలివి తేటలు ప్రచారం అవ్వాలని మనం ఆశిస్తున్నాం," అన్నాడు బెర్ట్రెండ్ రసెల్.

★

పిల్లల శిక్షణ శాస్త్రీయ దృక్పథం

శ్రీమతి దరిసి సుభద్రమ్మ

పొందుపరచుకొనుట :—

ప్రకృతి యేర్పరిచిన ప్రత్యేకమైన సూక్ష్మగ్రాహ్య తరుణములలో బిడ్డ తన గ్రహణశీల మనస్తత్వం మూలకంగా పరిసర పరిస్థితుల సంసర్గంచేత, తన బుద్ధినీ, మానసిక శక్తులను సృష్టించుకొని తాను జన్మించిన దేశ, కాల, పరిసరములకు, పరిస్థితులకు అనుగుణ్యంగా పొందుపరచుకొనే శక్తిని సంపాదించుతుంది. అనగా, తను పుట్టిన కుటుంబం, సంఘం, దేశంయొక్క భాష, సంస్కృతి, ఆచార సాంప్రదాయాలు మున్నగునవి తనలో భాగమయిపోతవి. ఈ విధంగాపొందు పరచుకొనే శక్తికే "అనరణానుగుణ్యత" అంటారు.

బిడ్డ సాధించుకొనె ప్రతి లక్ష్యమున కనుగుణ్యంగా ప్రత్యేకమైన సూక్ష్మగ్రాహ్యదశ ఏర్పడటం, ఆ లక్ష్యమును సాధించిన వెంటనే అది అంతరించిపోవటం, మరొక లక్ష్యాన్ని బిడ్డ సాధించటానికోసం తదనుగుణ్య దశఏర్పడడం జరుగుతుంటుంది. అనగా, బిడ్డయొక్క సర్వ శక్తులు నిర్మాణ మగువరకు ఈ విధంగా ఉద్భవిస్తూ, అంతరించుతూ వుంటాయి. ఒకసారి ఉద్భవించి అంతరించిన సూక్ష్మగ్రాహ్య దశ, మరల రాదు. అలాంటి తరుణములో బిడ్డ సాధించే లక్ష్యమున కవసరమైన అవకాశం లేని యెడల, తిరిగి ఆ లక్ష్యమును సాధించటం అత్యంత ప్రయాసకరమైన విషయం. ఈ ప్రత్యేక సూక్ష్మగ్రాహ్య దశలలో బిడ్డసాధించే లక్ష్యములు అనేకము లున్నవి.

బాహ్య ప్రపంచ పరిసరములు పరిస్థితుల కనుగుణ్యంగ పొందుపరచుకోటం, ఇది బిడ్డ జననకాలం నుండియే జరుగుతుంది. తల్లిని గుర్తించుకోటం, తన అందమును, అవయవములను గుర్తించుకోటం, (ముఖ్యంగా చేతులు కాళ్లు) తన చుట్టూమాట్లాడేవాళ్ల నోటిని, పెదిమలను తదేక ధ్యానంగా వీక్షించుచూ, తన పెదిమలను కదలించుతూ, తన కంఠనాళములను తర్ఫీతు చేసుకొనటం, పరిసర స్వరూపములను, బంధు మిత్రులను గుర్తించటం, మొదలగునవి అయిదారు నెలల యీడులోనే జరుగుతుంటవి. మరొక ముఖ్యవిషయమేమంటే, పరిసరములలోని వస్తువులు వాటి వాటి స్థానే వుండటాన్ని బిడ్డ గ్రహించి వుంటుంది. అవి వాటి స్థానే లేకుండ, మరెక్కడైనా వుండటాన్ని బిడ్డ పరికించినట్లైతే వెంటనే దానికొక విధమైన అతృప్తి, ఆందోళన కలుగుతుంది. క్రమపద్ధతిలోనున్న వస్తువులను గ్రహించినబిడ్డ, క్రమభంగాని కెంత మాత్రం ఓర్చుకోజాలదు. వెంటనే అతృప్తి ఆందోళనకలిగి కొన్ని వేళలయందు అస్వస్థత కూడ ఏర్పడుతుంది. అదే విధంగానే ప్రతిక్షణం తనకు పాలిచ్చి, లాలించి, పాలించు తల్లి కనబడకపోతే, తల్లికి మారుగ మరెవరైనా తన్ను ఎత్తుకోటం, పాలివ్వటం, స్నానం చేయించటం సంభవిస్తే బిడ్డకు కలతకలిగి అస్వస్థత ఏర్పడడంకలదు. ఇందువల్ల విదితమయ్యేదేమంటె, అనుక్షణం బిడ్డ సంసర్గం సన్నిహిత సంబంధమేర్పరచుకొంటున్న వస్తువులు, తల్లి, ఆ ఆ స్థానంలో లేకపోతే తదను భూతితో మానసిక జీవితాన్ని నిర్మించుకొనే కృషికి భంగం వాటిల్లుతుంది. అందువలన బిడ్డ ఓర్చుకోజాలదు.

ఈ ఆరునెలల ఈడుకే అస్పష్టంగా ఉచ్చరించుటకు ప్రయత్నించుతూ అవ్యక్తమైన మధుర శబ్దాలు చేస్తుంది. ఇంతవరకూ ప్రాకుతూ, దోగాడుతూ వున్న బిడ్డ, కూర్చోటానికి ప్రయత్నిస్తుంది. వస్తువులను చేతులతో పట్టుకొంటుంది. వస్తువులను చేతులతో పట్టుకొని పరిశీలించటంతో బిడ్డ తత్వ మతి చురుకుగా నిర్మింప బడుతున్న దన్నమాట. దాదాపు ఎనిమిది తొమ్మిది నెలల మధ్య కాళ్లు చేతుల మీద నడుస్తూ, పెద్దవాళ్ళ సహాయంతో మరిదేనినైనా ఆధారం చేసుకొని కాళ్ళమీద నిలుచోటానికి ప్రయత్నిస్తుంది. కాళ్ళు భూమి మీద మోపటం నేర్చుకొంటుంది. ఏడాది నిండేటప్పటికి కాళ్ళు భూమిమీద మోపి నడవటానికి (సహాయంతో) ప్రారంభించుతుంది. ఏడాది

మీద మూడునెలలకంతా చక్కగా నడవటాన్ని సాధించుతుంది. చేతుల నుపయోగించి ఏవో పనులను చేయుటకు ప్రారంభిస్తుంది. ఈ తరుణంలోనే బుద్ధిమరింత చురుకుగా, చక్కగా నిర్మాణమవుతున్న దన్నమాట. బిడ్డచేతులను నుపయోగించటానికి బుద్ధి నిర్మాణ వికాసములకూ, అంత సంబంధమున్నది. (ఈ విషయాన్ని గురించి విపులంగా మరెప్పుడైనా ఆలోచిద్దాం.)

ఈ విధంగా రెండేళ్ళు నిండేటప్పటికి, బిడ్డ ఎన్నో కార్యములను సాధించటం, పరిచయం చేసుకోటం తాను అను భూతిద్వారా తనశక్తులన్నిటినీ నిర్మించుకోటం చేస్తుంది. ఇంతవరకూ, అస్పష్ట చైతన్యంతో, అసమానమైన మనస్తత్వం మూలకంగా, తత్సంబంధమైన సూక్ష్మ గ్రాహ్యదశలద్వార తనబుద్ధినీ, మానసికశక్తులనూ నిర్మించుకొని, అవయవములను స్వాధీనపరచుకొన్నది. ఇప్పుడు స్వేచ్ఛగా తిరిగి తన కార్యమును చేసుకోటానికి కౌశలమును పొందటానికి ప్రయత్నిస్తుంది. అనగా ఇప్పుడు బిడ్డలో స్పష్టచైతన్యం ఏర్పడుచున్నది. మూడేళ్ళ నాటికి మరింత కార్యకౌశలమును సంపాదించుతుంది.

కాబట్టి, తల్లి శిశువు జననకాలంనుండి మూడు సంవత్సరములవరకు అతి జాగ్రత్తగా బిడ్డకు తోడ్పడుట అవసరం. అనగా, బిడ్డయొక్క ప్రతి అభివృద్ధి క్రమంలో దానికి తగిన పరిసరములు పరిస్థితులు లభించుటకు ప్రయాసపడాలి. బిడ్డకు తోడ్పడాలను ఉద్దేశంతో చీటికీ మాటికీ అనవసరంగా బిడ్డయొక్క స్వేచ్ఛకూ, స్వయంకృషికీ అడ్డు తగలకూడదు.

బిడ్డయొక్క సర్వతోముఖాభివృద్ధికి వలయు పరిసరములు పరిస్థితులు లభించులాగు ప్రయాస పడాలన్న మాత్రం చేత, తన ఆర్థిక స్థితికి అందుబాటులోలేని పరిసరపరిస్థితులను నిర్మించవలెననుట కాదు. లేక, ఆర్థికపరిస్థితి ప్రశస్తంగా వున్నదని, బిడ్డవున్న గదులను కేవలం అలంకరించటం, అనవసరమైన అనేక ఆటవస్తువులను అమర్చటం అనికూడ కాదు. బిడ్డ ధనికుల యింటపుట్టనీ, దరిద్రులింటపుట్టనీ, దానికి అవసరమైన పరిసరములు, పరిస్థితులు ఈ ప్రపంచమే, బిడ్డ జన్మించిన ఇల్లు, ఇరుగు పొరుగు. బిడ్డ తన సర్వతో ముఖాభివృద్ధికి, స్వయంకృషి సల్పుచున్నప్పుడు, ఆ యా నిర్మాణదశలు వికాసదశలలో తల్లి విజ్ఞాన విచక్షణలతో తోడ్పడటం అత్యావసరం. ఇందువల్ల విదిత మయ్యేదేమంటే, బిడ్డ పోషణ, శిక్షణలు బాధ్యతను భరించవలసినది తల్లియే. శిశువు తల్లి గర్భంలో నున్నప్పుడేవిధంగా తల్లిలో ఒక భాగంగా వుందో, బాహ్య ప్రపంచంలో ప్రవేశించిన తరువాత కూడ తల్లిలో ఒక భాగంగానే కొంతకాల ముంటుంది. మాతా శిశువులకంత సంబంధ బాంధవ్యము లున్నవి.

ఈ విధంగా తల్లిచెంత బిడ్డ పెరగటంవలన, బిడ్డ మానసిక శక్తులు, బుద్ధి నిర్మాణమునకూ, వికాసమునకూ అత్యావసరమైన తల్లిఅనురాగం, సన్నిహిత సంబంధం, ఆమె కార్య కలాపములయొక్క పరిచయం, అనుభూతి, మున్నగునవి బిడ్డకు లభ్యమవుతాయి. కాబట్టి తల్లి సాధ్యమైనంత కాలం బిడ్డను తనవద్ద వుంచుకోవాలి. అనగా, తల్లి పనిచేసుకొనే తరుణములో (ఇంటా, బయటా)ను, బంధుమిత్రులతో సంభాషించునపుడు, ఇరుగింటికి పొరుగింటికెళ్ళునపుడు బంధుమిత్రుల ఇంటికివెళ్ళునపుడు, విందు వినోదాలలో పాల్గొనునపుడు, బజారు కెళ్లునపుడు బిడ్డను, తల్లి తన చెంత నుంచుకోవాలి. ఈ విధంగా తల్లివద్ద బిడ్డ వున్నందుచేత వివిధ పరిసరములను పరికించి పరిశీలించు నవకాశము కలుగుతుంది. పెద్దవాళ్లు మాట్లాడునపుడు వారుచ్చరించు శబ్దాలను వారు కదిలించు పెదిమెలను, వాళ్ల భాషావైఖరిని వీక్షించటానికి, ఆలకించటానికి అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా ఈ దశలో (జనన కాలంనుండి 3 ఏళ్ళు దాకున్న ఉపదశలో) భాషను అలవరచుకొనే శక్తి అసమానం. ఎంత చక్కని భాషను వింటుందో, ఉచ్చరించేటప్పుడు వీక్షించుతుందో, అంత చక్కని భాషను మాట్లాడుతుంది. పెద్దవాళ్ళు ఏండ్లకొలబడి అన్య భాష నభ్యసించినను అలవడనట్టి, ధోరణి, ప్రయోగాలు, ధ్వనులు మున్నగునవి మూడేళ్ళ ఈడుకంతా బిడ్డకు అలవడుతుంది. ఇట్టి అద్భుత శక్తి బిడ్డ కెటుక లేకనే అబ్బుతుంది.

ఇక ఇంటిలోనున్న వస్తువులు వాటి వాటి స్థానే క్రమము ననుసరించి వుండాలి. మనం వాడే సామాను, వస్తువులు మున్నగువాటిలో బిడ్డ ఆడుకోటం కలదు. దానికి మోయ

టానికి సాధ్యమైనచో అలా ఆడుకోనివ్వాలి. మరొక ముఖ్య విషయాన్ని జ్ఞాపకముంచుకొనుట అత్యవసరము.

బిడ్డనుబయట వాహ్యాళికి తోపుడు బండిలో తీసుకొని వెళ్లేటప్పుడు నలుప్రక్కలా బిడ్డ పరికించటానికి వీలగునట్లు బండి పడగను తీసివేసి, బండిలో బిడ్డ నేట వాలుగా పడుకోబెట్టి, లేక చంకనెత్తుకోవలసిన సందర్భంలో, చుట్టు ప్రక్కల బిడ్డ పరికించటాని కనువుగ ఎత్తుకోవాలి. నడవటం నేర్చుకొన్న బిడ్డను, నడిపించుకొని పోవాలి కాని మోసుక పోరాదు. బిడ్డ నడుస్తూ, దారిలోనున్న అత్యంత సూక్ష్మ పదార్థాలను కూడ పరిశీలించుతుంది. ఇట్టి తరుణములో తల్లి ఓపికతో, బిడ్డ ఆగినచోట ఆగుచూ, అడుగు మీద అడుగు వేసి నడిచే సందర్భంలో తానూ అలాగే నడుస్తూ, త్వరగా నడవమని నిర్బంధించకుండా మెల్లగా, అనగా, బిడ్డను ఆకర్షించే వస్తువులను పరిశీలించుట కవకాశ మిచ్చుట అత్యవసరం.

కాబట్టి, ఈ విధమైన పరిసరములు పరిస్థితులను బిడ్డకు లభించులాగున చేయుటకు ధనమును వెచ్చించ నవసరము లేదన్న మాట. ఈ విధంగా బిడ్డ, అంతర్గతంగా వున్న గ్రహణ శీల మన స్తత్వ మూలకంగా, తను సాధించవలసిన ప్రతి లక్ష్యమున కనుగుణ్యమైన సూక్ష్మగ్రాహ్య దశలో, జ్ఞానేంద్రియముల ద్వారా పరిసర పరిస్థితుల సంసర్గ సంస్కారముల ఫలితంగా మనుజుని మహోత్కృష్ట సాధనమైన బుద్ధినీ, మానవ సహజ శక్తులనూ, నిర్మించుకొని వికసింప జేసుకొంటుంది.

సాధారణంగానే మానవుడు బాల్యంలోనే, పరిసర పరిస్థితుల కనుగుణ్యంగ పొందుపరచుకోవటంలో కృతకృత్యుడవుతాడు. అనగా, మనుజుడు దేశకాలాల కనుగుణ్యంగా తన కుటుంబ జీవితంలో, సంఘజీవితంలో, తన వ్యక్తి జీవితమును పొందుపరచుకొనే శక్తిని సంపాదించుతాడు. అందువల్లనే మానవుడు సర్వప్రాణులలో సర్వశ్రేష్ఠుడు.

★


MY AMRUTANJAN
నాది నాది నాది
నాది నాది నాది
There are Millions of "My's" in that MY,
Applied to the 46 year old "Pocket Doctor" of INDIA.
అమృతాంజనము
గాని,
“ యథాయథా.... ... ... కాళీధవళత్వ శంకయా.”
అమృతాంజనమా ! నీ కీర్తి ముల్లోకములను దెల్పుఁ జేయు పూనికతో పెరుఁగు
చున్నప్పుడెల్లను, నా నల్లని ముంగురులు, దెల్లబడునేమోయను భయముచే
నా హృదయము మిక్కిలి పరితాప మొందుచున్నది సుమా !!!

స్కెచ్

* అమ్మ *

ఆర్. రామనాథ రెడ్డి

రాత్రంతా కుంభవర్షం కురిసి వెలిసిపోయింది. దాంతో ప్రకృతిలో ప్రశాంతం వెలిసింది. ఉదయారుణ రేఖలు-చల్లదనంలో ముకుళించిన లేజిగుళ్లపై బంగారు మెరుగులు పెడుతున్నాయి. హృదయాలన్నీ చల్లబడినాయి.

అమ్మమాత్రం జలుబుచేసి బాధపడుతూ ఉంది. కాళ్లు వాతాన్ని లాగుతున్నాయి. అయినా లొంగింది కాదు అమ్మ. కాకులు కూసేముందు మేల్కొంది. ఇంటి పనులన్నీ చక్కబెట్టింది. అమ్మది చాల నికృష్ట జీవితము. ఎప్పుడు విశ్రాంతి తెలియదు. మనుమలు కలిగిన నాటినుండి తనకి మరీ శ్రమలధికమయ్యాయి.

తెల్లవారకట్టే లేవడం—ఊరి వెలుపలి బావినుండి నీళ్ళు తేవడం...పాచి పనులన్నీ చేయడం, అంట్లు తోమడం, పాలుకాచి అన్నం వండడం...యింకా అవీ యివీ చిల్లర మల్లర పనులెన్నెన్నో అమ్మేచేసేది.

అమ్మ కిద్దరు మనుమరాండ్రు—ముగ్గురు మనుమలూను. వంటపనులన్నీ ముగించి వీళ్లని లేపేది. ముఖాలు కడిగేది. కాసిన్ని రొట్టెముక్కలుచేసి వాళ్ళకు తినిపిస్తూ వాళ్ల ఆనందంలో తన కష్టాల్ని మరిచి పోయేది.

ఇంతవరకూ ఆమె చాల చురుగ్గా సంసారాన్ని యీదుకొచ్చింది. వంట యింటిలో యంత్రంలా అరిగి పోయింది. తన బ్రతుకులో యిక సుఖంలేదా అన్న తలంపు యింతవరకామెకు తట్టలేదు. కాని యీ ఉదయం—ఆమె ముఖ కవళికలు మారిపోయేయి. నిరాశ, నిస్పృహాలు ఆమెలో దారి చేసుకుంటున్నాయి. పూర్వపు చురుకుదనం, ఉత్సుకతలు కనపడడంలేదు.

ఈ ఉదయం విసుక్కొంటూ లేచింది. "అబ్బ! నేను చచ్చే పర్యంతం యీ బాధలు నన్ను వదల వనుకుంటాను. వాడికేం!—యేమైనా చీమ కుట్టితే గదూ నా కష్టాలు తీర్చడానికి" అని గొణిగింది, ప్రక్క గదిలో పండుకున్న కొడుకు నుద్దేశించి.

అమ్మకు అందొచ్చిన కొడుకున్నాడు. తల్లిపడే కష్టాల వేపు అతని బుర్ర యెప్పుడూ మళ్లలేదు. ఆమె యింతవరకు విసుగు లేకుండా ఓర్పుతో చేయడం యింకో నౌకరును పెట్టుకోవాలనే భావం అతనిలో లేకుండా చేసింది. నౌకరును పెట్టుకోగల సత్తా ఉన్నా—అమ్మ బాగానే చేస్తున్నది. అదీగాక నౌకరుందుకులే యీపాటి దానికి అని అమ్మ అంటుండేదని అనుకోవడంవల్ల కొడుకు ఊరుకున్నాడు.

ఇప్పుడే ఆమె అలా విసిగిందే గాని "నౌకరును పెట్టాలి, నేనిక పనులు చేయలేను," అని కొడుకుతో కచ్చింపుగా చెప్పనూలేదు. కోడలు సాయానికి వస్తే—"వద్దు తల్లీ నే చేసుకుంటాలే" అనడమే తెలివైన పనను కొనేది. తర్వాత తన నికృష్ట జీవితాన్ని నెమరుస్తూ నిట్టూర్చేది.

"అమ్మా!" అని పిలిచాడు కొడుకు. గుమ్మం అవతలనున్న అమ్మ వినిపించుకుని వస్తోంది. కదలడంలో వాతం చేసిన కాలు కలుక్కుమంది. మళ్ళీ సహించలేని బాధ కలిగింది. గెంటుతూవస్తూనే యిలా ఉద్రేకపడింది—"నే నికయీ పనులలో క్రుగ్గిపోలేను—నాకు బాగా విశ్రాంతి అవుసరము. పట్నంలో అమ్మాయి గారింటివద్ద రెండు మూడు వారాల పాటుంటే బాగుండేలావుంది"—

తన శ్రమ జీవితానుభవాలన్నీ ఒక్క సారిగా ఆమె బుర్రలో పరుగులెత్తి తన అభిప్రాయాన్ని బలపర్చినాయి. ఇక్కడ ఉండటంఅంటే యిక నరకంలా తోచింది. చివరకు కొడుకును నొప్పించి పయనమైంది.

* * *

బండి చకచకా నడిచి పట్టణంలో దింపింది అమ్మను. బండిలో ఉన్నంతసేపు నూత్న భావిజీవితంపై కలలుగంటూ

కనిపించింది. పట్నం అంతా చాల క్రొత్తగా అగుపిస్తోంది. విశాలమైన తారురోడ్లు, నిత్యం యేదో పని మీద తిరుగుతున్నట్టుండే జనం, హడావుడి, బస్సు, కార్లు, అమ్మకి ఆశ్చర్యము పుట్టించాయి.

పట్నంలో జీవితం బాగానే ఉండొచ్చు—కాని డబ్బుండాలి—అనుకొంది. ఇంకా ఆమె యిలా అనుకొంది—ఇందాక యిచ్చిన బండికిరాయి పెడితే పల్లెటూళ్లలో రెండుదినాల భత్యంగడుస్తుంది.

నిజానికి బండికుదుపువల్ల కాళ్ళూ ఒళ్ళూ నొప్పిపట్టినా క్రొత్త జీవితంపైగల వ్యామోహం చాలవరకు నివారించింది. ఆనందంతో ఆమె హృదయం పరవళ్లు త్రొక్కుతోంది.

ఆమె బండిదిగి సరాసరి ఆ మండువా యింటి గేటు దగ్గరకు వెళ్లింది. వెళ్ళిందోలేదో ఓ బొచ్చుకుక్క బొంయ్ బొంయ్ మంటూ కరవొచ్చింది. అమ్మ కొంచెం తికమక పడింది. ఆ కుక్క ప్రక్కనే ఓ చిన్న కుర్రాడు తప్పటడుగులు వేస్తున్నాడు. ఆమెను చూడ్డంతో "అమ్మేవ్—అమ్మేవ్—ముసలమ్మొచ్చిందే" అంటూ అరిచాడు.

ఇంతలో కూతురు గబాలునవచ్చి తల్లిని తీసుకు వెళ్లింది. "అమ్మా!—యింత నీరసంగా ఉన్నావే? ఎంత శ్రమ పడ్డావు! ఇక యిచ్చటనే ఉండి పోయి విశ్రాంతి తీసుకోమ్మా"అన్న కూతురు మాటలు తల్లినేత్రాల్లో జీవం పొదిగాయి.

ఆ రాత్రి కూతురు పరుపు మంచంపై పరుండమంది అమ్మని. ఆమెకిదే మొదటిసారి పరుపుపై పండుకోవడం.

తన కొడుకు యింటికాడైతే బయట వరండాపైనే మేలు వాల్చేది. వర్షాకాలం మాత్రం యింటిలో నట్టింటనే పరుండేది. ఇక అందరూ నిద్రపోయే వరకూ పనులే చేస్తూ అంతిమంగా ఆ నే అలుపులు నుతూని నిద్రపోవడం జరిగేది.

ఇక్కడల్లా కాకుండా, తాను చేయవలసిన పనేలేదు. అంచేత అర్ధరాత్రివరకూ ఉండే అవుసరంలేదు. భోజనాలు—తింటనే పడక—యీ జీవితం అమ్మకు చాల వింతగా క్రొత్తగా అనుభవాని కొస్తోంది.

కుర్నాడు ఐదక్యగానె లేచింది అలవాటుప్రకారం. ఎవరూ చెప్పండే—కిచ్చెన్ లోకి పోయి—కూరగాయలు తరగడం ఆపనీ యీపనీ సాయం చేసింది నౌకరు పిల్లకి. మళ్ళీ ఆపై రెండుగంటలూ యేం చేయాలో తెలీలేదు అమ్మకు. నిజంగా ఆమె చేయాల్సిన పనిలేదు—చేయనీరు కూడ. ఆమె చేసే దల్లా తినడం తాగడం పిల్లల్ని కని పెట్టడం, కూతురితోను, అక్కడికి వస్తూపోయే వాళ్ళతోను పిచ్చాపాటీ చెప్పు కోవడము తప్పితే మరేమీ లేదు. వాళ్ళంతా తన కూతురుతో యేవేవో మాట్లాడే వారు. అవేమీ అమ్మకి అర్ధమయ్యేవి కావు. "మీ అమ్మకు క్లబ్బనగా, సినిమాలనగా, రేషనింగనగా యేమీ తెలీవులాగుంది "అనే వారు అమ్మ వింటుండగానే, చిన్న పిల్లలు కూడ. పట్నం సంగతులు చెప్పుకుంటుంటే అమ్మ విస్తుపోతూ పరభాషిలా వింటుండేది. వాళ్ళను కని పెట్టడం వాళ్ళ మాటలు వింటూడంలో అమ్మకు దినాలు గడుస్తున్నాయి.

దాదాపు పదిరోజులయింది అమ్మ పట్నంవచ్చి. అల్లుడు కూతురు ఆమెను అన్నివిధాల ఆదరిస్తున్నారు. ఓ నాడు కారు యెక్కించి పట్నంఅంతా త్రిప్పి చూపించారు. మనుష్యులు యెక్కడంతోటే తుర్రుమని పోతున్నా కారును చూచి అమ్మ చాల ఆశ్చర్యపడింది.

మంచి మంచి చూడదగ్గ స్థలాలు, పెద్దపెద్ద షాపులూ, భవంతులూ, చూపించారు. ఓ రోజు సినీమాకు లాక్కెళ్లారు. అమ్మకివన్నీ క్రొత్తగా ఉండడంచాత సిగ్గుగా ప్రవర్తించేది.

ఆమె జీవితం యిలా పరివర్తనమౌతుందని యెప్పుడూ తలంచలేదు. ఆమె జీవితం యింత వైభవంగా గడుస్తున్నా యేగో వెలితిగా ఉన్నట్టున్నది. అంత ఆనందం లేదు. కొడుకుని మనుమల్ని విడిచివచ్చిన అమ్మ యింత కాల మున్నందుకు ఉండలేదు.

పట్నం జీవితం ఆమెకంతగా రుచించలేదు, వాళ్లపై చెడ్డ అభిప్రాయం కలిగింది. వాళ్ల జీవితాలు చాల చెడ్డవని అనుకుంది. వాళ్ళు భగవంతుని కూడ ధ్యానించరు. చివరకు

తినేబియ్యం దాని పుట్టు పూర్వోత్తరాలు కూడ వాళ్ళకు తెలీవు. వరిమొక్కల గురించి వాళ్ళ కసలు తెలీదు.

ఇక్కడా మెకు పనీపాటాలేదు. మందమతిగా కూర్చుండడమే పని. ఇది ఆమెకు మరీ విచారం కలుగ చేసింది. ఆమె పనికిబాగా అలవాటయి పోయింది. ఆమె విశ్రాంతికి వచ్చినా పనిచేయాలనిపిస్తున్నది.

ఆమెవల్ల దమ్మిడీ కలిసిరాకపోయినా వాళ్లు భోజనం పెడుతున్నారు. పనేమీ చేయకుండా ఉచితంగా భోజనం తినేసి ఉండడం అమ్మకేమంత మనస్కరించ లేదు. ఆమె బుర్రలో అనేక తర్క వితర్కాలు చెలరేగుతున్నాయి. "ఉచితముగా తినేయడానికి నాకేం హక్కుంది—ఇతరుల కవుసరములేని మనిషికి విలువెక్కడ ఉంటుంది,—నా బ్రతుకు యితరులకు శ్రమే తప్ప ఉపయోగం లేదు." ఇలా ఆమె యిన్నిసార్లు అనుకుంది. ప్రతి దినమూ యిలాగే ఆలోచిస్తూ దినాలు గడుపుతోంది అమ్మ.

ఇంటికి వెళ్లివస్తానని యెప్పుడయినా అంటే కూతురూ అల్లుడూ బ్రతిమాలేవారు యింకాఉండమని. అమ్మ వాళ్ళను కాదనకలేక పోయేది. ఒకరోజు మధ్యాహ్నంమే—యధా ప్రకారంగా పిల్లలిని కనిపెడుతూ వరాండాపై కూర్చుని ఆలోచిస్తున్నది. తన ప్రక్కనే కూర్చున్న కూతురు బజారు ఖర్చుల విషయములో నౌకరు పిల్లను చీవాట్లు పెడుతోంది మాటల్లో—అవకాశం చిక్కితే చాలు తినే సేయాలని చూస్తుంటారు అంది. ఈ మాట అమ్మకదోలా అయింది. హృదయం చలించింది. పూర్వం తాను పెత్తనం సాగించిన సంసార దినాలు జ్ఞాపకానికొస్తున్నాయి.

ఇదే సమయంలో ఆడుకొంటున్న పిల్లాడు చటుక్కున బోరలాపడ్డాడు. కూతురు అమ్మోయ్ అంటూ పిల్లాడిని గుండెకు హత్తుకుంది. పిల్లాడి చేతిలోని పింగాణి గిన్నె గాజు తగిలి రక్తం కారుతోంది. వాడు గోలపెట్టేస్తున్నాడు. అమ్మ ప్రాణం నిలువునా నీరైపోయింది. పంచదార కట్టుకట్టడానికి కింట్లోకి వెళ్లింది. కూతురు ఐడిన్‌కు పరుగెత్తింది కాన్సేపటిలో యిద్దరూ వచ్చారు.

అదేమిటే అమ్మా అంది కూతురు. "ఇదమ్మా!—పంచదార—కట్టు కట్టితే రక్తం ఆగిపోతుంది" అంది ఆప్యాయంతో.

"అబ్బ!—యిల్లాటప్పుడు వెకిలిగా పనిచేయ గూడదమ్మా—పంచదారెందుకు తగలేయను-యిల్లాంటివి నీకేమీ తెలీవు"—

ఆ మాటలు చాల అవమానకరంగా తోచినాయి అమ్మకు. కొంచెం సిగ్గుపడింది.

"ఇలాంటి విషయాలు నీకేమీ తెలీవులాగుంది. యిలా వెకిలిగా పనులుచేయగూడదు" ఈ మాటలే పదేపదే అమ్మ బుర్రను కదిలించివేస్తున్నాయి.

ఆమె యిలా అనుకొంది, "ఆరడజను పిల్లల్ని చిన్నప్పటి నుంచీ పోషిస్తూ, కాపాడుతూవచ్చిన నాకా తెలీకపోవడం. నన్ను అవమానించడం—అబ్బ నాకేం సుఖం లేగచ్చేటు వెళ్లిపోవాలి". అని తన నిర్ణయంవాళ్ళకు చెప్పి బయలుదేరింది.

*　　　*　　　*

బండిదిగి గేటుతీసి యింటిలో ప్రవేశించింది, అమ్మ సంతోషంగా. కాని అక్కడలాగు యే కుక్కా బొంయ్ మంటూరాలేదు. ఏ కుర్రాడు ముసలమ్మొచ్చిందే అంటూ కేక వెయ్యలేదు.

ఇల్లు చాల నిశ్శబ్దంగా ఉంది. ఒక్కమాటైనా వినబడడంలేదు. వాళ్లుకూడ పట్నం వెళ్లారేమోననుకుంది. లోనకు వెళ్ళింది—తన చిన్ని మనమరాలు లలిత మాట వినబడింది. చప్పుడువిని—"ఎవరది?" అంది లలిత. ఆ గది చాల చీకటిబారి ఉంది. అవతలివేపునుంచి కొద్ది వెలుతురు వస్తున్నది—అక్కడ నులక మంచంపై కోడలు పరుంది. ఆమె కోడలు నీరసంగా మూలుగుతూ లేచింది. అమ్మ రాగానే కోడలు తలపైకెత్తి చూసింది.

"ఓ అమ్మా!—వచ్చావా వచ్చావా!" అంటూ అంతులేని సంతోషంతో లేచివచ్చింది కోడలు. "అమ్మా! నీవు లేక పోవడం నిర్జీవంగా ఉంది యిల్లు.—మొదట లలి

అమ్మ

తను అజీర్ణంపట్టుకుని చాల బాధపడి పోయింది. చూడు యెలా చిక్కి పోయిందో. జీవన్‌కి కూడా జ్వరం. ఇదిగో యిప్పుడే వెళ్లారలాగ నీళ్ళకి.”

ఇంతలో జీవన్, సరోజిని నీళ్ళు తెచ్చారు. జీవన్ అమ్మని చూడ్డంతో ఆతృతగా వచ్చి చంకెక్కాడు— “అమ్మా! వచ్చావా!—నీవు లేక పోవడంయేమి బాగుండలేదే!—నీవు పోయిన తరువాత మనవి రెండు బిందెలు పోయినాయి అజాగ్రత్తవల్ల. పాదులన్నీ చెడి పోయేయి. మరి ఆవు పాలు సరిగా యివ్వడము లేదు” ఇలా యింకా యింకా చెప్పేస్తున్నాడు.

అమ్మ—తానులేక పోవడంవల్లకదా యింత అనర్థము వచ్చిందని అనుకుంది. ఉండునాన్నా—అబ్బ చాల పనుంది చేయాల్సింది. చూడు గదులెలా వున్నాయో, యీబూజులూ, దుమ్మూ—అంతా తుడువాలి, చేయాలి, పని చేయాలి— “ఊరికే కూర్చుంటేనే మందబుద్ధి” అని అమ్మమళ్ళీ సంసారాన్ని దిద్దింది.

నవభారతి అవతరణ

శ్రీమతి డి. యస్. రాజేశ్వరి పట్నాయక్

(లెండీ మన గాంధిని గొల్వండి అను
వరుసలో పాడవలెను)

లెండీ మన ప్రగతిని జాటుండీ వేగలెండి
జండా లెత్తండీ ‘జాయ్‌హింద’ని నిల్వండి ॥లెం॥

కాలామెటు మారెను గమనించు కోండి
బాపూ ఆత్మజ్యోతి ఆదర్శ మండీ ॥లెం॥

మన బాపు వారసుడె మన జవ్హారండి
శాంతి స్థాపన జేయ సహకారించండి ॥లెం॥

స్థిరచిత్తుడు మహాఘనుడు మనపటేలండి
ఉద్దండుడు మేధావి మనకండయండి ॥లెం॥

రణశంఖము పూరించెను మన సుభాషండి
జైహిందని గర్వింప ముందడు గేయండి ॥లెం॥

ప్రజాభీష్ట పాలనమె మన ప్రభుత్వమండి
నవ భారతి అవతరణ సుభదివసమిదండీ ॥లెం॥

★



యుక్తి

అనగనగా ఒక యూరిలో రాము అనే పిల్ల వాడుండేవాడు. వాళ్ళ తండ్రి ఊరికంతటికి పెద్ద. పాడి పంటలలోను ధనమునందు అందరికంటె ఎక్కువైన వాడు. అనగా పది, పన్నెండేండ్ల వాడు. కాని ధైర్యసాహసములలో పెద్దవారుని లాంటి వాడు. ఒకనాడు తండ్రి విచారిస్తూ యింట్లోగోడకి జారబడి పెంకులు లెక్కపెడుతున్నాడు. అది చూసి రాము "నాన్నా ఎందుకలాగ యేడుస్తావు? మనకేమి అపాయం కలుగ లేదు కాదా" అని ముద్దుగా ప్రశ్నించేడు. ఏమని చెప్తాడు? తండ్రి ఏ రీతిగా కొడుకునకు తెలియబరచటమో తెలియక "నాయనా వారం రోజులు క్రిందట మన రెండు మేకలూ మాయ మయ్యేయి కదూ"

"అయితే"

"అది కాదు నాయనా, [illegible] వేళ మన నల్ల ఆవుని ఆ దురాత్ముడు—హంతకుడు రా-క్ష-సు-డు...."

"నాన్నా ఏమిటి! సరిగా చెప్పు నాన్నా"

ఇంకేముంది వాళ్ళ ఊరి పొలి మేరలో నున్న గుహలోని రాక్షసుని మహిమను తెలియజేసాడు రాముతండ్రి. వెంటనే రాము ఒక గండ్రగొడ్డలి, గునపము పట్టుకొని మట్ట మధ్యాహ్నపువేళ ఒంటరిగా రహస్యంగా గుహదగ్గరకు వెళ్ళాడు. కన్నంలోనుంచి తొంగిచూసేడు. తాటిచెట్టు లాగు పడి దొర్లుతున్న భయంకర స్వరూపాన్ని చూచేడు. రాక్షసుడు నిద్రించుచున్నవాడని తెలిసికొన్నాడు. ఆ గుహ గుమ్మమునద్ద గునపముతో ఒక పెద్ద గొయ్యి త్రవ్వేడు. గుమ్మాని కవతలగట్టున నిల్చి బూరా ఊదేడు. రాక్షసుడా కేకవిని "ఎవడురా నాకు నిద్రాభంగము కలిగించె"నని బయటకు వచ్చేడు. ఈలోపుననే రాము ఆ గొయ్యిని ఆకులతోను కొమ్మలతోను పైపైన కప్పి ఉంచాడు.

దానిని తెలిసికొన లేక రాక్షసుడు లంఘించి గోతిలో పడ్డాడు. పడే పటంలో రాము తన గండ్ర గొడ్డలిని రాక్షసుని పీకపైకి విసిరాడు. రాము గురి తప్పుతుందా! రాక్షసుని ప్రాణమును సగం తీసింది. వెంటనే ఊరిలోకి పరుగెత్తితాను చేసినపని అందరికీ చెప్పేడు. అంతావచ్చి చావడానికి సిద్ధమైయున్న రాక్షసుని కఱ్ఱలతో మోది, బాలుడైన రాము సాహసానికి యుక్తికి మెచ్చుకొన్నారు.

—ఇందుకూరి.

ఐహిక, ఆముష్మిక బహుమతి

*** జాన్ క్రిష్టియను ***

[సత్యమును పలుకువారు, వినయము, కనికరముగలవారు, నూటికి 5 గురు తక్కువేరని చెప్పవచ్చును. అట్టివారికి దేశభక్తియుండదా? దేశభక్తిగల సైనికులే సైనికులు. మనమంతా మనదేశ సైనికులము కదా!]

అవి ఛత్రపతి శివాజీ పరిపాలనా దినములు. వేనకువేలు యువకులతని సైన్యములో చేరుటకు ప్రతిదినము వచ్చుచుండెడివారు.

ఒకసారి యిరువదిమంది మహారాష్ట్రి యువకులొక చిన్న గ్రామము నుండి శివాజీ సైన్యములో చేరుటకై బయలు దేరారు. చలువ వస్త్రములను తొడుగుకున్నారు. తళతళ మెఱయుచున్న యుద్ధాయుధములను ధరించారు. వెళ్తూ వెళ్తూ వారొక పర్వతము క్రిందకు చేరుకున్నారు. ఆ పర్వతము నుండి చిన్న యేరు ప్రవహించుచున్నది. వర్షాకాలము పోయినప్పటికి దాని లోని నీరుపొంగి పొర్లుతోంది.

ఏరుయొక్క దరిచేరుసరికి దాని నెట్లా దాటడమాయన్న ప్రశ్న యువకులలో • బయలు దేరినది. దానిలో దిగి యీదుకొని వెళ్ళేటట్టయితే బట్టలు తడిచి పాడగును. కాబట్టి వారు తమ బల్లెముల సహాయమున యీ యొడ్డునుండి ఆ యొడ్డునకు దుముకుటకు నిశ్చయించారు.

సిపాయిలనగా దేశమున కొక విధమగు సేవ చేయవలెను. అట్టి సేవకు మీరు సమర్థులా! అసమర్థులా! యను పరీక్ష దేవుడే చేసినట్టు, ఆ సమయములో ఒక బీద ముసలమ్మ వారికడకు వచ్చినది. అపుడామె వారిని "వత్సలారా! మీకు శుభమగు గాక!" అని దీవించి "నేను వృద్ధురాలను. ఈ యేటిని దాట జాలను. ఏదో యొక విధముగా నన్ను కూడా యేరు దాటించండి" అని బ్రతిమాలింది.

"మనము యేటిలో దిగ నిశ్చయించ లేదే. ఈమె మనకు పిశాచివలె అడ్డము వచ్చింది. ప్రస్తుతము మన కర్తవ్య మేమిటి?" అన్నట్టు వారొకరి ముఖ మొకరు చూచుకొని యేటిని దాటివేసారు. తుదకొక్క యువకుడు మాత్రమే మిగిలి యున్నాడు. ముసలమ్మ నిశ్శబ్దంగా అది యంతయు చూస్తూ నిలబడిపోయినది. అప్పుడా యువకు డామెతో యిలా అన్నాడు. "మాతా భయపడవద్దు. నా వీపుపై కూర్చొన బెట్టుకొని నిన్నావలి యొడ్డుకు చేర్చెదను". ఆనందాశ్చర్యము లొక్కసారిగా కలిగిన హృదయముగలదై వృద్ధురాలు అతనిని ఆశీర్వదిస్తూ వీపుపై కూర్చొనగా నతడామె నావలి యొడ్డునకు సురక్షితముగా చేర్చెను. బట్టలన్నీ తడిసిపోయినవి. వాటి నెండలో నారవేసాడు. ఎండిపోయిన వెంటనే వాటిని మరల ధరించి తన యుద్ధాయుధములను గుచ్చి [illegible] చక యుత్సాహముతో శివాజీ కోట వైపునకు సాగిపోయెను.

శివాజీ మహారాజు శివనేరనే కోటలో నొక మైదానముమీద తన సర్దారులతో కూడ నిల

బడియుండెను. మారమూరము నుండి అనేకులు తన సైన్యము (ఫౌజు)లో చేరడానికి వస్తున్నారు. వారితో మాట్లాడియూ ఒక్కొక్కప్పుడు గుఱ్ఱము మీద స్వారీ చేయించుచు, పరీక్ష చేయుచు, వారిని తనసైన్యములో చేర్చుకొనుచుండెను. ఇంతలో మన మావళి గుంపుచేరెను. శివాజీ వారితో "మీతోడి యువకుడేడి" అని ప్రశ్నించెను. వారతడు ఖదిరి అనే గ్రామములో ఏదో పనిమీద ఆగిపోయెనని అందుచేత వచ్చుటకు కొంత ఆలస్యమవునని బదులు చెప్పిరి.

శివాజీ: "సరే! మంచిది. అతడు వచ్చిన పిమ్మట మీ పరీక్షజరుగును".

కొంతసేపటికి మావళీ యువకుడువచ్చెను

శివాజీ: (అత్రసితో) "మారోజీ! నీవేల జాలము జేసితివి. ఖదరీ గ్రామములో నీకేమైన పనియున్నదా?"

మారోజీ: "మహారాజ్! ఏమిపనీలేదు. కాని కొద్దిగా ఆలస్యమైంది".

శివాజీ: "నీ బట్టలు తడిసినట్లున్నవే? నీవా యేటిని దాటలేక యీదుకొని వచ్చితివా"?

మారోజీ: (తల క్రిందకు వంచి) "చిత్తము. నేను యేటిలో దిగి వచ్చితిని".

సైన్యమున చేరుటకు ధీరులు, వీరులు కావలెనని తెలిసియు ఒక చిన్న యేటిని దాటలేని యీ తుచ్ఛుడా నా సైన్యములో ప్రవేశించుట అన్నట్లు శివాజీ అతని వైపు తీక్షణముగా చూచాడు. మారోజి మాత్రము అట్లే నిలువబడియున్నాడు. అంతకు మించి తనేమియు చెప్పలేదు. శివాజీ కొంత వ్యవధి ఆగి, "మారోజీ, ఏం, నిజము చెప్పుము. ఎందుకింత తడవైనది?" అని బిగ్గఱగా పలికెను.

మారోజీ: "యే కారణము లేదు మహారాజా"!

ఘన కార్యము చేయగల ఘనుడెన్నడును తన ఘనతను ప్రకటించడు కాని తన కార్యము లే తన ఘనతను వ్యాపింపజేయును.

ఇంతలో మావళీ యువకుడు శివాజీ ముందుకువచ్చి ముసలమ్మ సంగతియంతయు చెప్పెను. అటుపిమ్మట శివాజీ ముసలమ్మకు ఇచ్చి తన ఖడ్గమును మారోజీకి యిస్తూ యిలా అన్నాడు.

"నాకు యిటువంటివారు కావాలి. ఎవరయితే తమ గర్వము విడిచి పెట్టి బీదలకు సహాయము చేసెదరో ఎవరు అట్టిపనికై అన్ని సమయములయందు సిద్ధపడి యుంటారో వారే నిజమైన దేశభక్తులు." అట్లు చెప్పి శివాజీ మారోజీ నడుమునకు కత్తి కడుతూ "నిన్ను వేయి సైనికులున్న సైన్యానికి అధిపతిగా చేశాను. ఖదరీ గ్రామమును నీకు జాగీరుగా యిచ్చుచున్నాను". అని చెప్పెను.

బీదవారికి గొప్పవారును, తిండిలేనివారికి కలిగినవారును, బలహీనులకు బలమైన వారును వారివారి శక్తికొలది సహాయము చేయుటయే కదా మానవ కర్తవ్యము. అట్టి వారికి ఫలము లేకుండాపోదు. మన మారోజి బలహీనురాలయిన ముసలమ్మకు సహాయము చేయుట చేతనే కదా! శాశ్వతముగ నుండెడి బహుమతిపొందెను.

ఐహిక. ఆముష్మిక బహుమతి

అట్టివారి కీలోకమునేకాక పరలోకమందు కూడ బహుమతి యుండునుకదా! ఆతని కంతటి మహా భాగ్యము కలిగినది. ఇట్టి కనికర హృదయులు వినయ మనస్కులుండిన భగవంతుడెంత సంతోషించును. పరులకు సేవ జేయుటయే తన కర్తవ్యముగా నెంచెడి సిపాయికి తగిన సత్కారము చేసినందుకు అందరూ ఏక కంఠముతో "శివాజీ మహారాజుకు జై!" అని కేకలు వేసిరి.

కనికర హృదయులకు, యదార్థ వర్తనులకు లోకములో తావు లేదు. కాని మన శివాజీ మహారాజునంటి ఆదరగా కర్తలున్నచో అట్టి వారి సంఖ్య వృద్ధిగాగలదు. అట్టి వారిని దేవుడు దీవించుగాక!

జైహింద్ (హిందీ ఆధారము)

నవ్వు పువ్వు

(డాబామీద భార్య అంచునకు జారిబడి ఉంది)

భర్త—ఏమే యిక్కడున్నావు.

భార్య—నేను ఒకనికోసం వేచియున్నాను.

భర్త—అదేం; ఎవరి కోసమేవ్?

భార్య (నవ్వుతూ)—ఏమీ లేదండీ; ఒకని భార్యను యింకొకడు దొంగిలించేడండీ వెంటనే ఆమెను వెతకడం కోసం వెళ్ళినవాని తండ్రికోసం వేచియున్నాను.

భర్త—అదేమిటే వెధవ?

భార్య—ఇటు వినండి. రాముని భార్యను రావణుడు ఎత్తుకొని పోయేడండి. సీతను వెదకడం కోసం ఆంజనేయుడు వెళ్ళాడు. హనుమంతుని తండ్రియైన వాయువు కోసం కూచున్నాను.

★

काम - పని.
पानी - నీరు.
चिट्ठी - ఉత్తరము.
चाय - తేనీరు.
बाज़ार - బజారు.
पाठ, सबक़ - పాఠము.
भात - అన్నము.
तमाशा - తమాషా, వేడుక.
खाना - భోజనము.
घर - ఇల్లు.
बजे - గంటలు, (వేళ).
दिन, रोज़ - దినము.
यहाँ - ఇక్కడ.
वहाँ - అక్కడ.
कितने ఎన్ని ?
झूठ - అబద్ధము.
सच - సత్యము, నిజము.
क्या - ఏమి ?
कौन - ఎవడు, ఎవరు, ఏది.
कब - ఎప్పుడు.
क्यों - ఎందుకు.
अब ఇప్పుడు.
हमेशा - ఎల్లప్పుడు.
आज - నేడు.
कल - నిన్న, రేపు.
परसों - మొన్న, ఎల్లుండి.
कभी कभी - అప్పుడప్పుడు.
कैसे - ఎట్లు.
अभी - ఇప్పుడే.
हाँ - అవును, సరే.
नहीं - లేదు, కాదు.
ज़मीन - నేల.
चटाई - చాప.
देख - చూడు.
लिख - వ్రాయు.
जा - వెళ్లు.
रह - ఉండు, నివసించు.
पका - వండు.
बोल - చెప్పు, మాటలాడు.
हँस - నవ్వు.
कर - చేయు.
आ - వచ్చు.

1. हम तमाशा देखते हैं। మేము వేడుక (వింత) చూచుచున్నాము.
2. तू चिट्ठी लिखती है। నీవు వుత్తరము వ్రాయుచున్నావు. (స్త్రీ)
3. क्या, आप घर जाते हैं? తమరు యింటికి వెళ్లుచున్నారా ?
4. क्या, वह रोज़ नौ बजे पाठशाला जाता है? అతడు రోజు తొమ్మిది గంటలకు బడికి వెళ్లునా ?
5. मैं सात दिन से यहाँ रहता हूँ। నేను ఏడురోజులునుండి యిచ్చట వుంటున్నాను.
6. तुम कितने दिन से वहाँ रहते हो? మీరు అచ్చట యెన్ని రోజులనుండి వుంటున్నారు?
7. माँ खाना पकाती है। అమ్మ వండుచున్నది.
8. तुम झूठ मत बोलो। మీరు అబద్ధము చెప్పవద్దు.
9. (तुम) हमेशा सच बोलो। ఎల్లప్పుడు నిజము పలుకుడు.
10. आप क्यों हँसती हैं? తమరు ఎందుకు నవ్వుచున్నారు ?
11. तुम यह काम कैसे करते हो? మీరు ఈ పని యెట్లు చేయుచున్నారు ?
12. क्या वह अभी बाज़ार जाता है? అతడు యిప్పుడే బజారు వెళ్లునా ?

13. हाँ, वह अभी बाज़ार जाता है। ఔను, అతను యిప్పుడే బజారుకు వెళ్లుచున్నాడు.
14. शारदा कभी कभी यहाँ आती है। శారద అప్పుడప్పుడు యిచ్చటికి వచ్చును.
15. वे कौन हैं? వారెవరు?
16. वह घर नहीं जाता। అతడు యింటికి వెళ్లడు.

సూచన:—(1) ప్రశ్నించునపుడు హిందీలో వాక్యమునకుముందు '**क्या**' చేర్చుదురు. కాని, సామాన్యముగా సంభాషణయందు **क्या** వదలి వేసి కడపటి అక్షరమును పొడిగించి, ఒత్తి పలుకుదురు.

(2) వ్యతిరేకార్థక వాక్యములలో సహాయక క్రియలు (**हूँ, है, हैं, हो**) లోపించును.

తాత్కాలిక వర్తమాన కాలము

ధాతువునకు కర్తయొక్క లింగ వచనములననుసరించి "**रहा**" చేర్చినపిదప సరియైన సహాయక క్రియ చేర్చినచో తాత్కాలిక వర్తమాన కాల మేర్పడును.

ఉదా:—**मैं आ रहा हूँ** నేను వచ్చుచూ వున్నాను. (పుం॥)
मैं आ रही हूँ నేను వచ్చుచూ వున్నాను (స్త్రీ)
हम आ रहे हैं మేము వచ్చుచూ వున్నాము (పుం॥)
हम आ रही हैं మేము వచ్చుచూ వున్నాము (స్త్రీ)
तू आ रहा है నీవు వచ్చుచూ వున్నావు (పుం॥)
तू आ रही है నీవు వచ్చుచూ వున్నావు (స్త్రీ)
तुम आ रहे हो మీరు వచ్చుచూ వున్నారు (పుం॥)
तुम आ रही हो మీరు వచ్చుచూ వున్నారు (స్త్రీ)
आप आ रहे हैं తమరు వచ్చుచూ వున్నారు (పుం॥)
आप आ रही हैं తమరు వచ్చుచూ వున్నారు (స్త్రీ)
वह आ रहा है అతడు వచ్చుచూ వున్నాడు (పుం॥)
वह आ रही है ఆమె వచ్చుచూ వున్నది (స్త్రీ)
वे आ रहे हैं వారు వచ్చుచూ వున్నారు (పుం॥)
वे आ रही हैं వారు వచ్చుచూ వున్నారు (స్త్రీ)
यह आ रहा है ఇతడు వచ్చుచూ వున్నాడు (పుం॥)

यह आ रही है ఈమె వచ్చుచూ వున్నది (స్త్రీ)
ये आ रहे हैं వీరు వచ్చుచూ వున్నారు (పుం॥)
ये आ रही हैं వీరు వచ్చుచూ వున్నారు (స్త్రీ)

పాఠము 6.

లింగము

(1) పుంలింగ స్త్రీలింగములు తెలుగులో వలెనే హిందీలో గూడ పురుష స్త్రీ జాతుల ననుసరించి యుండును.

హిందీలో నపుంసక లింగము లేదు.

తెలుగులోని అప్రాణివాచకములైన నపుంసక లింగములు హిందీలో కొన్ని పుంలింగ ములుగను, మరికొన్ని స్త్రీ లింగములుగను పరిగణింప బడును. లింగ భేదమును తెలుసు కొనుటకు నియమములు హిందీలో యెక్కువగా లేవు. అభ్యాసము వల్లనే శబ్దముల లింగములను ఎరుగవలెను. అయినను ఈ క్రింది నియమములు కొంత వరకు అట్టి విభజనకు తోడ్పడ గలవు.

హలంతములును, ఆకారాంతములును అగు అప్రాణివాచక హిందీ శబ్దములు సాధారణ ముగ పుంలింగములుగ పరిగణింప బడుచున్నవి.

ఉదా :—**फल** పండు. **कमरा** గది.

సూచన :—ఈ పైనియమమెల్ల చోట్లనుపయోగపడదు. కావున ఒక శబ్దము యొక్క లింగము నిర్ణయించవలసినపుడు దానితో వచ్చు విశేషణమును బట్టిగాని, వాక్యమునందలి క్రియను బట్టిగాని నిర్ణయించుకోవలెను.

'**इ**' కార '**ई**' కారాంతములగు నప్రాణి వాచక శబ్దములు సాధారణముగా స్త్రీ లింగ ములగును.

ఉదా :—**तिथि** తిథి; **नदी** నది.

కాని, **पानी** (నీరు), **दही** (పెరుగు), **घी** (నెయ్యి), **मोती** (ముత్తెము), **जी** (హృదయము), అను శబ్దములు మాత్రము ఈ నియమము ననుసరించి స్త్రీ లింగములు కావ లసియున్నను, పుంలింగములుగా వాడబడుచున్నవి.

(11వ పేజీ తరువాయి)

హిందూ స్త్రీల హక్కు బాధ్యతల పునరుద్ధరణ

యావద్భారత దేశములోను వర్తించు నట్లు అఖిలభారత శాసనము కావలెనని కోరుచున్నారు.

ఈ అభివృద్ధి కరమైన మార్పు లన్నటిని చేయుచు హిందూ లాను క్రోడీకరించి ఒక చట్టముగా చేయుటకు హిందూకోడు బిల్లును ఇండియా పార్లమెంటులో ప్రవేశ పెట్టినారు. ప్రజాభిప్రాయమును రావుకమిటీ ద్వారా వివరించియే ఆ బిల్లును ప్రవేశపెట్టినారు. దానిని పూర్వాచార పరాయణులే గాక కొందరు కాంగ్రెసు ప్రముఖులు కూడ ప్రతి ఘటించుట మిగులశోచనీయము. మనమిపుడు స్వతంత్రము పొందినాము. రిపబ్లికు విధానము అవలంబించినాము. ప్రతి పురుషునకిని స్త్రీకిని సమ హక్కు ఏర్పడి సమాన రాజకీయ హక్కు బాధ్యత లేర్పడినవి గనుక, ఆస్తిహక్కుల విషయములలోను సాంఘికముగాను స్త్రీలకు పురుషులతో సమాన ప్రతిపత్తిని కలుగచేయు చట్టములను నిషేధించుట అక్రమము. కొంచెము కాలయాపన మగునే గాని హిందూ కోడ్డుచట్టము గాక మానదు. ఆస్తి హక్కుల తోపాటు ఆస్తిని చక్కగా నిర్వహించు బాధ్యతకూడ స్త్రీలకివ్వబడును. గృహస్థాశ్రమ ధర్మములను నిర్వర్తించుటలోను విజ్ఞాన వికాసములను పొందుచుండును. మన స్త్రీలు ఇంగ్లాండు అమెరికా రష్యా స్త్రీలను అనుకరింప నక్కరలేదు. భారతములోని గొప్ప స్త్రీలను అనుసరించుటయే శ్రేయోదాయకము. మనము కోరే అభివృద్ధికర మార్పులన్నియూ పూర్వకాలమున నున్నవే.

★

సీరియల్ నాటిక

భక్తిలీల

శ్రీ లంక శ్రీనివాసరావు

రంగము ౨

[ప్రదేశము : సంగ్గ మార్గము ; పట్నపు పొలిమేరలో.

ప్రవేశము : ఆచార్యులు]

ఆచార్యుడు : ఆచార్యుల వారన్న శ్రీపురంలో ప్రజలు ఎంత భయభక్తులతో నుంటారు. రెడ్డిగార్కి సైతం హడలు. కాని, మాయావిడ దగ్గరమాత్రం నాకు హడలు. రెండో వివాహం చేసుకొన్న నాలాంటి ముసలిముండా వాళ్ల గతి యింతే. యౌవనపు భార్యలు ముసలి మగలను లక్ష్యపెడతారా! హెచ్చు తగ్గూ చూస్తారా! మా యావిడ నాచే సంతలో సామగ్రిని కొనిపించి చాకలి మూటలుమోయు గాడిదవలె యీ మూటలు మోయిస్తున్నది. [illegible] చేయను.—అబ్బా! ఈ మూటలు భారంవల్ల మూపు వాచి బొబ్బలెక్కినవి. ఈ చెట్టు నీడలో కొంచెం కొంచెం ఆయాసము తీర్చుకొని పోతాను. (చెట్టు [illegible]) [illegible] తిండ్లపై మనస్సు పరుగెట్టుతుంది. ఈ చిరుతిళ్లు సంతలో కొన్నా! కొంచెం [illegible]! ([illegible]) [illegible] వేసుకొని యీ [illegible] నిక యిటు వస్తూ న్నాడు.

[illegible] తీరగా [illegible] (తొందర తొందరగా [illegible] నారదుడు ప్రవేశించును).

నారద : భక్తుడా! నాకవసరము లేదులే! త్వరపడుచున్నాడ [illegible]?

ఆచా : దయచేయండి స్వామీ! చూడగా మీరు నారదులా కనిపిస్తున్నారు. పరమభాగవతుల్లా నున్నారు.

నార : నాకంతటి ముఖస్తుతిజేయ నవసరములేదు.

ఆచా : స్వామీ ! మీవంటి సిద్ధపురుషులకు తెలియని వేముండును ?—దయ తలంచి స్వర్గసుఖం పొందటానికి ఏదేని మార్గముపదేశించాలి.

నార : అట్లయిన, ఒక వ్రత ముపదేశించెదను. దాని నాచరించువారు తరింతురు.

మధుసూదనుడు : (ప్రవేశించి) మహాత్ములారా ! నమస్కారములు.

నార : శుభమస్తు.

ఆచా : పుత్రపౌత్రాభివృద్ధిరస్తు.—మధుసూదనుడా ?—

మధు : ఔను, శ్రీ పురాచార్యులుగారూ !—ఈ మార్గమున కొక యావుపోవుట గాంచితిరా ?

[illegible] !

మధు : [illegible] ?

ఆచా : [illegible] ! ఈ [illegible].

మధు : స్వామీ! [illegible] నా యావు [illegible] మైనది. సంతకు వెదకుటకు పోయెదను.

నార : ఓహో! సంతకరుగుచుంటివా? నాకొక చిన్న మేలు జేసితివేని నీయావు లభించుటకు తగిన మార్గముం జెప్పెదను.

మధు : ఆర్యా! తప్పక శిరసా వహించెదను.

నార : ఒకకానీ వక్కలాకులు, ఒకకానీ సాంబ్రాణి, ఒకకానీ నూనెను తెచ్చియిత్తువా?

మధు : స్వామీ! నాచేత నొకకానైనలేదు. మీ కవి యెట్లు దెచ్చి యీయగలను?

ఆచా : ఇవిగో! ఈ మూడుకానులు తీసుక వెళ్లు (మూడు కానులిచ్చును).

మధు : స్వామీ! నాయావు జిక్కెడి మార్గమును తెలిపియుంటిరి.

నార : సామగ్రిని గొనితెమ్ము. పిమ్మట కర్తవ్య మెరింగింగింతును.

మధు : చిత్తము. (నిష్క్రమించును)

ఆచా : స్వామీ! మీరు విష్ణు భక్తులా! శివభక్తులా?

నార : నేను బ్రహ్మ విష్ణు మహేశ్వరులను త్రినాథుల భక్తుడను.

ఆచా : దేవుడొక్కడేగదా! ముగ్గురనెందుకు పూజిస్తూన్నారు?

నార : ఆచార్యా! మనము దేవుని అనేక నామములతోను, అనేక మూర్తులుగాను, అనేక విధంబులను పూజించుచున్నారము. ఏరూపంబున పూజించినను దేవుడు సంతోషమును చెందును.

ఆచా : అయితే యీ ముగ్గురిలో గొప్పవారెవరు?

నార : ఎవరికి వారే. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అను విచారణ సలుపరాదు.

ఆచా : నాకుమాత్రం ఓ సందేహం ఉంది. నేను విష్ణుమతస్థుడనైనప్పటికి శివునియందే అభిమానం ఉంది.

నార : "పొరుగింటి పుల్లకూర రుచి" యన్నట్లు కొందరు తమ తమ మతమునందుగల సత్యాసత్యము లెరుగక అన్యమతము నపేక్షించుచుందురు.

ఆచా : అన్యంలోనే రుచుంది స్వామీ!

నార : (పరిహాసముగా) అన్యాయమందు రుచి గలుగునప్పుడుండవచ్చునేమో!

ఆచా : నేను మా మతస్థుల కండ్లు కప్పటానికే యీ నామాలూ గీమాలూ ధరిస్తూన్నది. కాని శివుడే గొప్పవాడు. ఎంచేతా అంటే రాతి విగ్రహాలు మనుష్యులు చేయటం నేర్చుకొన్నాక విష్ణుమతం వచ్చింది. లేకుంటే బోడిరాళ్లే అన్ని దేవాలయాలలో నుండవలసిందే! శివుడు పురాతన దేవుడు. అందుకే లింగాకారాన్ని పూజిస్తారు. శంకరాచార్యుడు, మధ్వాచార్యుడు, రామానుజులూ మొదలైనవాళ్లు ఏదో మసిబూసి యిలా చేశారు. ఈ విష్ణువుని మీదికి తెచ్చారు.

నార : ఆచార్యా! మనము వాదప్రతివాదములతో దర్కించి కాలమును వ్యర్థముజేయక దేవుని భజించవలెను. జీవునికి భక్తియే ప్రధాన వస్తువు.

ఉ॥ కాలము వమ్ముసేయక, చి
కాకు మనంబున బాసి, వాదన
ల్మేలని వీడి, సంతత మ
మేయ ప్రభాకరుడైె వెలుంగు శ్రీ
లాలను డైన దేవు నెడ
లాలిత భక్తి లయింప జేసి, యే
లీల భజించినన్ సుఖ ను
లీలల మోక్షము చేయి జిక్కదే!

మధు : (ప్రవేశించి) స్వామీ! ఇవిగో మీరు కోరిన వస్తువుల దెచ్చియున్నాను. (సామగ్రిని నారదున కొసంగును)

నార : సూక్ష్మమున మోక్షమును బొందుటకును, మిక్కిలి పేదవారు సైతము భగవంతు నర్చించి సకల సుఖములు పొందుటకును, ధనధాన్యాది భాగ్య భోగంబుల దుల దూగుటకును, మీకొక క్రొత్త వ్రతమును ఉపదేశించు

చున్నాడను. అదియే శ్రీ త్రినాథవ్రతము. దాని నాచరించి ముముక్షువులు గండు.

మధు : స్వామీ! ఈ వ్రతమే పర్వదినమున జేయవలెను?

నార : దేవుని భక్తితో గొలుచుటకు తిథి వార నక్షత్రములు గావలయునా? ప్రాణములు పోవుచున్న రోగికి ముహూర్తమును నిర్ణయించి యౌషధముల నొసంగుదురా?

ఆచా : అయితే యీ వ్రతాన్ని ఎప్పుడుబడితే అప్పుడే చేయవచ్చునా?

నార : ఔను, ఈ క్షణమే చేయుదము.

ఆచా : కడుపునిండా భుజించియేనా? ఉపవాసం చేయొద్దా?

నార : అవసరములేదు. ఆకలి దప్పులతో మనస్సును నిశ్చలముగా నిలుపుట కష్టము. కావున ఉపవాసములతో బనిలేదు. నిశ్చలమైన మనస్సే యీ వ్రతమును జేయుటకు ప్రధానము.

ఆచా : నివేదనకు పదార్థము?

నార : ఏమియూ నవసరము లేదు. కలిగినవారు తమ యిచ్ఛానుసారముగా నర్పించవచ్చును. కానీ ప్రసాదము కొరకు తగవులాడరాదు. ఎవరికెంత లభించినదని జగడమాడరాదు. ఎవరికెంత లభించిన నంతే భాగ్యమని తలంచవలెను.

ఆచా : సరే, ఈ వ్రతం చేయటానికి ఎంత పైక మవసరముంటుంది?

నార : ఈ వ్రతము జేయుటకు మూడుకానుల సామానులు మాత్రము చాలును.

సీ॥ నిర్మలమైనట్టి । నిశ్చల మానస
ధామమై త్రైనాథ । స్వాములకును
ఒక కాని సాంబ్రాణి । ఒక కాని నూనెను
వక్కాకుల కొర । కొక్క కాని
సమకూర్చి తెచ్చిన । సామగ్రి సమముగా
మూడువంతులు వేసి । ముప్వురకును
యర్పించి భక్తితో । నర్పించు వారలు
మోక్షము వేగమే । పొందగలరు.

తే॥ గీ॥ తిథియు, వారము నక్షత్ర । విధియులేదు
ఉపవసింపగ బనిలేదు । యుర్విలోన
నెవ్వరైనను నీవ్రత । మెచ్చుటైన
నాచరింపగ జెల్లునో । యార్యులార ।

మధు : గురుసత్తమా! ఇది వింత వ్రతముగా నున్నదే! త్రినాథులను బూజించుటకు మనస్సు వేగిరపడుచున్నది. వ్రతమును జేయింపుడు.

నార : అట్లయిన, బ్రహ్మ విష్ణు మహేశ్వరులను బ్రతిష్ఠింపుడు. వక్కాకులను త్రిమూర్తులకు సమముగా బంచిపెట్టుడు. నూనెను మూడు ప్రమిదలందు బోసి ముమ్మూర్తులకు దీపముల నర్పించుడు. సాంబ్రాణి ధూపమును త్రినాథులకు సమముగా సమర్పించుడు.

(మధుసూదనుడును, ఆచార్యుడును నట్లు చేయుదురు)
ఇంక మీ మానసముల నిశ్చలముజేసి ధ్యానింపుడు.

(నారదుండొక్కక చరణము బాడుచుండ పిమ్మట మధుసూదనాచార్యు లిరువురు బాడుచుందురు)

జాయ్! త్రైనాథులకును
జాయ్! త్రిలోక వందితులకు
జాయ్! త్రిలోక పాలురకు
నమో! నమో!! నమో!!!

(అందరు భజించుచుండ పూజామంటపమందు త్రిమూర్తుల చిహ్నములుగా రాతి విగ్రహములును, ఒక రత్నహారమును బుట్టును.)

నార : (ధ్యానానంతరమున)—ఆహా! ఆహా! వీక్షించితిరా! శ్రీ త్రినాథుల మహిమా విశేషంబున నీ ప్రతిమంటపమందు బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు త్రి త్రినాథుల రాతి విగ్రహము లుద్భవించినవి. ఎట్టి మహత్తు! ఆహా! చూచితిరా! ఒక రత్నహారంబున్నూ యిందు బుట్టినది. ఇట్టి వ్రతము జేసినవారికి రత్నరాసుల కేమి కొరత?

ఆచా : ఓహో! ఓహో! చాలా అద్భుతంగా నుందే!

మధు : ఆహా! ఏమి మహత్తు! అద్భుత సంఘటనము!

నార: మీ ఇరువురుగదా! ఈ ఒక్క హారము నెట్లు పంచుకొనగలరు?

ఆచా: మధుసూదనంగారికి ధనాపేక్ష లేదండీ! వారు స్వీకరించరు.

మధు: గురువర్యా! నాకారత్నహార మవసరములేదు. శ్రీ త్రినాథుల చిహ్నములగు నాకా రాతివిగ్రహములే నొసంగుడు. వానినే శిరసావహించి పూజా పురస్కారములతో నర్చించి ధరించుకొందును.

నార: మధుసూదనా! నీవు రత్నహారమును స్వీకరింపకున్నాడవు. మిక్కిలి యదృష్టహీనుడవు. నీ వన్ని నాళ్లు భజించినను, ఎన్ని వ్రతములు చేసినను ఇట్టి రత్నహారములను బడయజాలవు. దీనిని పెరికి రత్నములను మీ యిరువురకు ఇత్తునా?

ఆచా: అవసరములేనివాని కెందుకండీ బలవంతంగా కట్టబెడతారు? పెరికివేస్తే దాని అందమంతా పాడౌతుంది.

మధు: దేవా! నాకేమియు నవసరములేదు. ఈ విగ్రహములనే పూజించుకొనెదను. అదియే పరమ సంతోషము. నాకు ధనమేల? ధనము పెరిగిన మదము పెరుగును. మదమువలన మాత్సర్యము—ఇట్లే కామ క్రోధాది లోభ మోహములు పెరిగి భగవంతుని ధ్యానమున కాటంకము గలిగించును.

నార: నీవు పరమభక్తుడవు, పరమభాగవతుడవు. నీయావు నీ కుటీరము కడకుబోవుచున్నది. నీ భార్యాబిడ్డలు సుఖంబున నున్నవారు. శీఘ్రముగ బొమ్ము. ఇవిగో! శ్రీ శ్రీ శ్రీ బ్రహ్మ విష్ణు మహేశ్వరుల చిహ్నములను రాతి విగ్రహముల దీసికొని బొమ్ము. (విగ్రహములను మధుసూదనుని శిరమునందుంచి) ఇవి మఱ్ఱిక్రింద బ్రభ [illegible]. కాని, నీ కుటీరము చెంత నొక మఱ్ఱి వృక్షముక్రింద బ్రతిష్ఠించి పూజించుచుండుము. నీ జన్మ సఫలము గాంచినది. నీవింక జనుము.

మధు: ధన్యోస్మి! ధన్యోస్మి!—దేవా!

చం॥ కొలిచెద శ్రీ త్రినాథులను
కోరి వ్రతంబుల జేయుచుండెదన్
బ[illegible] పాపము లీడ్చువ
[illegible] దన్
తెలిసె మహాత్మ్య మింకగడు
తేటగ నారదు కాలమెల్ల స
త్ఫలము ఫలించె జన్మ పరి
పక్వము బొంది తరింప బూనెదన్.

(పోవును)

నార: ఆచార్యా! నీవీరత్నహారమును గైకొమ్ము. నీవు భక్తితో నీవ్రత మాచరించుచు మీ పట్టణ ప్రజల కుపదేశించి వారిచే వ్రతముల జేయించి వారందరు ధన ధాన్యాది భాగ్యభోగములందు నటుల జేయుము. పొమ్ము (రత్నహారమొసగ నాచార్యుడు గైకొనును).

ఆచా: మహానందము—(పోవుచూ తనలో) ఆ!—ఈ వ్రతాన్ని ప్రజల కుపదేశించాలీ! వాళ్లంతా ధనవంతులై నన్ను గౌరవిస్తారా? ఎవరికీ చెప్పక మా యావిడచే జేయించి భాగ్యభోగాలతో సుఖంగా గడుపుదును! ఈ రత్నహారం మా పెట్టి మా యావిడ్కి కనకంలా నా వెంట త్రిప్పుదును! (నిష్క్రమించును).


నార: ఈ కథావిధాన మెట్లు పరిణమించునో ఆలోకించవలసి యున్నది. (నిష్క్రమించును.)

(తెర వ్రాలును)

సశేషము

★





వీరసేనుడు

ప్రపంచ విఖ్యాత కవి షేక్సుపియర్ వ్రాసిన 'ఒథెల్లో దిమూర్' అనే విషాదాంత నాటకానికి అనువాదం యీ వీరసేనుడు. అనువాదకులు విద్వాన్ శ్రీ చావలి లక్ష్మీనారాయణగారు బి.ఏ., బి.ఇడి., ప్రతులకు గ్రంథకర్త పేర పొన్నూరు (గుంటూరు జిల్లా)కు వ్రాసుకొన వచ్చును. ఖరీదు 1-4-0.

ఒథెల్లో కథ తెలియనివారుండరు. ఇటలీదేశపు మంత్రి కూతురు డెస్డిమోనారూపసి. ఆమె పరాయి దేశపువాడు, పరాయి మతపువాడు, కారు నల్లనివాడు అయిన ఒథెల్లోను, అతని ధైర్యసాహసాలకు మెచ్చి పెళ్లి చేసుకుంటుంది. వారి పరస్పర ప్రేమానురాగాలకు హద్దు వుండదు. తనకు రావలసిన పైవుద్యోగం కేశియో అనే ఒథెల్లో స్నేహితుడికి రావటంతో ఇయాగో అనే రాజోద్యోగి కేశియోపైన పగపట్టి, అతనిని ఏవిధంగానైనా నాశనంచేయ ప్రతిజ్ఞ పడతాడు. ఈ ప్రయత్నంలో ఎవరు ఎంతమంది ఎట్లా నశించినా అతను లెక్కచేయకుండ స్వార్థపు పట్టుతో ఆరంభిస్తాడు. అందగాడు, మాటకారి అయిన కేశియోతో డెస్డిమోనాకు సంబంధము వున్నట్లు ఒథెల్లోకు సందేహం కల్పించి ఋజువులు తానే సృష్టించి చూపుతాడు. అంత అతిగా ప్రేమించటాన ఒథెల్లోయీదెబ్బకు తట్టుకోలేక, అసూయా ద్వేషాలకు గురిఅయి, భార్యగొంతు పిసికి చంపుతాడు. ఇంతలో ఇయాగో కుట్రయావత్తు తెలిసి తాను కూడ పొడుచుకు చచ్చిపోతాడు. ఈ పాశ్చాత్య పాత్రలకు గ్రంథకర్త భారతీయ పేర్లనుపెట్టి కథ మన దేశములో జరిగినట్లుగా వ్రాశారు. ఒథెల్లోయే వీరసేనుడు. డెస్డిమోనా పద్మాదేవి.

ప్రథమాంకములో పద్మాదేవి వీరసేనుడితో వెళ్లిపోయిన సందర్భములో ఆమె తండ్రి వీరసేనుడితో "నా ముద్దులతల్లి తన జాతి ధనికులను సుందరులను తృణీకరించి రక్షకస్థానమున వుండే యీ నల్లని పరాయి పిశాచము దగ్గరకు వస్తుందా? ఇందులో ఏదో మోసము వున్నద"ని అంటాడు. మూడవ అంకములో సేనాని (ఇయాగో) కూడ వీరసేనునితో "ఆ మెరుపు వెనుకటికం జే తెలివిన పడి తన జాతి మూర్తులతో మిమ్ము పోల్చుకుని పశ్చాత్తాపపడునేమోనని భయముగా వున్నదం"టాడు. ఇటువంటి ప్రస్తాపనలవల్ల ధాన్య కటకపు మంత్రికూతురు పద్మ వలచిన వీరసేనుడు ఆ ప్రాంతపువాడుకాడని, నల్లనివాడని తేల్తున్నది. కాని పాండ్యుడని అతనిని అంటారు. అందువల్ల పాండ్యదేశపు వాడన్నమాట. కాని కథా సందర్భాన్ని బట్టి దక్షిణాపథములోనే వున్న ధాన్య కటకపు పడుచు పాండ్య దేశీయుడిని పెళ్లాడి అతడు నల్లనివాడయినంత మాత్రాన తన జాతే పోయినట్లు పశ్చాత్తాపపడవలసిన కారణం కనిపించదు. మూలములోని ఒథెల్లో చీకటి ఖండమని పేరుపడ్డ ఆఫ్రికా ఖండములోని మొరాకో నివాసి అయిన మూరు జాతివాడు. వాతావరణాదులవల్ల కారు నల్లని పెద్ద విగ్రహము గలవాడు. ఇస్లాము మతావలంబి. కాని డెస్డిమోనా ఇటలీదేశపు స్త్రీ. మంచుమించిన తెల్లని రంగుగల కుసుమ కోమలి. ఒక మంత్రికూతురు. క్రైస్తవి. మనసులు ఏకమవుటవల్ల వారిద్దరికి పెళ్లి అయింది కాని అంతరువు చాలా వున్నది. ఆ సంగతి ఒథెల్లో మరువలేదు. అందువల్లనే కు

యుక్తులకు తీసిపోవని ఇయాగో యీ కారణమే ఎత్తిచూపి డెస్డిమోనాకు కేశియోపై వలపు కలిగిందని చెప్ప సాహసించటము, ఒథెల్లో కొంత అనుమానపడటం జరుగుతయ్. అందువల్ల స్థలపాత్రలను అనువాదకులు మూలములో మాదిరే వుంచితే యీలోటు వచ్చేదికాదు. ద్వితీయాంకములో మేధావి వీరసేనుడితో "మా కటకపు స్త్రీలు తమ దుండగములను భగవంతుడు చూచుటకైనను ఒప్పుకొందురుగాని భర్తలకా పొలకువయే పొడకట్టనీయరు. వారి నైతికాదర్శము చేయకుండ విడుచుటకు కాదు; తెలియకుండ దాచుట" అంటాడు. ఇది ఇటలీకి సరిపోతే పోవచ్చునుకాని కటకానికి ఎట్లా సరిపెట్టటం? మన దేశంలో కటకపు ప్రాంతపువారు తప్పుడువారని, పాండ్యులు మంచివారని చెప్పగల అవకాశాలు మనకు లేవు. అందువల్ల భారతీయ పేర్లనిచ్చి అసలు వాతావరణం కల్పించినా కానికంటె ఆ పాశ్చాత్య వాతావరణం అట్లాగే వుంచగలిగితే బాగుండేది.

రెండో అంకములో తాగుడు దృశ్యములో మేధావి "నీ ఆంగ్లేయుడు, నీ బోడి చైనీయుడు తాగుడులో భారతీయునకు వీసమునకు కొరగారు. నీ చైనీయునికి చావు తెచ్చిపెట్టి, నీ యాంగ్లేయునికి ముచ్చెమటలు కమ్మించునంత త్వరలో భారతీయుడు రెండవబుడ్డి తాగగలడు" అని అంటాడు. అందుకు రెండవవాడు "ఓ భరత మాతా ఎంత కమ్మనిదానివే" అంటాడు. ఈ సంభాషణ అతకకుండ వెకటుగా కనిపిస్తుంది. తాగుడు జీవితావసరమని ఎంచే పాశ్చాత్య దేశాలు ఒకదానితో ఒకటి పోల్చుకుని గొప్పపడితే బాగానే వున్నది; కాని తాగుడు కేవలం దుర్వ్యసనంగా భావించే మన దేశంలో యీ సంభాషణ సహజంగా కనిపించదు. మొత్తంమీద కథను భారతీయం చేయటంతో ఇటువంటి అనవసరపు చిక్కులు చాలా వచ్చినై.

ఇంక భావసంగతి—"ఏమిటి వి శేషములు నచెళి!" అని రెండుమూడు చోట్ల కనిపిస్తుంది. పుస్తకమంతటు మద్రాసు అరవ సోదరులు అన్నట్లు అది, వాడు అనే తప్ప ఆమె, అతను, ఆయన మొదలయిన ప్రయోగాలు కనిపించవు. మేధావి వీరసేనుడితో "దేని సంగతి దాని భర్తకే చెప్పినగాని ఇంకొకదానికి బుద్ధిరాదు" అని అంటాడు. ఇతడు 'దానికి' అర్థం భార్య కాబోలు. పై వుద్యోగితో పెద్ద వాడితో మాట్లాడుతున్నప్పుడు భార్యను గురించి చెపుతు ఒక వస్తువును గురించి చెప్పినట్లు అది, దానికి అనటం ఎంతమాత్రం సభ్యత చూపించటంలేదు. మూడో అంకములో నాయిక అయిన పద్మాదేవి "ఆర్యపుత్రుని నీవు ప్రేమించు మాట నిజమే. దీర్ఘకాలమునుండియు వాని నెరుగుదువు" అంటుంది. పరాయిపురుషుడు సత్యకుడితో, తన భర్తను గురించి, ఒక మాటలో ఆర్యపుత్రుడు, రెండవమాటలో వాడు, ఇదెక్కడి పదాల కూర్పో అంతుపట్టదు. ఎటువంటి స్త్రీగాని భర్తను వాడు అనదు. అందులోను ఆర్యపుత్రుడు అని గౌరవించిన మరుక్షణాన్నే వాడు అనిపించటం చాల అన్యాయం. పద్మాదేవి పాత్ర ఔచిత్యాని [illegible]. తృతీయాంకములో నీల "నాని యిచ్చట తీర్చుటకే నేనీ పని చేసినను" అంటుంది. ఆ 'వాడు' ఎవరో పసి పిల్లవాడు కాదు, ఆమె భర్తగారే. ఒకచోట వీరసేనుడు 'నా ప్రియ ప్రేమ' అంటాడు. ప్రేమ తీపినిపట్టి ప్రియము కూడ అవుతుందని అనుకోవాలి. అచ్చు తప్పులు ఎక్కువగానే వున్నయ్. పద్యాలు విర్చి కూర్చి వ్రాసినట్లు కనిపించుతయ్. రసవంతముగా ఇంపుగా సాఫీగా నడచినట్లు తోచవు. అంతలోను చివరి అంకము పరవాలేదనిపించు చున్నది. షేక్స్‌పియర్ మహాకవి వ్రాసిన ఒథెల్లో అనుకోకుండ తెలుగు 'వీరసేనుడు' మాత్రమే అనుకుని చదవ గలిగితే ఇన్ని లోపాలు స్ఫురించకపోవచ్చు.

అ. గిరిజ.

* * *

హాస్యకుసుమాలు—ప్రథమ గుచ్ఛము.

కూర్పు: "గుంటుపల్లి"

ప్రకాశకులు: హాస్యసుధ ప్రచురణలు,

మైలాపూరు, మద్రాసు-4.

వెల 8 అణాలు.

హాస్యము నవరసములలో నొకటి. హాస్యము చేయగలుగుట సులభ సాధ్యముగాదు. ఈ కళలో ప్రావీణ్యము

పొందుటకు మనిషికి పాండిత్యము, యుక్తి, సమయస్ఫూర్తి అవసరము. ఒక్క మాటలో, ఒక్క రేఖలో (Cartoon) హాస్యము నిమడ్చ గలిగినవారున్నారు. ఎంత క్లుప్తములో దీని నిమడ్చగలిగితే వారంత ప్రజ్ఞాశాలురగన చెప్పను. ఏమిటో కతమాటు, ఎకసెక్కెములకె నవ్వుకను గొలిపినంత మాత్రమున దానిని హాస్య మనలేము. సభ్యుడు, విచారశీలుడునగు మానవునికి నవ్వును గొలుపగలిగిన వాక్యమే నిజమైన హాస్యము. ఇట్టి హాస్యపు సంఘటనలు 200 యీ పుస్తకములో "కుసుమముల" పేరున ప్రచురింపబడినవి. మఱియు హాస్యరసముయొక్క నిర్వచనము విపులముగా వ్రాయబడినది. వీనిలో కొన్ని మన మిగతవారు విన్నవే అయినప్పటికీ, మరికొన్ని నిజముగ "కుసుమము"లే అన [illegible] ఈ "హాస్యకుసుమాలు" మనస్సు నానంద పఱచి, మనల నవ్వింపగలవు.

—క. రం.

* * *

ప్రేమైకజీవులు

రచయిత : ఇందుకూరి సత్యనారాయణరాజు.

ప్రచురణాలయము : ఆంధ్రా ప్రింటింగ్ హౌస్, మదరాసు-7.

ఇది ఆరు చిన్న కథల సంపుటి. ఈ ఆరు కథలు చదువుటకు ఒకదాన్ని మించి యింకొంటి ఎక్కువ వుత్సాహకరముగ నున్నది. అచ్చు చక్కగ నున్నది. భాష సులభముగ నున్నది. ఇందు ముఖ్యముగ "అగ్ని" అనే కథ ఎక్కుడుగ నీతిని కనపరుస్తున్నది. [illegible] చిన్నబిడ్డలతో ఆ ముక్కురులచేతిలో చావున కిద్పగించుతుంది. ఇంచుమించు అన్ని కథలలో నీతి చక్కగ యిమిడియున్నది. కొన్ని కథలు ప్రేమప్రాధాన్యముగ నున్నవి. అందుకే "ప్రేమైకజీవు"లని ఈ పుస్తకమునకు పేరిడిరి.

* * *

అంధుడు

రచయిత : కనకమేడల వెంకటేశ్వర్లు, రాష్ట్రభాషా విశారద.

పబ్లిషర్స్ : రామా అండ్ కో., ఏలూరు.

వెల రూ. 0-8-0.

ఇది పద్యకావ్యము, అయినప్పటికీ చదివిన చక్కగ బోధపడుచున్నది. ఇందలి కథ అంధుడు తన జీవితమును సముద్రపు ఒడ్డున కూర్చుని సముద్రునకు తెలుపుచుండుట. స్వాభావికముగ ప్రస్తుత ప్రపంచములో కలుగు సంఘటనలీ అంధుని జీవితములో విశదమగు చున్నవి. అంధుడు చదువతగ్గ పుత్తము.

——రా. లక్ష్మి.

పెరుగుచున్న పసిబిడ్డలకు విటోఫెర్రిన్ అత్యవసరం



పసిపాపలకు విటో ఫెర్రిన్ యిచ్చి, వారి పెరుగుదలను గమనించండి. పెరుగుచుండు పాపాయిలకును, వ్యాధుల నుండి తేరుకొనుచుండువారికిని, శరీరాభివృద్ధికి అత్యవసరమగు వస్తువిశేషాలు ఇందులో ఉన్నవి.

I·T·L

తయారుచేయువారు:
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరీ లిమిటెడ్,
మల్లేశ్వరం, బెంగుళూరు.

విక్రయ ప్రతినిధులు: బెస్ట్ & కంపెనీ, లిమిటెడ్,
పోస్టు బాక్సు నం. 68, మద్రాసు.

రీటా హెయిర్ టానిక్

తల వెంట్రుకలను పెంచును

రీటా కురుల్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలు పెంచుటకు అద్భుతమైన హెయిర్‌టానిక్.

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పే[illegible] కొరుకుట, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేలకొలది [illegible] గుణమును పొందియున్నారు [illegible] రీటా వాడుడు. రీటా [illegible] దొరకును.

వెల సీసా 15 అణాలు.



RITA

HAIR TONIC

